గీతా కౌముది

ప్రథమ భాగము

బందరు సాంగవేద విద్యాలయ శంకర మఠ,

గాయత్రీ పీఠ వ్యవస్థాపకులు

శ్రీ గాయత్రీ పీఠాధిపతులును అగు

శ్రీ విద్యాశంకర భారతీ స్వాములవారిచే

విరచితము

ప్రాప్తి స్థానము :

శ్రీ గాయత్రీ పీఠము

శంకర మఠము

బందరు (కృష్ణాజిల్లా)

జగద్గురువులైన శ్రీ ఆదిశంక భగవత్పూజ్యపాదులకు

అంకితము

"వృష్తకేశాయచ" అని వేదములో వర్ణింపబడిన ప్రకారము ఆ పరమేశ్వరుని వృప్తకేశరూపులు, కలియుగ జ్ఞానావతారులు నైనట్టియు,

ఊనషోడశ వయఃకాలములో భాష్యప్రకరణార్థమై అనుగ్రహించిన సర్వజ్ఞులైనట్టియు,

అపౌరుషేయము వైజ్ఞానపేటికలనదగు ఉపనిషత్తులలోని అద్వైత సిద్ధాంతమును ఉద్ధరించి ప్రచారముచేసి, సర్వదుర్మతములను ఖండించి, అద్వైతమునకు ఆధ్యాత్మిక సామ్రాజ్య పట్టాభిషేకమును గావించి భారత దేశములో చతుర్దిశలందును పీఠచతుష్టయమును అమర్చి, షణ్మతముల గూడ స్థాపించి 'జగద్గురువులు' అను సార్థక బిరుదముతో విరాజితులై నట్టియు,

శ్రీమదాది శంకర భగవత్పూజ్యపాదులకు వారి
యనుగ్రహవిశేషముచే రచింపబడిన

గీతా కౌముది

అను ఈ గ్రంథమును బద్ధాంజలినై అంకితము చేయుచున్నాను.

శంకరమఠము, **విద్యాశంకర భారతీస్వామి.**
బందరు. శ్రీ గాయత్రీ పీఠము.

పీఠిక

భగవద్గీతను అనుసరించి నేను అనేక ప్రదేశములలో ఉపన్యసించు చుండగా వినిన శ్రోతలు ఈ విధంగా గీతను విషయవారీ విమర్శతో అందరికి సులభముగా తెలియులాగున చెప్పుట చాలా బాగున్నదనిన్ని, ఈ పద్ధతిలో గ్రంథమును రచించినయెడల సంస్కృతజ్ఞానములేని జిజ్ఞాసువులకు ఎంతో ఉపయోగించి ఆధ్యాత్మికచింతను వృద్ధిచేయుననిన్ని నాతో చెప్పుటచేత నేనీ గ్రంథము రచించితిని. గీతలోని వివిధ విషయములను ఈ గ్రంథము విశదము చేయుచున్నది. కనుక దీనికి గీతాకౌముది అని పేరుపెట్టుట సంభవించినది. దీనిలోని అధ్యాయములకు కిరణములని పేరు.

గీతకు శంకరులు రచించిన భాష్యమునున్ను, ఇతర వ్యాఖ్యానములున్ను చూచి అన్నింటి సారమును అందరికి తెలియులాగున, ముఖ్యంగా సంస్కృత భాషాజ్ఞానము లేనట్టిన్ని, ఆంగ్లవిద్యావిజ్ఞానము కలిగినట్టిన్ని వారికి సులభముగ తెలియులాగున విషయవారీగా విభాగముచేసి యుక్తులతోడను, ఆధునిక సైన్సు విజ్ఞానము ననుసరించిన్ని సులభశైలిలో ఈ గీతా కౌముదిని రచించినాను.

అందరికి తేలికగ అందుబాటులో నుండుటకై ఈ గీతా కౌముదిని మూడు భాగములుగ విభాగము చేసినాను.

ఈ గ్రంథము దీనిలో మొదటి భాగము. దీనిలో ఉపోద్ఘాతరూపముగ గీతా ఆవశ్యకత, గీతా విశిష్టత, గీతా అవతరణము. గీతాతత్త్వము అని నాలుగు కిరణములను వ్రాసి తరువాత గీతలోని మొదటి మూడు అధ్యాయములను 8 కిరణములలో విశదీకరించినాను.

నేను 1965 సం॥లో కాకినాడలో గీతోపన్యాసము లిచ్చుచున్న కాలములో మొదటి భాగమగు నీ గ్రంథమును అచ్చు వేయుటకు గాను Masterman Press యజమానులగు శ్రీ పోతాప్రగడ

కృష్ణమూర్తిగారితో చెప్పగా వారు తమ సహజమైన ఔదార్యముతో ఈ గ్రంథమున ఉచితముగానే అచ్చు వేయించి యిచ్చెదనని చెప్పి, వారికి ఎన్నో వత్తిడిగల పనులున్నను ఈ గ్రంథమును త్వరలోనే అచ్చు వేయించి యిచ్చినారు.

ఇంకను తహశ్శీల్‌దారు ఉద్యోగమును చేసి రిటైరుఅయి శివాలయ ప్రతిష్ఠ, పురాణకాలక్షేపమందిర నిర్మాణము మున్నగు అనేక భగవత్కార్యములను చేసిన ఔదార్యవంతులగు శ్రీ యేచూరి సీతారామారావుగారు ఈ గ్రంథము అచ్చుకు కావలసిన కాగితముక్రింద 6 రీముల తెల్లకాగితమును ఇచ్చి తోడ్పడినారు.

ఇట్లు ఈ గ్రంథముద్రణకు తోడ్పడిన శ్రీ పోతాప్రగడ కృష్ణమూర్తి గారికిని, యేచూరి సీతారామారావుగారికిని సకల శ్రేయస్సులు కలుగుగాక అని మా నారాయణ స్మరణ పూర్వక ఆశీస్సులు.

మరియు ఈ గ్రంథమును చదివి చక్కని ప్రశంసలను గావించిన శ్రీ కుప్పా శ్రీఆంజనేయశాస్త్రిగారు, జటావల్లభుల పురుషోత్తం ఎం.ఏ. గారు, శ్రీ బులుసు వెంకటేశ్వర్లు ఎం.ఏ. గారు, మల్లావజ్ఝల వెంకట సుబ్బరామశాస్త్రిగారు, భాగవతుల కుటుంబరావు ఎం.ఏ. గారు, లంక సీతారామశాస్త్రిగారు, పుల్లెల రామచంద్రుడు ఎం.ఏ. గారు, అనువారలకు సకల శ్రేయస్సులు కలుగుగాక అని మా నారాయణ స్మరణ పూర్వక ఆశీస్సులు.

– విద్యాశంకర భారతీస్వామి.

శ్రీ శ్రీ శ్రీ గాయత్రీ పీఠాధిపతులు శ్రీ శ్రీ విద్యాశంకర భారతీస్వాముల వారి "గీతా కౌముది" యను గ్రంథమును - 1 సావధానముగా జూచితిని. పదునెనిమిది యధ్యాయములతో యీత త్త్వబోధక గ్రంథమును సామాన్యు లర్థము చేసికొన జాలరు, ఎంతయో గురు- దైవకటాక్షముండి యెన్ని యో వందల పర్యాయము లేకాగ్రచిత్తతతో మననము చేసిన గాని యందలి రహస్యము కరతలామలకముగాదు. అట్టి యీగ్రంథము శ్రీ స్వామివారికి కై వశమగుట లోక కల్యాణ దాయకము.

శ్రీశ్రీ స్వామివారు ఈ గ్రంథ మెందుకు పుట్టెనో యెట్లు పుట్టెనో అను నుపోద్ఘాతమునుండి యామూలాగ్రము సందర్భపురస్సరముగ వివరించినారు. ఈ గ్రంథమునందు కర్మ-భక్తి- జ్ఞాన యోగముల తత్త్వ ముపదేశింపబడినదని యందఱు స్థూలదృష్టితో నెఱుంగుదురుగాని యా యోగ ముల సూక్ష్మదృష్టితో నిరూపించు వారు మిక్కిలితక్కువ, సంఖ్యలో నుందురనుట నిర్వివాదము .

కాగా- శ్రీశ్రీ స్వామివారు ప్రత్యధ్యాయమునకు సంగతిని చక్కగా ప్రదర్శించుచు నాయా యధ్యాయములందలి విషయమును వివరించుటయేగాక ప్రతిషట్కము యొక్క ముఖ్య భావమును తద్రహస్యమును సుబోధముగా వివరించినారు. కావున అక్షరజ్ఞానము, ఆధ్యాత్మిక విషయపిపాసగల ప్రతి వ్య క్తికి గీతారహస్యమును ఈ గ్రంథము కరతలామలక మును. - చేయుననుట నిర్వివాదాంశము. స్వతస్సిద్ధముగా అద్వైతతత్త్వ (బోధ) ప్రచారబద్ధ కంకణు లైనను నాకుగల యత్యంతోత్సాహముతో నిటులనే సూత్రభాష్యోప నిషద్భాష్య రహస్యములనుగూడ ప్రపంచనమునకు ప్రసాదింతురు గాక యని శ్రీ శ్రీ స్వామివారికి విన్నవించు కొనుచున్నాను.

ది. 18-12-66

"సర్వతంత్రవిశారద"
కుప్పా శ్రీ ఆంజనేయశాస్త్రి
24/110 ఖొజ్జల్లిపేట,
మచిలీపట్టణము.

శ్రీశ్రీశ్రీ గాయత్రీ పీఠాధిపతులు శ్రీమత్పరమ హంస పరివ్రాజ కాచార్యవర్య శ్రీశ్రీశ్రీ విద్యాశంకర భారతీస్వాములవారు 1965వ సంవత్సరములో కాకినాడలో నొసగిన భగవద్గీతోపన్యాసములను విను భాగ్యము గల వారిలో నేనొకడను. వందలకొలది విద్యాధికులతో గూడిన యాసభలలో స్వాములవారు నిశిత విమర్శనాశక్తితో గీతా ప్రవచనము గావించి సకలసదస్య హృదయావర్జనము గావించిరి.

ఇట్టి యమూల్యవిషయములు గ్రంథస్థము లై ముద్రణము పొందుచో నాంధ్ర పాఠకావళికి శాశ్వతోపకారమగునని యానాడే శ్రోతలనుకొనిరి. అది నేటికి నెరవేరినందులకు సంతసించుచున్నాను. గీతపై ప్రజలకుగల శంకలకు తృప్తికరమైన సమాధానము చెప్పుటలో శ్రీవారందెవేసిన చేయి. నూతన శంకలను రేకెత్తించుటయు వానిని ప్రత్యుత్తరించుటయుకూడ స్వాముల వారికి విలాసము. విషయ చాలనము సిద్ధాంత స్థాపనమునకు ముఖ్యమైన సాధన మగుటచే శ్రీవారవలంబించిన పద్ధతి కడుంగడు శ్లాఘనీయము. ఈ గీతా కౌముది ప్రథమ భాగము చదివిన వారు ద్వితీయ భాగమునకై యుత్కంఠతో నిరీక్షింతు రనుటలో సందియము లేదు.

ఆర్ష విద్యాభూషణ,
జటావల్లభుల పురుషోత్తం, ఎం. ఏ.

శ్రీ శ్రీ శ్రీ విద్యాశంకర భారతీస్వాముల వారి గీతోపన్యాసములు విను మహాభాగ్యము కలిగినందుకు నే నెంతయు ధన్యుడనని భావించితిని. వారి యుపన్యాససారాంశము గ్రంథ రూపమునఁ బ్రకటింపఁబూను టాంధ్రుల అదృష్ట భాగ్య మనియు నానిశ్చయము.

భగవద్గీత పరీక్షలు పెట్టి విద్యార్థులను ప్రోత్సహించిన కీ॥శే॥ శ్రీ న్యాపతి సుబ్బారావుపంతులుగా రొకప్పుడు "నీవు పరీక్షకుఁ గూర్చుంటివా" యని నన్నుఁ బ్రశ్నింపగా "గీతాపరీక్ష శ్రీకృష్ణ భగవాను నెదుట నీయఁగోరుచున్నాన"ని జవాబు చెప్పితిని. మిగిలినవన్నియు నటుంచి ఒక్క భగవద్గీతనుమాత్రమే లోకమున కిచ్చియున్నచో, భారత దేశము ఋణమును లోక మెప్పటికిని దీర్పఁజాలదు.

గీత పెక్కు జన్మములనుండి ముముక్షువై, శ్రద్ధాభక్తులతో నభ్యసించిన వారికిఁ గాని నిజముగా బోధపడదు . గీత లోతు దెలిసిన వ్యక్తులు కొలఁదిమందియే యుందురు. విస్పష్టమైన అనుభవజ్ఞాన మున్నఁగాని బోధించుశక్తి కలుగదు. శ్రీ గాయత్రీ పీఠాధిపతులు గీతలోని ప్రతివాక్యతత్త్వమును సమగ్రముగా నెఱిఁగి దాని, కితర సర్వవాక్యములతో నెట్టి సంబంధమున్నదో చూపుటలో వారి విషయ విభాగసామ ర్థ్యము. భిన్నాంశసమన్వయదక్షతయు నిరుపమానములని యీ గ్రంథ పాఠకులకుఁ దెలియగలదు వేయేల ? ఇంత వఱకు రచింపఁబడిన సుప్రసిద్ధ గీతా భాష్యములలో నెచ్చటను లభింపని కొన్ని భావములను శ్రీ స్వామివారద్భుత ప్రజ్ఞా వైభవముతో నావిష్కరించిరి. ఇది యాంగ్ల భాషలోఁగూడఁ బ్రకటింపఁబడుచో విశ్వవంద్యము కాగలదని ' వినమ్రుఁడనై సూచించుచున్నాను.

చిన్న నాటినుండి వైదిక వాఙ్మయసాగరమున నీదులాడి శ్రీ మద్గీతారహస్యము నెఱుఁగుటకై శ్రీ స్వామివారు నిరవధిక కృషి చేసి, తమ అమూల్యభావములను లోకమునకిచ్చుటకుఁ బూనిన యీ మహత్కార్యము సర్వాస్తికలోకము నకుఁ బూజ్యమైనది.

హిందూమతము అనంత శాఖోపశాఖాసమన్వితమగు వయోనిర్ణయ మసాధ్యమైన విశ్వవ్యాప్త మహా వటవృక్షరాజము. శ్రీమద్భగవద్గీత, దాని సారాంశము, శ్రీ విద్యా శంకరుల గీతావివరణము. హిందూమత సారాంశ సారాంశము. అందుచే శ్రీ స్వామివారి గీతావివరణము పఠించినచో హిందూమత సారాంశము సంపూర్ణముగాఁ దెలియఁ గలదు. ముముక్షువు లందరీ గ్రంథమును బఠించి ధన్యులయ్యెదరుగాక.

ది. 9-1-67. **బులుసు వెంకటేశ్వర్లు** (రిటైర్డు ఎ.పి.ఇ.యస్.)

తెలుగు జాతీయ బహుమానగృహీత,

శ్రీ శ్రీ శ్రీ గాయత్రీ పీఠాధిపతులు, శ్రీ విద్యాశంకర భారతీస్వామివారు రచియించిన "గీతాకౌముది" యను పొత్తమును అచ్చుటచ్చుట జూచితిని, గీతాశాస్త్రమునందు' స్వామివారొనర్చిన పరిశ్రమ లోగడ వారు గావించిన ఉప న్యాసములను వినియున్న నాకు ఇతః పూర్వమే విదిత చరము.

శ్రీ స్వామీ వారు రచించిన "గీతా కౌముది" ప్రథమ భాగము సశాస్త్రీయ ముగను, సప్రమాణముగను, సోపపత్తికముగను, సవిమర్శముగను, చమత్కార జనకముగను, సులభవ బోధకముగను, ఉన్నదనుటకు సందియము లేదు, వీరిందు విమర్శించి చూపిన గీతారహస్యములను పలు తావుల నుపన్యాస రూపమున బోధించి, శ్రోతల నమందానందసందోహతుందిలస్వాంతుల జేసిరి.

శాస్త్రపరిశ్రమ సన్న గిలిన యిక్కాలమున, ఆధ్యాత్మిక విషయములను అవగత మొనర్చుకొనుటకు నిట్టి గ్రంథములత్యంతో పకారకములు.

ఇట్లు

వరంగలు, **మల్లావఝల వెంకటసుబ్బరామశాస్త్రి**

ది. 4-1-1967, అద్వైత వేదాన్త శిరోమణి, మీమాంసావిశారద,

తాము రచించిన, శ్రీమద్భగవద్గీతా తత్త్వకౌముది ప్రథమ భాగమును ఆమూలాగ్రము చదివితిని. శ్రీమద్భగవద్గీ తకు తెనుగున అనేక వివరణములు ఇంతకు పూర్వమే యున్నవి. కాని సామాన్యముగ సౌర శూన్యమని భావింపబడుచున్న ప్రథమాధ్యాయ గ్రంథము, గంభీర భావగర్భితమని వివరించుటలోను, ఆయా యధ్యాయముల యందలి శ్లోకములకు పూర్వాపర సంబంధమును స్పష్టముచేసి, విషయ విభాగమును ప్రదర్శించుట లోను, శాస్త్రీయమగు యుక్తులతో గీతాతత్త్వమును నిరూపించుట లోను, ఈ విషయముల నన్నిటిని అతి సుబోధముగ ప్రతిపాదించుటలోను, అన్వర్థమగు ఈ గీతాతత్త్వ కౌముది యనిదం పూర్వమనుట స్వభావోక్తియే. పామరులకును పండితులకును కూడ నవశ్య మాదరణీయమగు ఈ గ్రంథము, తెనుగు సారస్వతమున కొక యాభరణ ముగ నుండగలదు. కాని యొకమనవి. తామీ గ్రంథ శేషమునుగూడ అనతి కాలములో ప్రకటించుచో, ఈ గ్రంథమును చవిచూచిన పాఠకుల కెనలేని యానందము కలుగును.

ది. 6-4-67. **అన్తేవాసి భాగవతుల కుటుంబరావు,** ఎం.ఏ.,

ఆంధ్ర జాతీయ కళాశాల ప్రిన్సిపాల్.

ప్రశంస

శ్రీమద్గాయత్రీ పీఠాధిపతులగు శ్రీ విద్యాశంకర భారతీ యతీంద్రులు తమ సాంప్రదాయిక మనన మంథాదండముచే గీతా క్షీరవారాశిని చిలుకగా నుద్భవించిన అమృతాంశుద్యుతి ఈ గీతాకౌముది ఇచట 'సాంప్రదాయిక' మనునది సాభిప్రాయము. గీత ఉద్భవించినది మొదలు. నేటివరకును దాని తాత్పర్యము ననేకు లనేక విధములుగా చెప్పుచున్నారు. కర్మప్రధానమని కొందరు, జ్ఞానప్రధానమనీ కొందరు, ఉభయప్రధానమని కొందరు, భ క్తిప్రధానమని కొందరు, యోగాభ్యాస ప్రధానమని కొందరు, ఈవిధముగ అనేకులనేక రీతుల గీతనుగూర్చి చెప్పియున్నారు. చెప్పుచున్నారు. ఈ మతము లన్ని టిలో ఎద్దియో ఒక్కటియే సత్యము, కావలెను, కాని అన్నియు సత్యము కాజాలవుకదా. గీత ఉపనిషత్సారరూప మగుటచే ఉపనిషత్ప్రతి పాద్యవిషయమే గీతాప్రతి పాద్యము కావలెననియు, అందుచే జ్ఞాన మార్గమే గీతారహస్య మనియు శంకర భగత్పాదులు సోపపత్తికముగ నిరూపించియున్నారు. ఇదియే సంప్రదాయ సిద్ధ విషయము. కాని ఈ విషయమును సరిగ మనస్సునకు పట్టించుకొనవలెననిన ఎంతయో మనన మావశ్యకము. ఏతద్గ్రంథము లేనివారికిగూడ అర్థమగునట్లు బోధించవలెననిన ఎంత మననము చేయవలసి యుండును. అది ఊహ మాత్ర గమ్యము. ఈ విధముగ సంప్రదాయసిద్ధ గంభీరవిషయమును అతిసులభము, ఆహ్లాదకమునునగు రీతిలో నెల్లరకును అందజేయు నీగ్రంథము కౌముది అనుట ఎంతయు సమంజసముగ ఉన్నది.

ఎంతటి శ్రుతిప్రతిపాదితార్థమైనను యుక్త్యుపబృంహితము కానిచో అది సుదృఢము కాజాలదు. కావుననే శంకర భగవత్పాదులు "సత్సుతు వేదాన్తవాక్యేషు జగతః జన్మాది కారణవారిషు తదర్థగ్రహణ దార్ఢ్యాయ అనుమాన మపివేదాన్తవాక్యా విరోధి ప్రమాణం భవన్న నివార్యతే శ్రుత్యైవసహాయత్వేన తర్కస్యాభ్యుపేతత్వాత్ తథాహి "శ్రోతవ్యో మన్తవ్యః'' అని వ్రాయుచు యుక్తవష్టం భావశ్యకత

నంగీకరించియున్నారు. కాని అట్టియుక్తులు కాల భేదముచే మారు చుండునని నా యభిప్రాయము. పూర్వము తార్కిక యుక్తులను - అను మానాదులను - చూపిన సరిపోవు చుండెడిది. కాని నేడు వాటితోపాటు వైజ్ఞానికైతిహాసికాది యుక్తులనుగూడ జూపినగాని సంపూర్ణత్వము లభించుట లేదు. అట్టి నూతన యుక్తులను జూపి అద్వైత సిద్ధాంతమున కపూర్వ సేవ చేయుచున్న నేటి ఆధ్యాత్మిక విద్యా ప్రచారకులలో శ్రీస్వామివారు అగ్రశ్రేణికి చెందినవారు. వీరి ఈదృశ శక్తి ఈ గ్రంథమునందంతటను, ప్రధానముగా మొదటి మూడు కిరణములందును సుస్పష్టముగ గోచరించుచున్నది. భగవద్గీత యొక్కటియే విశ్వజనీన మత గ్రంథమగు నర్హత కలదనుటకు వీరిచ్చిన ఉపపత్తులు విచారసహముగ నున్నవి. మీమాంసకోపజ్ఞమగు ఉపక్రమోపసంహారాది లింగషట్కమును సామాన్యులకుగూడ అర్థమగుతీరున నాల్గవ కిరణమున ప్రతిపాదించుట ప్రశంసనీయము. 'ఉపనిషద్' 'గీతా' శబ్దముల స్త్రీలింగ సామ్యమునకొక యుపపత్తి కల్పించుట చమత్కారముగ నున్నది.

గీతలోన ప్రతియొక్క శ్లోకము అర్థమగు చున్నట్లే ఉండును. కాని ప్రతిపాద్య విషయం గాంభీర్యముచేతనో లేక అస్మదాదిబుద్ధిలోపముననో ఎచటి నుండి ఎచటివరకు ఏవిషయము చెప్పబడినది, చెప్పినదంతయు పరస్పర వ్యాహతము కాకుండ నున్నదా, అన్న సందేహము రాకమానదు. వాస్తవమున "వ్యామిశ్రేణేవ వాక్యేన బుద్ధిం మోహయ సీవమే" అనుచు అర్జునుడు కూడ భగవద్వాక్యములు అస్పష్టార్థకముగ నున్నవని పలికియున్నాడుకదా. ఇట్టిశంకలు తొలగునట్లు శ్రీ స్వాములవారు ఏశ్లోక సంఖ్యానిర్దేశ పూర్వకముగా ఏ శ్లోకమునుండి ఏ శ్లోకమువరకు ఏవిషయము చెప్పబడినది? అందలి సూక్ష్మాంశ భేదము లెవ్వి ? అనునది మొదటి మూడధ్యాయములకు సంబంధించినంతవరకు అరటి పండొలచినట్లు అందజేయుచున్నారు. ఈ భాగమును చదువునపుడు వారి ఉపన్యాసమును వినుచున్నట్లనిపించును.

ఎనిమిదవ కిరణమున అర్జునుడు బ్రహ్మవిద్యకు అధికారి యని నిర్ణయింపబడినది. కాని 96వ పుటలోని మొదటి నాల్గుపంక్తులును "అర్జునుడు జ్ఞాననిష్ఠకు అధికారి కాడు" అని చెప్పుచున్నవి. మొదట చదివినపుడు ఈ ఘట్టములలో విరోధమున్నదా అని అనిపించినది. కాని బ్రహ్మవిద్యాధి కారమున్న దనినపుడు బ్రహ్మవిద్యాగ్రహణ మాత్రమున కధికారమున్నదనియు, జ్ఞాననిష్ఠతో అధికారము లేదనగా స్వవిహితకర్మత్యాగపూర్వక జ్ఞానైక మాత్రాధికారము లేదనియు శ్రీ స్వామివారి యభిప్రాయమై యుండునని అనుకొంటిని. కావుననే 'నిష్ఠ' అను పదమును సాభిప్రాయముగ వాడి యున్నారు.

మొదటి మూడధ్యాయములకువలెనే మిగిలిన అధ్యాయముల పై గూడ శ్రీ స్వామివారు చేసిన వ్యాఖ్యను పుస్తక రూపమున ఆస్తికుల కందజేయవలెనని ప్రార్థించుచున్నాను.

హైదరాబాదు,
ది. 30-1-67.

పుల్లెల శ్రీరామచంద్రుడు
వేదాన్త శిరోమణి వేదాన్త విశారద,
విద్వాన్, M.A.,
(సంస్కృతము, ఆంగ్లము, హిందీ)
సంస్కృతోపన్యాసకుడు,
ఉస్మానియా విశ్వవిద్యాలయము,

విజ్ఞప్తి

తా మంపిన 'గీతా కౌముది'ని సమగ్రముగ నాలోకించితిని. కువలయమున కానందకరమైన కౌముది నేరు రుచిచూచి యానందింపరు? సర్వానందకరమే ! భగవద్గీతలకు లోకమున బహుళ వ్యాఖ్యానములు గలవు. విమర్శనలుత్పన్నము లైనవి వేయేల ! శ్రీమచ్ఛంకరభగనత్పాదుల భాష్యము మొదలు అనిబిసెంటు, తిలక్ మొదలగువారి వఱకు వారివారి యుపజ్ఞాను సారము వ్యాఖ్యానముల వ్రాసిరి. ఈ పై నాధునికులలో నెవరు వ్రాసినను శ్లోకార్థము, పద స్వారస్యముల పై ప్రాకులాడిరే కాని యదార్థమునకు మొత్తము మీది యర్థమునుగాని ప్రయోజన సంబంధము లాద్యను బంధములను చక్కగ తెలుఁగున నిరూపించిన వారు తక్కువగనున్నారు. తామీ భగవద్గీతాతత్త్వము నొక తేజో రూపముగ ధ్వనింపఁజేసి ఆ తేజస్సులోని కిరణములను లోకమునకు మీ వాక్కులను దర్పణముపైఁ బ్రసరింపఁజేసి మూలమూలల దాగిన యజ్ఞానాంధ కారమును పారద్రోలి పరత త్త్వవస్తు విజ్ఞానమును గలిగించితిరి. ఇట్టి విమర్శనాత్మక గ్రంథములే నేటి పాశ్చాత్య నాగరకతా వ్యామోహితుల కవసరము. తాము న్యాయవృత్తినుండి విరమించి తత్త్వ జిజ్ఞాస యతీంద్రు లైనందులకిట్టి న్యాయబద్ధమైన విమర్శన లొనరించి లోకమునకు మేలు జేయుట మాబోటివారి పుణ్యపరిపాక మనవచ్చును. ఈ గీతాకౌముది అజ్ఞానాంధకార నిమగ్నులగువారికి విజ్ఞాన ప్రదీపమై వెలుతురు నిచ్చుగాక యని నా మనవి.

ఇతోధికతత్త్వ విమర్శను వ్యాససూత్రముల పైనను భగవంతుడు మీచే చేయించి మాబోటి జిజ్ఞాసుజనము నుద్ధరింతురని బ్రార్థించుచు మీ చరణ సన్నిధికి నా యభిప్రాయము విజ్ఞప్తి రూపమున సమర్పించుకొను చున్నాను.

నరసరావుపేట,

ది. 9-2-67.

ఇట్లు, భవచ్చరణ సేవాసక్తుడు,

లంక సీతారామశాస్త్రి.

ద్వితీయ ముద్రణము

పీఠిక

ఈ గీతాకౌముది ప్రథమ భాగము ప్రథమ ముద్రణము 1000 కాపీలు అయిపోవుట చేత ద్వితీయ ముద్రణము చేయనవసరము కలిగినది. రాజోలు తాలూకా లక్కవరం గ్రామ కాపురస్తులును, ఆస్తికోత్తములును, దైవభక్తి సంప న్నులును, దాతలును, నిరుపమాన యోగ్యతకల ఐశ్వర్య వంతులును అగు మంగెన సత్యనారాయణమూర్తి, వేణు గోపాలం సోదరులతోను వీరి పెదతండ్రి గురవయ్యగారి కుమారుడు సత్యనారాయణమూర్తిగారితోను ద్వితీయ ముద్రణమును గురించి చెప్పగా వారు తమ సహజమైన ఔదార్యముతో ద్వితీయ ముద్రణమును తాము ఉచితముగ చేయించుటకు అంగీకరించి రాజమండ్రి లోని కొండపల్లి వారి ముద్రాశాలలో అత్యల్ప కాలములో 1000 ప్రతులను అచ్చు వేయించిరి. ఇట్టి అమూల్య సహాయమును గావించిన శ్రీ మంగెన సత్యనారాయణమూర్తి సోదరులకును, మంగెన గురవయ్య గారి కుమారుడు సత్యనారాయణమూర్తిగారికిని సకల శ్రేయస్సులు కలుగుగాక అని మా నారాయణస్మరణ పూర్వక ఆశీస్సులు.

విద్యాశంకర భారతీస్వామి

శ్రీ గాయత్రీ పీఠము,
శంకరమఠము
బందరు, (కృష్ణాజిల్లా) –
సౌమ్యవత్సర శంకర జయంతి .
తే 21–4–1969.

గీతా కౌముది

ఒకటవ కిరణము

గీతా ఆవశ్యకత

'ప్రయోజన మనుద్దిశ్యనమందోపి ప్రవర్తతే'

అను న్యాయము ప్రకారము ఏ ప్రయోజనము లేకుండా ఎంత తెలివితక్కువాడు అయిననూ ఏపనిని చేయడు. అనగా ప్రపంచములో ప్రతి మానవుడును ఏదో పనిని చేయుచున్నాడు అంటే, దానివలన ఏదో ప్రయోజనము కలుగుననే చేయుచున్నాడు. అటువంటి అపుడు మనము ఎవరినైనా గీతను చదువమంటే యీగీతను చదివి తే ఏమిలాభము? చదవక పోతే ఏమినష్టము ? అని సహజముగా వాడు అడుగును. గీతను చదివితే యీలాభము ఉన్నది ? చదవకపోతే యీ నష్టము ఉన్నది అని వానిని ఒప్పించుతే వాడు గీతను చదువుతాడు. కనుక గీతను చదువుతే ఏమిలాభమో, చదవకపోతే ఏమినష్టమో మనము తెలుసుకొందము.

ప్రతి మానవుడును దుఃఖము పోవలెనని, సుఖము రావలెనని కోరుకొనును. కాని వాడు ఎన్ని పనులు చేసినను దుఃఖము పోవుట లేదు. సుఖము రావడము లేదు. మనకు ప్రపంచ విషయములవల్ల ఏదో సుఖము వచ్చుచున్న దిగదా అంటే, ఆ సుఖము తాత్కాలికము, అనిత్యము, సోపాధికము (అనగా ఆయావస్తువుల మీద ఆధారపడినదై యున్నది.) అట్టి అనిత్యమై, సోపాధిక మైన సుఖమువల్ల ఏమి ప్రయోజనము లేదు. అందుచేత ప్రతివాడును నిజముగా అపేక్షించేది, ఇట్టి ప్రపంచ విషయముల మీద ఆధారపడిన అనిత్య సుఖము కాదు. ప్రపంచ వస్తువులు అన్ని అనిత్యములు కనుక వాటి వల్ల వచ్చు సుఖము అనిత్యము కాక తప్పదు. కనుక ప్రతివాడును నిజముగా అపేక్షించేది ప్రపంచ వస్తువుల మీద ఆధారపడనటునంటి నిత్యసుఖము. అట్టి నిత్యసుఖమునే ఆత్మానందము అంటారు. ప్రతి మానవుని ఆత్మ నిత్యమై

ఆనందమై ఉన్నది, అని ఉపనిషత్ చెప్పుచున్నది. అంతే గాక మనకందరికి నిద్రలో కలిగే ఆనందము ఆత్మానందమే. నిద్రలో ప్రపంచ వస్తువులు ఇంద్రియములు, మనస్సు ఏమి గోచరింపవుగదా, నిద్రలో ఉన్నది ఆత్మ ఒక్కటే. కనుక నిద్రలో మనము అనుభవించు ఆనందము ఆత్మానందమే. మన ఆత్మ అనగా మన స్వరూప మే నిత్యమై ఆనందమై ఉన్నది. కాని మనకు ఆవిషయము తెలియుట లేదు తెలియకపోగా యీ దుఃఖము అనుభవించుచున్నామనియు, ఆ దుఃఖము అనుభవించుచున్నామనియు ప్రతివాడు గోలపెట్టును. ఈ దుఃఖము పోవాలని ఎంత ప్రయత్నించినను దుఃఖము పోవడము లేదు. ఎందుచేత నంటే, దుఃఖము ఎందుకు వచ్చినదో తెలియకపోవడమువల ఆ దుఃఖమును పోగొట్టుకోలేకుండా ఉన్నాడు. కనుక దుఃఖమును పోగొట్టుకొన వలెనంటే దుఃఖము ఎందుకు వచ్చినది, దేనివల్ల వచ్చినది తెలుసుకో వలయును. ఈవిధముగా దుఃఖమునకు కారణము ఏమి ? అని విచారణ చేస్తే, శరీరమే దుఃఖమునకు కారణమని తేలుతుంది. ఎందు చేతనంటే, మనము శరీరము ఉన్నప్పుడే దుఃఖమును అనుభవిస్తున్నాము. శరీరమునకు రోగము వచ్చినా, తేలుకుట్టినా, మనకు దుఃఖము వచ్చును. కాని శరీరమునకు రోగము ఉన్నప్పటికి, శరీరములో తేలు కుట్టిన విషము ఉన్నప్పటికి మనకు నిద్రపట్టిన యెడల ఏదుఃఖమును మనము అనుభవించుటలేదు. ఎందుచేతనంటె నిద్రలో మనకు శరీరము లేదు, అనగా శరీరము ఉన్నదనే భావము లేదు. శరీరము అనగా స్థూలశరీరము సూక్ష్మశరీరము కూడా, సూక్ష్మ శరీరమంటే మనస్సు ప్రధానముగా గలది. ఇపుడు దీనివలన తేలినది ఏమంటే, శరీరమున్న జాగ్రదవస్థలో దుఃఖము ఉన్నది, శరీరము లేని నిద్రానస్థలో దుఃఖము లేదు, కనుక శరీరమే దుఃఖమునకు కారణము అని తేలినది. దుఃఖము లేకుండా పోవాలంటే శరీరము లేకుండాపోవాలి. శరీరము లేకుండా పోవాలంటే, శరీరము ఎందుకు వచ్చినదో, ఏలా వచ్చినదో తెలుసుకోవాలి. శరీరము ఎందుకు

నచ్చినదంటే, వెనుకటి జన్మలో ఏదోకర్మ చేస్తే, ఆకర్మ ఫలాన్ని అనుభవించుటకు శరీరము వచ్చినది. శరీరము లేకుండా పోవాలి అంటే కర్మ లేకుండా చేసుకోవాలి. కర్మలేకుండా చేసుకోవాలి అంటే కర్మ ఎందుకు చేసినామో తెలుసుకోవాలి. కర్మ ఎందుకు చేసినామంటే రాగ ద్వేషాలు, కామక్రోధాలు ఉండుటవల్ల కర్మ చేస్తున్నాము. మనము ఏపని చేసినా రాగమో, ద్వేషమో, కామమో, క్రోధమో, మనలో ఉండి ఆపనిని చేయించుచున్నది. కనుక మనము ఏకర్మ చేయకుండా ఉండాలి అంటే రాగ ద్వేషములు కామక్రోధాలు లేకుండా ఉండాలి. ఇవి లేకుండా ఉండాలి అంటే, యివి ఎలా వచ్చినది తెలుసుకోవాలి. ఇవి ఎలా వచ్చినవంటే స్వపర భేదమువల్ల వచ్చినవి. నేను వేరు, వాడు వేరు అను భేదబుద్ధి ఉంటేనే యితరుని యందు రాగము, ద్వేషము, కామము, క్రోధము పుట్టును. ఈ రాగాదులు పోవాలి అంటే స్వపరభేదము పోవాలి. స్వపర భేదము పోవాలి అంటే, స్వపర భేదము ఏలావచ్చినదీ తెలుసుకొంటే దానిని పోగొట్టు కోవచ్చును. స్వ పర భేదము ఏలా వచ్చినదంటే ఎవరి స్వరూపము వారికి తెలియక పోవుటవల్ల అనగా ఆత్మస్వరూపజ్ఞానము లేనందువల్ల ఈ శరీరములో ఉన్న వానిని 'నేను' అనిన్నీ, ఆ శరీరములో ఉన్న వానిని 'వాడు' అనిన్నీ అంటున్నాము. అందు చేత నేను వేరు వాడు వేరు అను భేదబుద్ధి, దానివల్ల రాగ ద్వేషాదులు, దానివల్ల కర్మ, దాని వల్ల శరీరము, దానివల్ల దుఃఖము వస్తున్నవి. ఈవిధముగా విచారణ చేస్తే దుఃఖానికి కారణము ఆత్మజ్ఞానము లేక పోవడము అని తేలినది. ఇది అంతా మనము ఇపుడు యుక్తి మీద విచారణ చేసి తేల్చుకున్నాము. ఈ విషయమునే శ్రుతి కూడా నొక్కి చెప్పుచున్నది. 'ఛాందోగ్యోపనిషత్తు'లో నారదులవారికి సనత్ కుమారుల వారు "తరతీశోకమాత్మవిత్" అని బోధించినారు. అనగా ఆత్మజ్ఞానము వల్లనే దుఃఖమును దాటగల్గుతాడు అని సిద్ధాంతము. నిద్రలో ఆత్మ ఒక్కటే ఉన్నపుడు దుఃఖము లేక పోవుట వల్ల పై సిద్ధాంతము అనుభవపూర్వకముగా కూడా తేలుచున్నది. సమాధి

స్థితిలో యీ విషయము స్పష్టముగా అను భవములోనికి వచ్చును. ఇట్లు ఆత్మజ్ఞానము లేనందువల్ల దుఃఖము వచ్చినదనిన్నీ ఆత్మ జ్ఞానమువల్ల దుఃఖముపోయి నిత్యానందము అనుభవములోనికి వచ్చుననిన్ని, యుక్తి విచారణవల్ల శ్రుతి ప్రమాణమువల్ల అనుభవమువల్ల కూడా మనము స్పష్టముగా తేల్చుకొన్నాము.

ప్రతి మానవుడున్ను 'నేను' 'నేను' అని వ్యవహరిస్తూ ఉంటాడు. నేను అంటే ఏమిటో తెలియడము లేదు. నేను అనేది లేదేమో అంటే నేను లేక పోవడము ఏమిటండి అని ప్రతివాడును రొమ్ముమీద చేయి వేసుకొని, నేను అనేది ఉన్నదని స్పష్టముగా ఉద్ఘోషిస్తాడు. కనుక నేను అనేది లేక పోవడము లేదు. ఉన్నది అనడము నిశ్చయము. నేను అనేది ఉండుట అలా నిశ్చయమైతే నేను యొక్క స్వరూపము తెలియుచున్నదా అంటే, ఎవరికి తెలియుట లేదు. "నేను" యొక్క స్వరూపాన్ని తెలుసుకొన్న జ్ఞానులు చాలా అరుదు. 'నేను) స్వరూపాన్ని తెలుసుకొని అనుభవములోనికి తెచ్చుకొనుట మోక్షము. నేను నేను అనేది ఉన్నదని సామాన్యాకారముగా అందరికి తెలిసిననూ విశేషాకారముగ అందరికి తెలియడము లేదు. అనగా " నేను" యొక్క స్వరూప స్వభావములు తెలియుట లేదు. దీనికి కారణ మేమనగా ' నేను' అను దానిని ఏదో ఒకటి ఆవరించి కప్పి వేసినది. అందు చేతనే ''నేను' యొక్క స్వరూప స్వభావములు తెలియడము లేదు. " నేను' స్వరూపాన్ని ఆవరించిన దానిని మాయ అని అంటారు. ఆ మాయను పోగొట్టుకోగలిగితే 'నేను' యొక్క స్వరూప స్వభావములు తెలియును. అదే ఆత్మజ్ఞానము. అదే మోక్షము.

అలా అయితే యీ మాయను దాటుటకు సాధన మేమి ? అనగా అట్టి సాధనలను యీ భగవద్గీత బోధించుచున్నది. గనుక గీతాబోధవలన మాయను దాటి మోక్షమును పొందుటకు అవకాశమున్నది. గీతాజ్ఞానము లేకపోతే సంసారదుఃఖము తప్పదు. కనుక గీతాబోధ అవసరము.

రెండవ కిరణము

గీతావిశిష్టత - గీతయే ప్రపంచ మత గ్రంథము

ప్రపంచములో హిందూమతము, క్రిష్టియనుమతము, ముసల్ మాను మతము అను 3 మతములు ప్రధానముగా ఉన్నవి. హిందూమతము అనగా వేదమతము. ఈ మతమునకు మత గ్రంథము వేదసారమైన భగవద్గీత, క్రిష్టియన్ మతమునకు బైబిల్, ముసల్మాను మతమునకు ఖురాన్ మత గంథములై ఉన్నవి. ఈమూడింటిలో ప్రపంచమంతకును మత గ్రంథముగా చెప్పతగినది ఏది ? అను విషయమును పరిశీలించుదము.

క్రిష్టియను మతము క్రీస్తుతో యిప్పటికి సుమారు 2 వేలు సంవత్సరముల క్రిందట ప్రారంభము అయినది.

మహమ్మద్ మతము యిప్పటికి సుమారు 1400 సంవత్సరముల క్రిందట మహమ్మదుతో ప్రారంభమైనది. ప్రపంచము పుట్టి యిప్పటికి మన భారతీయ వైదిక పంచాంగము ప్రకారము 1,95,58,85,066 సంవత్సరములు అయినది అనగా 195' 1/2 కోట్ల సంవత్సరములకు పైగా అయినది. పాశ్చాత్య పదార్థ విజ్ఞాన శాస్త్రవేత్తలున్ను, భూగర్భ శాస్త్రపరిశోధకులున్ను అయిన మహామహులుకూడా యీసృష్టి పుట్టి యిప్పటికి సుమారు 200 కోట్ల సంవత్సరములు అయినదని నుడివి యున్నారు. ఆ ప్రకారము ఈ సృష్టి పుట్టి సుమారు 195' 1/2 కోట్ల సంవత్సరములు పైగా అయినపుడు యిప్పటికి సుమారు 2 వేల సంవత్సరముల క్రిందట పుట్టిన క్రిష్టియను మతం గ్రంథముగాని, సుమారు 1400 సంవత్సరముల క్రిందట పుట్టిన మహమ్మదీయ మత గ్రంథముగాని సృష్టికి అంతకు మత గ్రంథములు కానేరవు. అవి సృష్టికి అంతకు మతగ్రంథములు అయినచో ఆ రెండు గ్రంథములు పుట్టక పూర్వమే కొన్ని కోట్ల సంవత్సరముల క్రిందట సృష్టి పుట్టుట చేత అట్టి సృష్టిలోని ప్రజలందరకు మతమే లేకపోవలెను.

భగవంతుడు మతమును మత గ్రంథమును ప్రజలకు అనుగ్రహించకుండా ప్రజలను సృష్టించుట అసంభావ్యము. కనుక బైబిలున్ను, ఖురాన్ యున్నూ అవి పుట్టకముందు ఉన్నవారిని తరింప జేయలేవు గనుక అవి సృష్టికంతకును మత గ్రంథము లగుటకు వీలులేదు. ఇకను హిందూమత గ్రంథమైన వేద సారమగు భగవద్గీతను గురించి విచారించుదము. భగవద్గీతను కృష్ణ పరమాత్మ అర్జునునకు కురుక్షేత్ర యుద్ధ ప్రారంభములో బోధించినట్లు అందరికి తెలిసిన విషయమే. కురు క్షేత్ర యుద్ధము జరిగి యిప్పటికి సుమారు అయిదు వేల సంవత్సరములకు పైగా అయినది. అట్లు అయినచో సుమారు 5000 సంవత్సరముల కిందట పుట్టిన భగవద్గీత 195' 1/2 కోట్ల సంవత్సరముల క్రిందట పుట్టిన సృష్టికి అంతకి మత గ్రంథము ఎట్లు కాగలదు ? అను ఆక్షేపణ బైబిల్, ఖురాన్‌కు వచ్చినట్లుగానే గీతా విషయములో కూడా వచ్చును. దీనికి జవాబు ఏమనగా – భగవద్గీత కురుక్షేత్ర యుద్ధ ప్రారంభమున అర్జునునకు శ్రీకృష్ణునిచేత ఉపదేశింపబడినట్లు కనబడినప్పటికి, గీతాబోధ యొక్క ఆవిర్భావమునకు అదే ప్రారంభము కాదు. గీత 4వ అధ్యాయము ప్రథమ శ్లోకములో గీతా సందేశమును సృష్ట్యాదిని కృష్ణ పరమాత్మ సూర్యునకు అనుగ్రహించినట్లు స్పష్టమగుచున్నది. సృష్టి పుట్టిన తరువాత యిప్పటికి సుమారు 5200 సంవత్సరములకు పూర్వము అవతరించిన కృష్ణుడు సృష్ట్యాదిని అనగా యిప్పటికి సుమారు 195' 1/2 కోట్ల సంవత్సరముల పూర్వము సూర్యునికి ఎట్లు ఉపదేశింపగలడు? సృష్టి చేసిన భగవంతుడే సృష్ట్యాదిలో అట్టి ఉపదేశమును చేయుటకు సాధ్యము, అంతేకాని యితరులకు సాధ్యము కానేరదు. కనుక సృష్ట్యాదిని సూర్యునకు ఉపదేశించినది సాక్షాత్తు భగవంతుడే అయియుండవలయును. అట్టి ఉపదేశమును కృష్ణుడు తాను చేసినానని చెప్పుటచే, అర్జునునకు బోధచేసిన కృష్ణుడు దేవకీవసుదేవులకు సుమారు 5200 సంవత్సరం క్రిందట పుట్టిన విగ్రహరూపుడు మాత్రమే కాదని

తేలుచున్నది. ఆ కృష్ణుడు భగవంతునియొక్క అవతారము. అట్టి అవతారమైన కృష్ణుడు తన తాత్కాలికమైన అవతార రూపములో గాక వాస్తవమైన భగవత్ స్వరూపుడుగానే అర్జునునకు గీతను బోధించెను. అందుకనే అర్జునునకు కృష్ణుడు గీతను బోధించినను, గీతకు 'కృష్ణగీత' అని కృష్ణ నామముతో పేరు రాక, సాక్షాత్తు భగవంతుడే బోధ చేయుట చేత, 'భగవద్గీత' అను నామము వచ్చినది. రాముడు చెప్పిన గీత 'రామగీత' అనియు, రుద్రుడు చెప్పిన గీత 'రుద్రగీత' అనియు, గణపతి చెప్పిన గీత 'గణేశ గీత' అనియు శ్రుతులు చెప్పిన గీత 'శ్రుతిగీత' అనియు, గోపికలు చెప్పిన గీత 'గోపికాగీత' అనియు యిట్లు బోధ చేసిన వారి నామములతో ఆయాగీతలు విరాజిల్లుచుండగా, కృష్ణుడు చెప్పిన గీతకు 'కృష్ణగీత' అను పేరురాక 'భగవద్గీత' అను పేరువచ్చుటకు కారణము యిదియే. అందుకే గీతలో మధ్య మధ్యను 'భగవానువాచ' అను యున్న దిగాని 'కృష్ణో' వాచ అని లేదు. ఇంకను భగవద్గీతలోని శ్లోకములను పట్టి చూచినను సృష్టికర్త అయిన భగవంతుడే సాక్షాత్తు గీతను బోధించి యుండ వలెను. గాని సుమారు 5200 సంవత్సరముల కిందట అవతరించిన కృష్ణుడు మాత్రం బోధించి యుండడనిస్పష్టము. గీతలోని 'మయాధ్యక్షేణప్రకృతి సూయతే స చరాచరం' అను శ్లోకము నా అధ్యక్షత కింద ప్రకృతి సృష్టి నంతటను చేసినది, అను భావమును స్పష్టము చేయునపుడు అధ్యక్షుడనైన నేను అను శబ్దమునకు అర్థము సాక్షాత్తు భగవంతుడే అని స్పష్టమగుచున్నది గదా. ఇంకను గీతలో 'అజః అవ్యయః అనగా పుట్టుక లేనివాడు నాశనము లేనివాడు అను మున్నగు యిటువంటి నిదర్శనములు చాలా గలవు. కనుక గీతను సృష్టికర్త అగు సాక్షాత్తు భగవంతుడే సృష్టిలోని ప్రజలందరకు మత గ్రంథముగా అనుగ్రహించినాడని తేలుచున్నది.

ఇంకను క్రిష్టియన్ మతము యొక్క ప్రవక్తయైన జీసస్ క్రీస్తుయును. మహమ్మదీయ మతముయొక్క ప్రవక్తయైన మహమ్మదుయును, భగవంతుని యొక్క కుమారులుగనో, దూతలుగనో

వర్ణింపబడినారుగాని, సాక్షాత్తు భగవంతుడుగా వర్ణింపబడి యుండలేదు. గాని మన భగవద్గీతను సాక్షాత్తు భగవంతుడే చెప్పియున్నాడు. ఈ కారణము చేత కూడా భగవద్గీతయే ప్రపంచ మత గ్రంథము కాదగియున్నది. ఇంకను గీత 4వ అధ్యాయము 11వ శ్లోకములో 'మనుష్యాః' అనిన్నీ, 3 వ అధ్యాయము 17 వ శ్లోకములో 'మానవః' అనిన్నీ, 9వ అధ్యాయము 22 వ శ్లోకములో 'జనాః' అనిన్నీ శబ్దముల ప్రయోగముల వల్ల కూడా గీత ప్రపంచములోని మానవుల అందరికిని సంబంధించి అందరిని తరింప చేయుటకుగానుఅవతరించిన మత గ్రంథము అని తేలుచున్నది.

మరియు ఆయా మత గ్రంథముల బోధలను పరిశీలించినను భగవద్గీతయే ప్రపంచ మత గ్రంథము కాతగినదని స్పష్ట పడుచున్నది. మానవుని మనస్సుకు 3 రకముల ప్రవృత్తులు కలవు. అవి ఏవి అనగా (1) వాంఛించుట (2) అనుభవించుట (3) తెలిసికొనుట. ఈ మూటిలో 'వాంఛించుట' అను మనః పవృత్తి వాంఛారూపములోనే పర్యవసానము కానేరదు. వాంఛ తీరవలెనన్న ఏదో తగిన ప్రక్రియ జరుగవలెను. మామిడిపండును తినవలెనని కోరిక కలిగినచో ఆ కోరిక నెరవేరుటకు ఆ పండు కొనుట, తినుట, అనుకర్మ జరుగవలయును. అపుడు కాని ఆ కోరిక పూర్తి కానేరదు. కనుక వాంఛ అను మనః ప్రవృత్తి కర్మలోనే పర్యవసానమగును. వాంఛ అనునది ప్రపంచ విషయములకు సంబంధించినది అయినచో ప్రపంచవిషయములు పరిచ్ఛిన్న ములు, అనిత్యములు, దుఃఖప్రదములు అగుట చేత వాంఛయను మనఃప్రవృత్తి పరిపూర్ణముగ సఫలము కానేరదు. అది పరిపూర్ణము సఫలము కావలెనన్న అపరిచ్ఛిన్నమై నిత్యమైన భగవంతునికి సంబంధించి యుండవలయును. భగవంతుడు సర్వవ్యాపకుడును, సచ్చిదానంద స్వరూపుడును అగుట చేత, వాంఛ భగవంతునికి సంబంధించినది. అయినచో భగవంతునకు సంబంధించిన కర్మలోనే పర్యవసానమై,

పరిపూర్ణము ఆనందదాయకము అగును. ఇదియే భగవంతునకు సంబంధించిన కర్మయోగము. అటులనే రెండవ మనఃప్రవృతియైన 'అనుభవించుట' అనునది కూడ ప్రపంచ విషయములకు సంబంధించినది అయినచో, పరిపూర్ణము ఆనందదాయకము కానేరదు. కనుక అట్టి అనుభవము కూడ భగవంతునకు సంబంధించినది. అయితేనే పరిపూర్ణము, ఆనందదాయకము అగును. అట్టి భగవదనుభవము భక్తి యోగము వలన సమకూడును. మరియు 3వ మనఃప్రవృత్తి అయిన తెలిసికొనుట అనునదికూడా ప్రపంచ విషయములకు సంబంధించినది అయినచో, పరిపూర్ణము ఆనందదాయకము కానేరదు. కనుక అట్టి తెలుసుకొనుట భగవత్పరమైనచో భగవత్ జ్ఞానములోనికి పర్యవసానమై సఫలత నొందును. ఇదియే జ్ఞానయోగము, ఇట్లు ప్రతిమానవునికి సంబంధించిన ఈ మూడు మనః ప్రవృత్తులు భగవంతునికి సంబంధించిన కర్మ యోగము, భక్తి యోగము, జ్ఞాన యోగము అను 3 యోగములలోనికి పర్యవసానమైతేనే, మానవుడు సంస్కృతుడై, పరిపూర్ణుడై మోక్షము పొందును. ప్రతిమానవుడు మోక్షమును అపేక్షించును గనుక యీ 3 యోగములను అవలంబించి తీరవలయును.

ఈ 3 యోగములలో మొదటిది అయిన కర్మయోగమువలన మానవుడు తన విధ్యుక్త ధర్మములను నిష్కామముగా అనగా ఫలాపేక్ష లేకుండా నెరవేర్చినచో, చిత్త మాలిన్యముపోయి, చిత్తశుద్ధికలవాడు అగును, అంతట భక్తి యోగమును, దానికి సంబంధించిన యోగాభ్యాసమును చేసినచో చిత్తమునకు ఉన్న చాంచల్యముపోయి, ఏకాగ్రత కుదిరి భగవదనుగ్రహము కలుగును. ఆ తరువాత జ్ఞాన యోగమువల్ల భగవంతుడే తాను అను ఐక్యభావము, సర్వాత్మభావము గలిగి మోక్షము పొందును. దీనినిబట్టి ఆత్మజ్ఞానమువలననే

మోక్షమనియు, అట్టి జ్ఞానమునకు నిష్కామకర్మము భక్తి సాధనములనియు స్పష్టమగుచున్నది. అందుకనే గీతలోని మొదటి 6 అధ్యాయములు కర్మషట్కము అనియు, 7 నుంచి 12 అధ్యాయమువరకు భక్తి షట్కము అనియు, 13 నుంచి 18 అధ్యాయమువరకు జ్ఞానషట్కమనియు విభాగము కలదు. ఈ విభాగము ననుసరించిగూడా మోక్ష సాధనములలో మొదటిది నిష్కామ కర్మయోగమనియు, 2 వది భక్తి యోగ మనియు, 3 వది జ్ఞాన యోగమనియు, జ్ఞానమువలననే మోక్షమనియు తేలుచున్నది.

ఇంకను గీతలోని 18 అధ్యాయములలో మొదటి ఆరు జీవత త్త్వమును గురించియు, రెండవ షట్కము ఈశ్వరతత్త్వమును గురించియు, 3 వ షట్కము జీవేశ్వరుల సంబంధము గురించియు బోధ చేయును, భగవద్గీతను యీ రెండు విధములుగా 3 షట్కములుగా విభజించుటవలన తేలినసారము ఏమనగా, జీవుడు మొదటి షట్కములో చెప్పబడిన నిష్కామ కర్మ చేసినచో, సంస్కృతుడైన జీవుడగును. అట్టి జీవుడు 2 వ షట్కములో చెప్పబడిన భక్తి యోగమును అనుష్ఠించినచో చిత్త ఏకాగ్రతకల్గి భగవదనుగ్రహమునకు పాత్రుడు అగును.

ఆ పైని అట్టిజీవుడు 3 వ షట్కములో చెప్పబడిన జ్ఞాన యోగమును అవలంబించి జీవేశ్వరుల సంబంధము అభేదమే అని గ్రహించి సర్వాత్మభావముతో మోక్షము పొందును. ఈ విధముగా భగవద్గీతలో మానవుడు తరించుటకు సాధనములు అన్నియు క్రమముగా బోధింపబడినవి. ఈ సాధనములను ప్రపంచములో మానవులు అందరు అభ్యసించి తరింపవచ్చును. మిగతా మత గ్రంథములు అగు బైబిలు, ఖురాన్‌లలోగాని, సంస్కృత, వాఙ్మయములోని యితర గీతలలోగాని, యీ విధములగు సాధనములన్నియు యిట్లు క్రమపద్ధతిలో బోధింపబడి యుండ లేదు. బైబిలులో భక్తి ప్రధానముగను యిస్లాం మతములో ప్రపత్తి ప్రధానముగను మాత్రమే వర్ణింపబడినవి. అంతేగాని నిష్కామ

కర్మయోగము భక్తి, ప్రపత్తి, జ్ఞానము, యీసాధనము లన్నియు యిట్లు క్రమపద్ధతిలో భగవద్గీతలో తప్ప ఏ యితర గ్రంథములలోను చెప్పబడ లేదు. ఇతర మతముల వారున్ను ఆయా మత గ్రంథముల బోధల ననుసరించినచో ఉత్తమ గతిని పొందుదురు. కాని మోక్ష మనునది పునరావృత్తి రహిత సర్వాత్మభావము కనుకను, అట్టిది జీవించి ఉండగా కలుగవలెను కనుకను. అట్టిది ఒక్క– గీతాబోధవల్లనే కలుగును. గీతలో జీవన్ముక్తి అనగా జీవించి యుండగానే ముక్తి చెప్పబడినది. ఇతర మతములలో చనిపోయిన తరువాతనే ముక్తి గాని జీవన్ముక్తి లేదు. జీవించి ఉండగానే సచ్చిదానంద స్వరూపముతో సర్వాత్మభావ రూప మోక్షము పొందుట పరమోత్కృష్టము గదా ! అట్టి మోక్షము హిందూమతమునకు మత గ్రంథము అయిన వేదసారమైన యీ భగవద్గీతలోనే బోధింపబడినది. ఇందువల్ల ప్రపంచములోని మానవులు అందరు ఉత్కృష్ట రూపమైన మోక్షమును పొందుటకు భగవద్గీతయే ఆధారము. కనుక ప్రపంచము అంతకు మత గ్రంథము భగవద్గీతయే అని స్పష్టమగుచున్నది. ఇదియే భగవద్గీత యొక్క విశిష్టత.

మూడవ కిరణము

గీతావతరణము

భగవంతుడు ప్రజలను సృష్టించుటకు పూర్వమే వారికి ఆహారమును ఏర్పాటు చేసి తర్వాతనే ప్రజలను సృష్టించినాడు. తల్లి గర్భములోనుంచి శిశువు పుట్టగనే ఆ శిశువునకు కావలసిన స్తన్యము సిద్ధమై యున్నదిగదా ! అటులనే పంచభూతములను ముందు సృష్టించి వానిలో ప్రజలకు కావలసిన ఆహారము ఏర్పాటు చేసినత ర్వాతనే ప్రజలను సృష్టించినాడు. స్థూల దేహమునకు ఆహార మెటులవసరమో, సూక్ష్మ దేహమునకున్ను ఆహారము అవసరమే గదా ! అట్టి సూక్ష్మ దేహమున కాహారము తరింపజేయు విజ్ఞానమే ! ప్రజాసృష్టికి పూర్వమే స్థూలదేహమునకు కావలసిన ఆహారమును ముందుగా సృష్టించినట్లు గానే, సూక్ష్మ దేహమునకు కావలసిన ఆహారమైన విజ్ఞానమును కూడ ముందు గానే భగవంతుడు ఏర్పాటుచేసినాడు. ఆ విజ్ఞానము వేదవిజ్ఞానమే. ఆ వేదవిజ్ఞానముయొక్క సారమే 'భగవద్గీత', గీతాతత్త్వము భగవత్తత్త్వమే గనుక భగవంతునివలె అనాదియును నిత్యమును అయ్యున్నది.

అట్టి గీతాతత్త్వమును సృష్ట్యాదిని భగవంతుడు సూర్యునకు ఉపదేశము చేయగా, సూర్యుడు మనువునకు, మనువు ఇక్ష్వాకుకున్ను ఉపదేశము చేసినాడు. ఆ పరంపరలో కొంతకాలము వచ్చిన తరువాత కాలము గడచినకొలది ప్రజలలో కామము ఎక్కువగుట చేత గీతాతత్త్వము నష్టప్రాయమయ్యెను. దానిని తిరిగి ఉద్ధరించుటకుగాను గత ద్వాపర యుగములో కాలము ఆసన్న మాయెను. ఆ కాలములో ఉన్న ప్రజలలో అర్జునుడు అన్ని విధములను ఉత్తముడగుట చేత అతని ద్వారా గీతాతత్త్వమును ఉద్ధరించి ప్రజలకు భగవంతుడు అందింప సంకల్పించినాడు.

ఇట్లుండగా, కౌరవులకున్ను పాండవులకున్ను యుద్ధము సన్నద్ధము కాగా, ధర్మపక్షపాతియగు కృష్ణుడు ధర్మమార్గము

ననుసరించు పాండవుల పక్షము చేరి అర్జునునకు రథసారథ్యమును అంగీకరించెను. ధర్మక్షేత్రమైన కురుక్షేత్రములో ఉభయ సేనలు చేరగా అర్జునుడు తన సారథియైన కృష్ణునితో తాను యుద్ధసన్నద్ధులయి వచ్చిన ఉభయ సేనలలోని వారలను చూడదలచి నానని చెప్పి అందుకుగాను ఉభయ సేనలమధ్యను తన రథమును నిలుపుమని కోరెను.

గీతను అర్జునునిద్వారా అవతరింప చేయుటకు యిది మంచి తరుణమని కృష్ణుడు నిశ్చయించుకున్నాడు. కాని, అర్జునుడు కృష్ణునితో సమాన వయస్కుడై, మేనమామ కుమారుడు అగుటచేత, చిన్నప్పటినుండియు మిక్కుటమైన స్నేహముతో, బావా, బావా, అనుచు సరససల్లాపము లాడుచు ఉండు స్వభావముగలవాడగుట చేత అతనికి గీతను బోధించుట ఎట్లు సాధ్యంబగును? . గీతను బోధించవలెనన్న కృష్ణునిమధ్యను అర్జునుని మధ్యను గురుశిష్య సంబంధ మేర్పడ వలసియున్నది గదా? 'బావా' యని అతి చనువుతో పిలుచు అర్జునుడు శిష్యుడగుటకు, మార్గమేమి?

అర్జునుడు కృష్ణుని గురువుగా స్వీకరించి కాళ్ళు పట్టు కొని నాకు బోధచేయుమని ప్రార్థించితేనే కృష్ణుడు అర్జునునకు బోధచేయుట కవకాశము కల్గును. అట్టి పరిస్థితి అర్జునునికి వచ్చుటెట్లు ?

అర్జునునకు యేదోవిధముగా విషాదము కల్గినగాని దానిలోనుండి బయటపడుటకు కృష్ణుని ప్రార్థించుట సంభవించదు. విషాదము కలుగుటకు తగిన పరిస్థితులు అర్జునునకు ఏర్పడవలయును.

అర్జునునకు యుద్ధపరాక్రమము అసదృశమగుటచే ఎవరిని చూచినను భయము కలుగనేరదు. ఇంక విషాద మెట్లు కలుగును? భీష్మద్రోణాదులను సేనలో తన కెదురుగా జూచిన యెడల వారు తనకన్న గొప్పవారలును, గురువులును అగుటచేత భయము కలుగవచ్చును కదా? అని అంటే, అట్టి భీష్మద్రోణసహిత కౌరవులందరిని ఉత్తర గోగ్రహణములో ఒక్కడే నిర్భయముగా, నిర్దాక్షిణ్యముగా, భీష్మద్రోణులు

గురువులని 'ఆలోచించకుండా, అందరితోను యుద్ధము చేసి అందరిని ఓడించినాడే. ఇపుడు యుద్ధములో కృష్ణుని సహాయమైనను ఉన్నది. అప్పుడో, కృష్ణుని సహాయము లేకపోగా, అతి పిరికిపంద అయిన ఉత్తరకుమారుని, నిరుత్సాహ వాక్యములు వెనుకకు లాగుచుండినవి గదా ? ఇంకను యిపుడు యుద్ధములో కర్ణుడు పాల్గొనుట లేదు. అప్పుడు భీష్మద్రోణాదు లేగాక కర్ణుడుకూడా యుద్ధములో పాల్గొనినాడు. ఇట్లు యిప్పటికన్న అప్పుడు ఎన్నో విధముల విషమపరిస్థితులు ఉండి యున్ననూ అర్జునుడు ఎట్టి భయమునుగాని, విషాదమును గాని పొందకుండా, ఒక్క డే ఎంతో ధైర్యముతో యుద్ధము జేసి, భీష్మ ద్రోణ కర్ణ దుర్యోధనాదుల నందరిని గూడ ఓడించినాడే. అట్టి పరిస్థితులలోనే ఎట్టి విషాదమును పొందని అర్జునుడు కృష్ణుని సహాయముగూడ యున్న ఈ యుద్ధ సమయములో ఎట్లు విషాదమును పొందగలుగును ! మరియు పాశుపతాస్త్ర స్వీకార సమయమున పరమేశ్వరునితో కూడ యుద్ధము చేయుటకు ఏమాత్రమును వెనుదీయ లేదే ? నిర్దాక్షిణ్యముగా, ఖాండవవనమును దహించినాడే. ఇంతకు పూర్వము ఎన్నో సార్లు యుద్ధములో నిర్భయముగా క్షత్రియ పౌరుషముతోను, ప్రావీణ్యముతోను పాల్గొని అపజయ మనగా యెట్టిదో యెరుగని అసదృశ పరాక్రమశాలి అయిన అర్జునునికి యీ కురుక్షేత్ర యుద్ధములో విషాదము కలుగుటకు అవకాశ మేదియు కనబడుట లేదే? విషాదము కలిగిన గాని కృష్ణుని గురువుగా స్వీకరించుటకుగాని బోధ చేయమని ప్రార్థించుటకుగాని అవకాశ ముండనేరదుగదా ! అట్లు అడిగినగాని కృష్ణుడు చెప్పగూడదుగదా? ఇవన్నియు కృష్ణుడు మనస్సులో నుంచుకొని ఉభయ సేనల మధ్యను రథమును నిలుపుమని అర్జునుడు కోరగా, కృష్ణుడు రథమును ఉభయ సేనల మధ్యకు పోనిచ్చి, సాక్షాత్ భీష్మద్రోణుల యెదుటనే నిలిపి, వారిద్దరిని చూడగనే అర్జునునకు విషాదము కలుగునట్లు అర్జునుని మనస్సును తాను అంతర్యామిగా నుండి మార్చి వేసినాడు. అట్లు మార్చుటచేత అర్జునునకు భీష్మ ద్రోణులను జూడగానే

పువ్వులతో పూజింపవలసిన వీరిద్దరిని ఎట్లు బాణములతో కొట్టగలను? ఇది చాలా పాపకార్యముగదా? ఈ యుద్ధములో వీరు అందరు మరణించుదురే ! వీరందరిని చంపిన పాపము నాకు సమకూడును గదా ! అనుభావపరంపర పొంగి అర్జునుని విషాదములో ముంచి వేసినది. అంతట త్రోవ తెన్ను గానక ధైర్యము చెడి మూఢత్వ మావరింప 'యచ్ఛ్రేయస్యాన్నిశ్చితంబ్రూహితన్మే శిష్యస్తేహం శాధి మాంత్వాం ప్రపన్నం' అని కృష్ణుని కాళ్ళు బుచ్చుకుని శరణు జొచ్చి తనకు శ్రేయోమార్గమును బోధింపుమని ప్రార్థించెను. అంతట కృష్ణుడు గీతను అర్జునునికి – బోధించి అర్జునుని ద్వారా గీతను అవతరింప జేసెను.

దీనిని బట్టిచూడగా అర్జునునికి కలిగిన విషాదము సహజము కాదనిన్నీ, కృష్ణుని ప్రేరణచే కలిగినదగుటవల్ల ఆగంతుకమనిన్నీ విశదమగు చున్నది. అర్జునుని విషాదము ఆగంతుకము గనుకనే, కృష్ణుని బోధవల్ల నశించుట సంభవించినది. మరియు గీత –1 వ అధ్యాయము 28 వ శ్లోకములో 'కృపయా పరయాఽవిష్టః విషీదన్ " అనిన్నీ 2 వ అధ్యాయము 1శ్లోకములో 'కృపయాచిష్టం విషీదం తం' అనిన్నీ' కృపను కర్తగాను అర్జునుని కర్మగాను వర్ణించుటవల్ల అర్జునునిలో కృప ప్రవేశించినదనిన్నీ అందు చేత అర్జునునికి విషాదము కలిగిన దనిన్నీ వ్య క్తమగుట చేత కూడా కృపయు తద్వారా విషాద మున్ను ఆగంతుకములని స్పష్టమగుచున్నవి. ఇట్లు కృష్ణుడు లోకములోని ప్రజలందరినీ విజ్ఞానభిక్ష ద్వారా తరింప జేయదలచుకొని అర్జునుని, నిమిత్తముగా పెట్టుకొని అతని ద్వారా గీతను అవతరింప జేసినాడు.

అంతకు పూర్వము త్రేతాయుగములో 'రామాయణము కూడా ఇటులనే అవతరించినది. కైకకు తనకన్న కుమారుడైన భరతునికంటె సవతికుమారుడైన రాముని యందు ఎక్కువ ప్రేమయున్నదని కైక చెప్పుటయేగాక, కౌసల్యయు రాముడు కూడ అటులనే వక్కాణించి యున్నారు. అట్లు రామునియందు మిక్కుటమై, అసదృశమైన ప్రేమగల

కైక రాముని పట్టాభిషేకమును విఘ్నము జేసి రాముని అడవికి వెళ్ళమనుట అసంభవము కదా ! రాముడు సీతతో గూడ అడవికి వెళ్ళిన గాని రావణుడు సీతను అపహరించుట సంభవించదు. అట్లు రావణుడు సీతను అపహరించని పక్షమున రావణుని రాముడు సంహ రించుట సంభవించదు. రావణుని సంహరించి దుష్ట శిక్షణ మొనరించి శిష్టుల రక్షించుటకుగదా రామునియొక్క అవతారోద్దేశ్యము, అట్టియుద్దేశ్యము నెరవేరవలెనన్న రావణుడు వధార్హుడగుటకు సీతను యెత్తుకు పోనలసియున్నది. సీతారాములు తమ దివ్యసౌధములలో నివశించు పక్షమున రావణుడు సీత నప హరించుట సంభవించనేరదు. అందుకని సీతారాములు అరణ్యవాసము చేయుట అవసరమైనది. పట్టాభి షేకము సవ్యముగా నెర వేరినచో రామునికి అరణ్యవాసము సంభవించ నేరదు. అందుకని దేవతలందరు. ఇవన్నియు ఆలోచించుకొని రాముని పట్టాభిషేకము విఘ్నము చేయుటకుగాను కైక మనస్సులో సరస్వతీ దేవిని ప్రవేశపెట్టి ఆమెద్వారా రామునికి పట్టాభిషేకము గాకుండా, అరణ్యవాసమగునట్లు ప్రేరేపించినారు. దీనిని బట్టి కైకకు రామునియందు కనబడిన ద్వేషము సహజము కాదనిన్నీ, ఆగంతుకమనిన్నీ స్పష్టమగుచున్నది. భరతునికి పాదుకలిచ్చు సమయములో రాముడు కైక యొక్క పవిత్ర భావమును స్పష్టముగా ఉద్ఘాటించి యున్నాడుగదా! లోకములో ప్రజలకందరికి ధర్మమార్గమును బోధించుటకై కైకకు రామునియెడల ద్వేషమును కల్పించి రామాయణ మును అవతరింప జేసినట్లుగా, లోకములోని ప్రజలకందరికీ జ్ఞానమార్గమును బోధించుటకై అర్జునునికి విషాదమును కల్పించి, దాని ద్వారా భగవద్గీతను శ్రీకృష్ణుడు అవతరింప జేసినాడు.

ఇదియే గీతావతరణ రహస్యము

అందుకనే శంకర భగవత్పాదులవారు తమ గీతా భాష్యములో "సర్వలోక సంగ్రహార్థం అర్జునం నిమిత్తంకృత్య ఆహ భగవాన్ వాసు

దేవః అశోచ్యాన్ ఇత్యాది" అనగా లోకములోని ప్రజలందరినీ గీతాబోధవల్ల తరింపచేయుటకు గాను అర్జునుని నిమిత్తముగా పెట్టుకొని కృష్ణుడు గీతాబోధను గావించినాడు. అని విశదీకరించినారు.

మరియు

శ్లో. సర్వోపనిషదోగావః దోగ్ధా గోపాల నందనః ।
పార్థోవత్సః సుధీః భోక్తాః దుగ్ధం గీతామృతం మహత్ ॥

అను ప్రమాణమును బట్టిగూడా పైభావము విశదమగుచున్నది. ఆ శ్లోకార్థమేమనగా – ఉపనిషత్తులన్నియు ఆవులనియు, ఆ ఆవుల పాలు పితుకువాడు కృష్ణుడనియు అర్జునుడు దూడ అనియు ఆ ఆవులనుండి పితుకబడిన పాలు గీతామృత మనియు, ఈ గీతామృతమను పాలను త్రాగి అనుభవించు వారు ఆధ్యాత్మిక చింతగల జిజ్ఞాసువులు ముముక్షువులనియు విశదమగుచున్నది. ఆవునుండి పాలు రావలెనన్న పాలు చేపు వచ్చుటకుగాను దూడ అవసరమై యున్న దేగాని పాలన్నింటిని దూడ త్రాగుటకుగాదు. దూడ త్రాగెడి పాలు మూడు, నాల్గు గ్రుక్కలు మాత్రమే. మిగతా పాలు ఇతరుల అనుభవమునకే. అటులనే ఈగీతామృతమును పాలలో దూడ వంటి అర్జునున కుపయోగించు భాగము స్వల్పమే. మిగతా దంతయు ముముక్షువులగు ప్రజలందరి అనుభవముకొరకే అని తేలుచున్నది. దీనిని బట్టిగూడ గీతావతరణము ప్రధానముగా లోక సంగ్రహణార్థమనిన్నీ అట్టి అవతరణము నకు అర్జునుడు నిమిత్తమాత్రుడు అయినాడనిన్నీ స్పష్టమగు చున్నది.

ఇంకను గీతావతరణము యుద్ధసమయమున సంభవించుటలో ఔచిత్యమేమి ? అను సంశయము కలుగవచ్చును, దీనికి జవాబేమనగా అన్నమును ఎప్పుడు తినవలెను అను ప్రశ్నకు ఆకలి ఎప్పుడైతే అప్పుడే అన్నము తినవలెను అను జవాబువలె, ఆధ్యాత్మిక ఆకలి ఎప్పుడు కలిగితే

అప్పుడు ఆధ్యాత్మికాహార మైన గీతామృతము అవసరమగును. అట్టి ఆధ్యాత్మిక ఆకలి అర్జునునకు యుద్ధారంభములో కలిగి కృష్ణునితో అట్టి పరిస్థితిని వ్యక్తము చేయుటచేత, అప్పుడే గీతామృతమును కృష్ణుడు అర్జునునకు అందించినాడు. దానితో అర్జునుని ఆధ్యాత్మిక క్షున్నివారణ అయి యుద్ధము చేయ సమర్థుడైనాడు కనుక ఆసమయములో గీతను అవతరింప చేయుటలో అనౌచిత్యము లేకపోగా ఔచిత్యము ఎంతో చక్కగా విరాజిల్లుచున్నది.

నాల్గవ కిరణము

గీతా తత్త్వము

'భగవద్గీత' అను శబ్దమునకు (1) 'భగవతాగీతా' అనగా భగవంతునిచే చెప్పబడినది అనిన్ని (2) 'భగవత్ తత్త్వం ప్రతి గీతా' అనగా భగవత్ తత్త్వమును గురించి చెప్పబడినది అనిన్నీ రెండు అర్థము లుండియున్నవి. దీనిని బట్టి భగవద్గీత అను గ్రంథములో భగవంతుడు భగవత్తత్త్వమును వ్యక్తము చేసినాడని స్పష్టమగుచున్నది.

భగవద్గీతను ఇప్పటికి సుమారు 5000 సం॥రములకు పూర్వము ద్వాపర యుగములో శ్రీకృష్ణ పరమాత్మ అర్జునునికి భారత యుద్ధారంభమున చెప్పినట్లు కనబడినప్పటికి 'భగవతాగీతా' అన్నట్లుగా సాక్షాత్తు భగవంతునిచే (కృష్ణావతారము ద్వారా) చెప్పబడినది. కనుకనే కృష్ణగీత అని కాకుండా భగవద్గీతా అని పేరు వచ్చినది అని లోగడ విశదీకరించబడినది.

ఇంకను 'భగవత్తత్త్వం ప్రతిగీతా భగవద్గీతా' అను వ్యుత్పత్త్యర్థమునుబట్టి భగవద్గీతలో చెప్పబడినది, భగవత్‌తత్త్వము కనుక, గీతాతత్త్వము భగవత్తత్త్వమే అయియుండవలెను. అట్టి తత్త్వమేమో విచారించుదము. గీతలో ప్రతి అధ్యాయమునకును చివర 'ఇతి (1) శ్రీ భగవద్గీతాసు (2) ఉపనిషత్సు (3) బ్రహ్మవిద్యాయాం (4) యోగశాస్త్రే

(5) కృష్ణార్జున సంవాదే అని ఉన్నది. దీనిలో వ్యక్తమైన అయిదు భావములలో మధ్యదైన ' బ్రహ్మవిద్య' అనునది విశేష్యముగను మిగతా నాలుగు విశేషణములుగను తీసికొన తగియున్నది. విశేష్యమైన బ్రహ్మవిద్యయే ఈ గీతాతత్త్వము. ఈ బ్రహ్మవిద్య ఎక్కడ లభించును. అంటే దానికి పూర్వము విశేషణముగా వర్ణించబడిన 'ఉపనిషత్సు' అను దానివల్ల ఉపనిషత్తులలో దొరకునని చెప్పబడినది. ఆ ఉపనిషత్తులు పురుషకృతములు గాక అపౌరుషేయములు. అని విశదీకరించుటకుగాను 'భగవద్గీతాసు' అను మొదటి విశేషణము వాడబడినది. భగవద్గీత' అనగా 'భగవతా గీతా' అని చెప్పబడినదానికి భగవంతుని చేత వ్యక్తము చేయబడినది అని అర్థమే కాని భగవంతుడి చేత చెప్పబడినదని కాదు. 'న కశ్చి ద్వేద కర్తాచ' 'అనాది నిదనా నిత్యావాగు త్సృష్టా స్వయంభువా' 'ఈశ్వరస్త స్సవ్యం జకః' యస్య నిశ్వ సితం వేదాః' ఇత్యాది ప్రమాణములు వేదములు పరమేశ్వరుని ఉచ్ఛ్వాసములనియు, వేదములు ఆదిలేనివి, నిత్యములు అనియు, వేదములకు కర్త లేడనియు, నిశ్వాసకువలె పరమేశ్వరుడు వారికి అభివ్యంజకుడు మాత్రమే అనియు, స్పష్టము చేయుచున్నవి. కనుక 'భగవత్ గీతా' అనగా 'అర్థము భగవంతుని చేత' వ్యక్తము చేయబడినదే కాని చెప్పబడినది కాదని స్పష్టమగు చున్నది. ఇట్టి బ్రహ్మవిద్యను అభ్యసింపవలసిన విధానము 'యోగశాస్త్రే' అను నాల్గవ విశేషణము వలనను, 5వ విశేషణము అయిన 'శ్రీకృష్ణార్జున సంవాదే' అను దానివల్లను స్పష్టము చేయబడినది. అది ఎట్లు అనగా యోగము అనగా సాధనమని అర్థము. గీతలోని పదునెనిమిది అధ్యాయములలోను పదునెనిమిది సాధనములు తెలియ చేయబడినవి, కనుక గీతాతత్త్వమైన బ్రహ్మవిద్యను ఆ పదునెనిమిది సాధనముల ద్వారా అభ్యసింపవలయును అని గ్రహించవలెను. మరియు 'కృష్ణార్జునసంవాదే' అను విశేషణమువలన కృష్ణుని అర్జునుడు గురువుగా స్వీకరించిన తరువాతనే కృష్ణుడు గీతను చెప్పినాడు గనుక యీ గీతాతత్త్వమైన బ్రహ్మవిద్య గురుముఖతః. గురు శుశ్రూష ద్వారా తెలిసి కొనదగినదే కాని ఎవరికి

వారు స్వతంత్రించి పుస్తకముల ద్వారా నేర్చుకొన తగినది కాదని తెలియుచున్నది. పై విమర్శవలన గీతాతత్త్వమైన భగవత్ తత్త్వము బ్రహ్మ విద్యయే అని తేలినది.

బ్రహ్మవిద్య అనగా జీవబ్రహ్మైక్యమును బోధచేయు విద్య అని ఉప నిషత్తులవల్ల స్పష్టమగుచుండుట చేత, గీతా తత్త్వము అంటే జీవ బ్రహ్మైక్యమును చెప్పు బ్రహ్మవిద్యయే అని తేలుచున్నది.

ఇంకను గీతలోని 18 అధ్యాయములను 3 షట్కములుగా విభాగించి నపుడు, 'మొదటి షట్కము' 'త్వం' పదార్థమైన జీవస్వరూపమును, 2వ షట్కము 'తత్' పదార్థమైన ఈశ్వర స్వరూపమును, 3వ షట్కము 'అసి' పదార్థమైన జీవ బ్రహ్మైక్యమును తెలియ జేయుచుండుట చేత 'తత్త్వమసి' అను మహావాక్యమునకు గీత లక్ష్యభూత మైనగ్రంధమని తెలియుచున్నది. 'తత్త్వమసి' అను మహావాక్యము జీవ బ్రహ్మైక్యమును తెలియజేయుచున్నదిగదా కనుక గీతా తత్త్వము జీవబ్రహ్మైక్యమును బోధించు అద్వైత జ్ఞానమే అని విశదమగుచున్నది. మరియు 'మొదటి షట్కము' లో కర్మ యోగము, 2వ షట్కములో భక్తి యోగము, 3వ షట్క ములో జ్ఞాన యోగము, బోధింపబడి యుండుటచేత "మొదటి షట్కములోని "త్వం" పదవాచ్యుడగు జీవుడు ఆషట్కములో చెప్పబడిన కర్మయోగమును అనుసరించిన యెడల 2వ షట్కములో వర్ణింపబడిన తత్ " పదవాచ్యుడగు ఈశ్వరుని ఆ షట్కములో చెప్పబడి ప్రకారము భక్తి చేయుటకు అర్హుడై భక్తి చేయగా, 'భగవదను గ్రహమునకు పాత్రుడు అయి, 3వ షట్కములో చెప్పబడిన జ్ఞానయోగము నవలంబించి "అసి" పదార్థమగు జీవబ్రహ్మైక్యమును అనుభవములోనికి తెచ్చుకొని జీవన్ముక్తుడగును. దీని వలన కూడా గీతాతత్త్వము అద్వైతజ్ఞాన మనియు అట్టి అద్వైతజ్ఞానమునకు కర్మయోగము, భక్తియోగము సాధనము లనియు తెలియుచున్నది.

ఇంకను గీతాతత్త్వము ఏమి అను విషయమును మీమాంసా శాస్త్రములో చెప్పబడిన షడ్విధలింగములతో విమర్శించి చూచినను గీతాతత్త్వము అద్వైతమే అని స్పష్టమగును. ఆ షడ్విధలింగములు ఏవి అనగా (1) ఉపక్రమోప సంహారములు (2) అభ్యాస (3) అపూర్వత (4) ఫలము (5) అర్థ వాద (6) ఉపపత్తి.

1. ఉపక్రమోప సంహారములు :- కృష్ణుని బోధ 2వ అధ్యాయము

1వ శ్లోకము 'అశోచ్యాన న్వశోచ స్త్వం ప్రజ్ఞా వాదాంశ్చ భాషసే ।
గ తాసూన గతా సూశ్చనాను శోచంతిపండితాః,

అను శ్లోకముతో ఆరంభమై 18 వ అధ్యాయము 66 వ శ్లోకము
సర్వధర్మాన్ పరిత్యజ్యమామేకం శరణం వ్రజ ।
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయి ష్యామి మాశుచః ॥

అను శ్లోకములో ఉపసంహారము చేయఁబడినది. ఉపక్రమములో ఆత్మజ్ఞాని దుఃఖించడు అని చెప్పబడి ఉపసంహారములో కనుక నీవు దుఃఖించకుము అని చెప్పబడినందువల్ల దుఃఖనివారణ ఆత్మజ్ఞానమువల్లనే కల్గును అని స్పష్టమగుట చేత, యీ ఉపక్రమోప సంహారములు గీతాతత్త్వము, ఆత్మజ్ఞానమే ! అని సూచించుచున్నవి. మరియు కృష్ణుడు గీతనంతయు బోధచేసి, చివరకు 18 వ అధ్యాయము 63 వ శ్లోకములో 'ఇతితే జ్ఞాన మాఖ్యాతం, గుహ్యాద్గు హ్యతరం మయా' అని చెప్పుటవల్ల కృష్ణుడు చెప్పిన గీతాతత్త్వము జ్ఞానబోధయే అని సాక్షాత్తు కృష్ణుని మాటలవల్లనే స్పష్టమగు చున్నది. ఇంకను కృష్ణుడు గీతా బోధను ముగించిన తరువాత 18వ అధ్యాయం 73వ శ్లోకములో కచ్చిదజ్ఞాన సంమోహః ప్రణష్టస్తే ధనంజయ' అనగా నీకు అజ్ఞానమువలన పుట్టిన సంమోహము (యీనా బోధవల్ల) పోయినదా అని అడుగగా దీనికి జవాబుగా అర్జునుడు 'నష్టోమోహఃస్మృతిర్లబ్ధా త్వత్ప్రసాదాన్మ యాచ్యుత' అనగా మీ అనుగ్రహమువల్ల నాకు జ్ఞానము కలిగినది. మోహము పోయినది అని చెప్పినాడు. అర్జునుకి కలిగిన ఆ అజ్ఞానమును నశింప జేయునది జ్ఞానమేకాని ఇంకొకటి కానేరదు

కనుక గీతాతత్త్వము జ్ఞానబోధయే అని అర్జునుని వాక్యములవలననూ కూడా స్పష్టమగుచున్నది. ఇట్లు కృష్ణుని యొక్కయు అర్జునునియొక్కయు వాక్యముల వలననే గీతాతత్త్వము జ్ఞానబోధయని స్పష్టమగుచున్నది.

మరియు 4వ అధ్యాయము 33వ శ్లోకములో 'సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే' అనగా కర్మయంతయు జ్ఞానములోనే పరిసమాప్తి చెందును. అని వర్ణించుటవల్ల కర్మము జ్ఞానమునకు సాధనమని స్పష్టపడు చున్నందున గీతాతత్త్వము కర్మబోధ కానేరదు. ఇంకను 11వ అధ్యాయం 14 శ్లోకములోను, 18వ అధ్యాయం 55 వశ్లోకములోనున్ను 'భక్త్యా' అను తృతీయావిభక్తి వలన భక్తి కూడా జ్ఞానమునకు సాధనమని స్పష్టముగా చెప్పబడినందున గీతాతత్త్వము భక్తియు కానేరదు.

(2) అభ్యాస: అభ్యాస అనగా పలుసార్లు చెప్పుట. గీతలలో 2, 4, 7, 13, 14, 15, 18 అధ్యాయములలో ప్రధానముగాను, మిగతా అధ్యాయములలో అక్కడక్కడయును, శోకనాశనమగు జ్ఞానము పలుసార్లు స్తుతింపబడి యున్నది. ఇట్టి అభ్యాసలింగమువలనకూడా గీతాతత్త్వము జ్ఞానమే అని విశదమగుచున్నది.

(3) అపూర్వత :-అపూర్వత అనగా మనకు యింకొక విధముగా తెలియుటకు వీలులేని విషయబోధ. అట్టిది జీవ బ్రహ్మైక్యబోధయే. 13వ అధ్యాయ. 2వ శ్లోకములో ' క్షేత్రజ్ఞం చాపిమాం విద్ధి సర్వక్షేత్రేషు భారత' అనియు, 7వ అధ్యాయం 18వ శ్లోకములో 'జ్ఞానీ త్వాత్మైవ మేమతం'. అనియు స్పష్టముగాను, మిగతాచోట్ల ఆర్థికముగాను, జీవ – బ్రహ్మైక్యము చెప్పబడుట చేత, అట్టి జీవబ్రహ్మైక్య జ్ఞానబోధయే గీతాతత్త్వము అని యీ అపూర్వత అనులింగమువలనున్ను స్పష్టమగుచున్నది.

(4) ఫలం :- ఫలం మోక్షరూపం. భగవద్గీతలో అనేక చోట్ల మోక్ష ఫలం 'శాంతి మాప్నోతి నైష్ఠికీం' 'నశాంతి మాధిగచ్ఛతి' 'సశాంతి

మాప్నోతి' మున్నగు ప్రమాణములవల్ల శాంతియేం అని స్పష్టమగుచున్నది. అంతేకాని వైకుంఠాది లోకాంతరగమనము కాదనిన్నీ తేలుచున్నది. ఇంకను ఉప నిషత్తులలో గూడా మోక్ష ఫలము శాంతి రూపకముగాను అభయ రూపకము గాను వర్ణింపబడినదేగాని, లోకాంతరగమనముగా వర్ణింపబడలేదు. అట్టి ఫలము జ్ఞానమువల్లనే లభ్యమగును. కాని కర్మవల్లకాని భక్తివల్లకాని రానేరదు. కర్త భక్తుల ఫలము లోకాంతరప్రాప్తియే, అది ఈ గీతలో వర్ణింపబడక, జ్ఞానముయొక్క ఫలమయిన శాంతి వర్ణింపబడుట చేత, గీతాతత్త్వము జ్ఞానమే అని యీ ఫలలింగమువలనకూడా స్పష్టమగుచున్నది.

(5) అర్థ వాద : అర్థ వాద మనగా స్తుతి ప్రధానమైన వాక్యవిశేషము. 'హత్వాపి స ఇమాన్, లోకాన్ న హంతి, ననిబధ్య తే' (18-17) 'సర్వధా వర్తమానోపి న సభూయో భిజాయ తే' (13-24) - 'అపి చేదసి పాపేభ్యః సర్వేభ్యః పాప కృత్తమః సర్వంజ్ఞానప్ల వేనైవ వృజినం సంతరిష్యసి" (4-36) మున్నగు వాక్యములు ఆత్మజ్ఞానముగల జ్ఞానిని ఎంతగా స్తుతించుచున్నవనగా, అట్టి జ్ఞాని లోకములన్నింటిని చంపువాడైనను, ఎట్టిదురాచారములు కలవాడు అయినను, ఎట్టి ఘోర పాపములు చేసిన వారలలో అధమాధమ పాపి అయినను, వానిని ఇవి ఏవియు బాధింపవు. వాడు జ్ఞానము అను తెప్పచేత అన్నింటిని దాటి తిరిగి పుట్టడు. వాడు ముక్తుడే అని జ్ఞానము యొక్క స్తుతిని ప్రదర్శించుటచేత యీ అర్థవాదలింగముకూడా జ్ఞానమే గీతాతత్త్వము అని స్పష్టపర్చుచున్నది.

(6) ఉపపత్తి :- ఉపపత్తి అనగా యుక్తివిచారణ మీద సరిపోవుట. గీతలో 7వ అధ్యాయం 2వ శ్లోకములో 'యద్జ్ఞాత్వా నేహ భూయోన్యత్ జ్ఞాతవ్య మవ శిష్య తే' అను ఏక విజ్ఞానేన సర్వవిజ్ఞాన ప్రతిజ్ఞ యును, 5వ అధ్యాయము లోను ఇతర అధ్యాయములలోను చెప్పబడిన జీవన్ముక్తియును అద్వైత జ్ఞానమునకే ఉపపత్తి లింగములుగా

సరిపోవును కాని ద్వైత విశిష్టాద్వైత భక్తి సిద్ధాంతములకు యుక్తి మీద కుదరవు. ఆ సిద్ధాంతముల ప్రకారము జీవన్ముక్తియే లేదు. చనిపోయిన తరువాతనే ముక్తి. ఇంకను యిట్టి అద్వైత సిద్ధాంతమునకే కుదురునట్టియు, తద్భిన్న సిద్ధాంతములకు యుక్తి మీద సరిపోనట్టియు, అనేక భావములుగల శ్లోకములు గీతలో ఉండియున్నవి. ఇట్లు ఉపపత్తిలింగముకూడ గీతాతత్త్వము అద్వైత జ్ఞానవే అని సూచించుచున్నది.

ఇట్లు షడ్విధలింగ తాత్పర్యములవల్లను గీతాతత్త్వము అద్వైత జ్ఞానబోధయే అని స్పష్టమగుచున్నది. ఇట్టి అద్వైత జ్ఞానమునకు నిష్కామకర్మయోగమును, భక్తి యోగమున్ను సాధనములు. 'భగవద్గీతా' అను శబ్దములో 'గీతా' అను శబ్దము ఆకారాంత స్త్రీలింగముగా వర్ణింపబడినది. ఇట్లు ఎందుకు వర్ణింపబడిన దనగా, ఉపనిషత్తులలోని జ్ఞానబోధయే ఈ గీతాతత్త్వము అగుట ఉపనిషత్ అను శబ్దము స్త్రీలింగ మగుటచేతను, గీతకు ' ఉపనిషత్ ' సాదృశ్యమును తెల్పుటకై 'గీతా' అని స్త్రీలింగము ప్రయోగించబడినది.

అయిదవ కిరణము

ధృతరాష్ట్రుని ప్రశ్న

(గీత - 1వ అధ్యాయము)

భగవద్గీత అంతను అనగా ఏడువందల శ్లోకములను విషయ వారీగా విమర్శించిన యెడల నాలుగు భాగములుగా తేలును,

1. ధృత రాష్ట్రుని ప్రశ్న (ఒకటవ శ్లోకము)
2. అర్జునుని విషాదము - ఒకటవ అధ్యాయము రెండవ శ్లోకము నుండి రెండవ అధ్యాయము (పదియవ శ్లోకమువరకు)
3. కృష్ణునిబోధ (రెండవ అధ్యాయములో పద కొండవ శ్లోకము మొదలు 16వ అధ్యాయము 66వ శ్లోకము వరకు)
4. ఫలశ్రుతి. (18 లో 67 మొదలు చివరివరకు)

పైవిధముగా గీతనంతను విభాగము చేసిన తర్వాత గీతలోని ప్రతి అధ్యాయమును విషయవారీగా విమర్శించిన యెడల విషయము చక్కగా బోధపడును గనుక అట్టి విభాగమును గావించుదము.

గీతలోని మొదటి అధ్యాయమునకు అర్జున విషాద యోగమని పేరు. ఈ అధ్యాయములో 47 శ్లోకములున్నవి. 47 శ్లోకములేకాక రెండవ అధ్యాయములోని మొదటి పది శ్లోకములనుగూడ విషాద యోగమునకు చెందినవై యున్నవి. రెండవ అధ్యాయము పదకొండవ శ్లోకము మొదలుకొని కృష్ణునిబోధ ప్రారంభము. ఇట్లు అర్జున విషాద యోగమునకు సంబంధించిన (47+10) 57 శ్లోకములను విషయవారీగా విమర్శించినచో 6 భాగములుగా తేలును,

1. ధృతరాష్ట్రుని ప్రశ్న-(ఒకటవ శ్లోకము)
2. ఉభయ సేనల వర్ణన-(2వ శ్లోకము మొదలు 11 వరకు)
3. శంఖములు పూరించుట-(12వ శ్లోకము మొదలు 19 వరకు)
4. అర్జునుని చే ఉభయ సేనలు సమీక్ష (20 మొదలు 27 వరకు)
5. అర్జునుని విషాదము-(28 'మొదలు 46 వరకును, రెండవ అధ్యాయములో 1 మొదలు 8 వరకును)
6. అర్జునుని చే యుద్ధవిరమణ (1లో 47, 2లో 9, 10)

పై ఆరు విషయములను విపులముగా విమర్శించుదము.

1. ధృతరాష్ట్రుని ప్రశ్న :

శ్లో ॥ 'ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమ వేతా యుయుత్సవః ।
మామ కాః పాండవా శ్చైవ కిమకుర్వత సంజయ' ॥

అనునది ధృతరాష్ట్రుని ప్రశ్న, కౌరవులకును పాండవులకును ఆస్తి విషయమై కలహము లేర్పడగా ఉభయులును కురుక్షేత్రములో యుద్ధము చేయుటకు సన్నద్ధులైరి. ధృతరాష్ట్రుడు గ్రుడ్డివాడగుటచే యుద్ధవార్తలను " తెలుసుకొనవలెనని వాంఛ కలుగగా, వ్యాసులవారు సంజయుని

యుద్ధవార్తలు చెప్పుటకుగాను నియోగించినారు. యుద్ధము మొదటి 10 రోజులును భీష్ముని సేనానాయ కత్వమున జరిగి 10వ రోజున భీష్ముడు పడిపోయెను. అంతట సంజయుడు కురుక్షేత్రమునుండి హస్తినా పురమునకు వచ్చి ధృతరాష్ట్రునితో

"హతో భీష్మశ్శాంతనవో భరతానాం పితా మహః" అనగా భీష్ముడు పడిపోయెను. అని చెప్పెను. ఆ సంగతి ధృతరాష్ట్రుడు వినగానే దుఃఖములో మునిగిపోయి కొంత సేపటికి తెప్పరిల్లి సంజయుని

"ధర్మ క్షేత్రే కురుక్షేత్రే సమ వేతా యుయుత్సవః ।
మామకాః పాండ వాశ్చైవ కిమ కుర్వత సంజయ' ॥

అని అడిగినాడు. ఈ ప్రశ్న అడుగుటకు పూర్వమే యుద్ధము ప్రారంభమై 10 రోజులు గడిచి భీష్మ పతనము గూడ సంభవించుట చేత, అట్టి పరిస్థితి ననుసరించియే ఈ శ్లోకమునకు మనము అర్థము చెప్పుకొనవ లెను. అప్పుడు ఈ శ్లోకమునకు అర్థ మేమనగా

1. ధర్మక్షేత్రమైన కురు క్షేత్రములో మావారున్ను (కౌరవులు), పాండవులున్నూ యుద్ధము చేయుటకు సన్నద్ధులై ఏవిధముగా యుద్ధము చేసిరో, మొదటినుండియు ఏమి జరిగినదో అంతా వివరముగా. చెప్పుము అని అర్థము చెప్పదగియున్నది.

'ధర్మక్షేత్రే' అను శబ్దమును బట్టిన్ని ఇతర సందర్భములను బట్టిన్ని ధృత రాష్ట్రుని మనస్సులో దిగువ నుదహ రించిన భావములు కలిగియుండ వచ్చునని యూహించ వచ్చును. ఆవిధముగా జూచిన చో మొదటి శ్లోకమునకు పై అర్థ మేగాక ఈ దిగువ అర్థములనుగూడా చెప్పుకొన వచ్చును.

2. పాండవులు ధర్మాత్ములు గనుక వారు ధర్మ క్షేత్రమైన కురు క్షేత్రములో ప్రవేశించగానే వారి ధర్మబుద్ధి వృద్ధియై యుద్ధ వాంఛ పోయి వారు యుద్ధము చేయక వెళ్ళిపోయి యుందురేమో, అట్లయిన మావాళ్ళకు నిరాటంకముగా రాజ్యము ప్రాప్తించవచ్చును. 'అని'

అనుకున్నాను కాని సంజయా ! అట్లు జరుగక ఏమి జరిగినదో చెప్పుము ఇది 2వ అర్థము.

3. మావారు అధర్మాత్ములైనను ధర్మక్షేత్రమైన కురుక్షేత్రములో కాలు పెట్టగానే వారికున్న అధర్మబుద్ధి పోయి పాండవులు రాజీగా కోరిన ఐదు గ్రామములును వారికి యిచ్చుటకు అంగీకరించినచో యుద్ధము జరుగకుండా యుండవచ్చును అని అనుకొన్నాను. అట్లుగూడా జరుగక, ఏమి జరిగినదో చెప్పుము సంజయా ! అని 3వ అర్థము.

4. మా సైన్యములో జయించుటకు సాధ్యముకాని భీష్మ ద్రోణాదులు ఉన్నారు గనుక వారినిజూచి పాండవులు భయపడి అట్టి దృష్టభయము చేత యుద్ధమునే మానుకుంటారేమో అనికూడా తలచినాను. అట్లుకూడ జరుగక ఏమి జరిగినదో చెప్పు సంజయా ! అని 4వ అర్థము. .

5. ధర్మాత్ములైన పాండవులు ధర్మముగా యుద్ధము చేసినచో భీష్ముని పడగొట్టుట సాధ్యము కాదు. కనుక పాండవులు భీష్ముని పడగొట్టుటకు అధర్మయుద్ధము చేసినారా ఏమి చెప్పు సంజయా ! అని 5వ అర్థము.

6. 'కిమ కుర్వత' అను దానిని ప్రశ్నార్థకముగా కాక ఆక్షేపార్ధకముగా తీసుకొనినచో అప్పుడు తేలిన అర్ధమేమనగా- ధర్మాత్ములనిపించుకొనిన పాండవులు భీష్ముని పడగొట్టినారంటే ఎంత అధర్మమైన ఘోరకృత్యము చేసి నారో కదా ! అని 6వ అర్థము.

7. భీష్ముడు పడిపోయినా అజేయులగు ద్రోణుడు, కృపుడు, కర్ణుడు, అశ్వత్థామ మున్నగువారున్నారు గనుక వారివలననైనా మాకు జయము లభింపక పోవునా ! అని ఆశతో నున్నాను. సంజయా ! ఏమి జరిగినదో చెప్పుము. అనగా పర్యవసాన మేమగునో చెప్పుము

అని ధృతరాష్ట్రుని ప్రశ్నలో భావమిమిడియున్నది అనికూడా ఊహించవచ్చును ఏల ననగా ఇట్టి భావమునకు జవాబుగానే సంజయుడు గీతలోని చివర శ్లోకములో

"యత్ర యోగేశ్వరః కృష్ణః-యత్ర పార్థో ధనుర్ధరః ।
తత్ర శ్రీర్విజ యోభూతిః - ధ్రువా నీతిర్మతిర్మమ ॥

అనగా కృష్ణుడు అర్జునుడు ఎక్కడ ఉంటే అక్కడ జయము అని చెప్పినాడుకదా ! ఇది 7వ అర్థము.

8. గీతలోని మొదటి శ్లోకములోని ధృతరాష్ట్రుని ప్రశ్నకు పైన చెప్పిన అర్థములున్నూ చరిత్రాత్మకంగా చెప్పబడినవి. గీత కేవలము భారతీయులను మాత్రమే తరింపచేయుటకు అవతరించిన గ్రంథము కాక, ప్రపంచములోని మానవులందరిని తరింప చేయుటకు పుట్టిన ప్రపంచ మత గ్రంథము గదా! గీతలోని శ్లో॥ 'మమవర్త్మానువర్తన్తే మనుష్యాః పార్థసర్వశః' (4-11) శ్లో ॥'అన న్యాశ్చింతయంతో మాం। యేజనాః పర్యుపాసతే' (9-22) శ్లో ॥ 'యస్త్వాత్మ రతి రేవస్యాత్ ఆత్మతృప్తశ్చ 'మానవ' (3-17) ఈమున్నగు గీతాశ్లోకములలోని 'మనుష్యాః' 'జనాః' 'మానవః'మున్నగు పదములు గీత ప్రపంచములోని మానవు లందరిని ఉద్దేశించి అందరిని తరింప జేయు గ్రంథరాజమని వక్కాణించు చున్నవి. అట్లైనచో ఈ గీత నాటకములోని ధృతరాష్ట్రుడు, సంజయుడు, కృష్ణుడు, అర్జునుడు అను నలుగురు పాత్రలు హిందూ మతమునకు సంబంధించిన వారు కాని యితరులకు సంబంధించిన వారు కాదు. గనుక, గీత ఎట్లు విశ్వ మానవ మతగ్రంథము కాగలదు? అను ప్రశ్న వచ్చును. అందుకని ఆ నాల్గు శబ్దములకు చరిత్రాత్మకమైన అర్థమేగాకుండా సర్వమానవులకు సంబంధించే ఆధ్యాత్మిక అర్థం కూడ చెప్పుకోవలసి యున్నది. అట్లు చెప్పినచో ఆశబ్దములకు. వచ్చు అర్థము ఏమి అనగా (1) 'ధృత రాష్ట్రుడు' అను శబ్దమునకు అర్థము రాష్ట్రము అను శరీరమును ధరించినవాడు అనగా దేహమే ! నేననుకొను అజ్ఞాని.

ధృతరాష్ట్రుడు గుడ్డివాడు గనుక ఆ భావమునకు ఆధ్యాత్మికార్థము చెప్పుకొన్నపుడు, జ్ఞాన నేత్రము , లేని దేహతాదాత్మ్యంగల అజ్ఞాని అని అర్థము.

2. 'సంజయుడు' - అనగా మంచి జయము కలవాడు, ఇంద్రియ జయము, మనోజయము, అవిద్యాజయము గలిగిన జ్ఞాని అని అర్థము. ధృతరాష్ట్రుడు సంజయుని ప్రశ్న అడుగుచున్నాడనగా, అజ్ఞాని అగు శిష్యుడు జ్ఞానియగు గురువును తరణోపాయమును గురించి ప్రశ్న అడుగుచున్నాడని అర్థము. ఇట్టి పరిస్థితులలో, ధృతరాష్ట్రుడు, సంజయుడుఅను శబ్దములు సర్వమానవవ్యాప్తిగలవి అగుననుటలో సందేహముండ నేరదు. ఇటులనే 'కృష్ణుడు' అను శబ్దమునకు భగ వంతుడనిన్నీ, 'అర్జును'డనగా భక్తుడగు జీవుడనిన్నీ, చెప్పు కొన వచ్చును.

ఇకను 'ధర్మక్షేత్రే కురుక్షేత్రే అను . మొదటి శ్లోకమునకు ఆధ్యాత్మిక అర్థమును చెప్పుకొనవలసి యున్నది. అదిఏమనగా 'కురుక్షేత్ర' మనగా 'శరీరము ' అని అర్థము. 'కురు' అనగా ఇంద్రియములు అని అర్థము గనుక , కురుక్షేత్ర మనగా ఇంద్రియముల కాధార మైన శరీరము అని అర్థము. ఇట్టి ధర్మక్షేత్రమని వర్ణింపబడుట చేత ఈశరీరము ధర్మము అనే పంటను తద్వారా జ్ఞానమనే పంటను పండించుటకు తగిన సాధనము అని తేలును. క్షేత్రమనగా పొలమని అర్థమున్నది కదా ! పొలము అనగా పంటను పండించేదే కదా ! కనుక శరీరమను క్షేత్రము గూడా ధర్మము జ్ఞానము అను పంటలను పండించుటకుగాను మనకు భగవంతునిచే అనుగ్రహింపబడినదని మనము తెలిసికొనవలసియున్నది. ఆ శ్లోకములోని 'మామకాః' 'పాండవాః' అను శబ్దములకు కౌరవులు, పాండవులు అని చరిత్రాత్మక మైన అర్థము.

ఇక ఆధ్యాత్మిక అర్థము ఏమనగా 'మామకాః' అనగా నావాళ్ళు అనుటలో రాగముతో కూడినవారు కను కను, రాగము రజోగుణమువల్లను తమోగుణమువల్లను పుట్టునది గనుకను, 'మామకాః ' అనగా రజోగుణ తమో గుణములని అర్థము.'పాండవాః' అనుటలో పాండు అను శబ్దములో తెలుపు స్వచ్ఛత అను భావములు యిమిడి ఉన్నవి గనుక, 'పాండవాః' అనగా సాత్విక గుణములు అని అర్థము. నావారలు పాండవులును యుద్ధమునకు సన్నద్ధులై నారు అను శ్లోకములోని భావమునకు అధ్యాత్మికార్థము ఏమనగా, మనశరీరములోని రజోగుణ తమోగుణములకున్ను సాత్విక గుణములకున్ను, తగాదావచ్చినదని అర్థము, అనగా దైవసంపత్తునకు అసురసంపత్తునకు తగాదా లేక మంచిగుణములకు చెడ్డగుణములకు తగాదా. ఇట్టి తగాదా ప్రపంచములో ప్రతిమానవుని అంతః కరణములోను ప్రతి నిమిషము జరుగుచున్న సంగతి అందరికీ తెలిసిన దేగదా ? అట్టి తగాదాలోనుంచి బయటపడి ధర్మమును, జ్ఞానమును సంపాదించుకొని తరించుకొనుటకు సాధనములను తెలుసుకొనుటకే యీ ప్రశ్న పుట్టినది. చెడ్డగుణములకు మంచి గుణములకు తగాదా ఎలావచ్చింది. ఎలావస్తుంది. ఎలాపోతుంది అను భావములు యీ మొదటి ప్రశ్నలో యిమిడియున్నవని అనుకోవచ్చును.

ఇది 8వ అర్థము.

9. ఈ శ్లోకములోని 'కిమకుర్వత' అను శబ్దమును ఆక్షేపార్థముగా తీసుకొనినచో అధ్యాత్మికంగా వచ్చే అర్థమేమనగా నా శరీరమనే క్షేత్రము ధర్మము అనే పంటను పండించుటకుగాను భగవంతునిచే అనుగ్రహింపబడి యుండగా, నాలోని దుర్గుణములు సద్గుణములతో పోట్లాట పెట్టుకొని ధర్మమనే పంట పండకుండా చేసి, ఎంత అక్రమము చేస్తున్నవి ! స్వామీ, దానిలో నుంచి బయటపడే ఉపాయము చెప్పండి అని అజ్ఞాని అయిన శిష్యుడు జ్ఞాని అయిన గురువును అడిగే ప్రశ్న. ఇది 9వ అర్థము.

ఆరవ కిరణము

సంజయుని సమాధానము

(గీత - 1వ అధ్యాయము)

'ధర్మక్షేత్రే కురుక్షేత్రే' అను శ్లోకము ద్వారా ధృతరాష్ట్రుడు వేసిన ప్రశ్నకును ఆ ప్రశ్నలో వ్యక్తము కాబడిన వివిధ భావములకును సంజయుడు.

శ్లో. 'దృష్ట్వాతు పాండవానీకం వ్యూఢం దుర్యోధన స్తధా ।
ఆచార్యముపసంగమ్య రాజావచన మబ్రవీత్ ॥

అను శ్లోకముతో ప్రారంభించి సమాధానమును చెప్పనారంభించెను. 'దృష్ట్వాతు' అను పై శ్లోకముయొక్క, భావ మేమనగా–పాండవుల యొక్క సేనలను చూచి ధుర్యోధనుడు తన గురువైన ద్రోణచార్యుని వద్దకు వెళ్ళి మాట్లాడ ప్రారంభించెను. అనగా తన భావములను గురువర్యునకు ప్రకటించ నారంభించెను. అని పై శ్లోకమునకు అర్థము. ఈ శ్లోకములో 'తు' అను శబ్దప్రయోగమువల్ల తత్ పూర్వశ్లోకము యొక్క భావములకు వ్యతిరేకార్థము ద్యోతక మగుచున్నది అని తెలిసికొనవలసి యున్నది. దాని పూర్వశ్లోకములో ధృతరాష్ట్రుడు వ్యక్తము చేసిన వివిధ భావములను మనము లోగడ తెలుసుకొనియున్నాము, ఆ భావములకు విరుద్ధ భావము తెలియపర్చదలచి సంజయుడు యీ శ్లోకములో 'తు' అను శబ్దప్రయోగము గావించెను. 'తు' శబ్దమువల్ల సూచితమైనవై లక్ష్యములోని వివిధ భావములు ఏవనగా

1. ధృతరాష్ట్రుడు తన ప్రశ్నలో వ్యక్తము చేసిన భావముల ప్రకారము యేమియు జరుగలేదని సూచించుట, "తు" శబ్దముయొక్క మొదటి అర్థము, పాండవులు ధర్మక్షేత్రమైన కురుక్షేత్రములో కాలుపెట్టగనే వారికి ధర్మ బుద్ధి యెక్కువై వారు యుద్ధమును మానుదు

రేమోయని ధృతరాష్ట్రుడు అనుకున్న ప్రకారము జరుగలేదనిన్నీ, ఇట్లనే కౌరవులకు అధర్మబుద్ధిపోయి ధర్మబుద్ధితో పాండవులకు అయిదు గ్రామములు యిచ్చి రాజీపడుదురేమోయని యనుకున్న ధృతరాష్ట్రుని భావమును నెరవేరలేదనిన్నీ, మరియు పాండవులు ధృతరాష్ట్రుడు యనుకున్నట్లు అధర్మయుద్ధమును చేయలేదనిన్నీ, ఇంకనూ ధృతరాష్ట్రుడు యనుకున్నట్లు పాండవులకు భీష్మ ద్రోణాదులను చూచినమీదట వారితో గెల్చుటకు సాధ్యము కాదను దృష్టభయము పాండవులకు కల్గలేదనిన్నీ, ఈ అన్ని భావములు సూచితమైనవని మొదటి అర్థము.

2. పాండవులకు దృష్టభయము కల్గకపోగా దుర్యోధనునికే దృష్ట భయము కల్గినదను వైలక్షణ్యమును సూచించుటకే సంజయుడు 'తు' అను శబ్దమును ఉపయోగించినాడు అని 'తు' శబ్దమునకు రెండవ అర్థము. దుర్యోధనునకు దృష్ట భయము కల్గినదని చెప్పుటకు అయిదు హేతువులు గలవు.

(అ) దుర్యోధనుడు గురువైన ద్రోణాచార్యునివద్దకు స్వయముగా వెళ్ళినాడు యని చెప్పుటలో దృష్టభయము కలదని సూచన యగుచున్నది. రాజుయైన వాడు తన వద్దకు తన యాచార్యుని పిలిపించుకొనవలెను కాని తాను స్వయముగా ఆచార్యునియొద్దకు వెళ్ళుట రాజనీతికి విరుద్ధము. పారమార్థిక విషయములలో గురువు వద్దకు స్వయముగా వెళ్ళుట ధర్మము కాని, ఆర్థిక, రాజకీయ విషయములలో అట్లు వెళ్ళుట ధర్మము కాదు. ఇట్టి పరిస్థితులలో రాజుయైన దుర్యోధనుడు రాజనీతికి విరుద్ధముగా తాను స్వయముగా ద్రోణాచార్యునివద్దకు వెళ్ళుటకు కారణము తనకు కల్గిన అదృష్ట భయమే నని స్పష్టపడుచున్నది. పాండవులను, వారి సేనను చూడగానే వారిని జయింపలేము అని దుర్యోధనునకు భయము కల్గుట చేత ధైర్యము చెడి అట్లు గురువు గారి యొద్దకు వెళ్ళుటసంభవించినది అని ఊహించవచ్చును.

(అ) ఇంకను దుర్యోధనుడు ద్రోణాచార్యునితో పాండవ సేనలోని మహా వీరాగ్రేసరుల నందరిని విపులముగా వర్ణించుటలో వారందరు భీమార్జునులతో సమానులైన మహాశూరులు అని చెప్పి, తన సేనలోని వారలను అట్లు వర్ణించక సామాన్యముగా పేర్కొనినాడు. ఇట్టి వర్ణనకూడ దుర్యోధనుని భయమును సూచించుచున్నదని భావింప వచ్చును.

ఇ) ఇంకను పాండవసేనలలోని వారిని వర్ణించి తదుపరి తన సేనలోని నాయకులను వర్ణించుటలో "మదర్థేత్యక్త జీవితాః" అనగా నాకొరకు యుద్ధములో ప్రాణములను వదులుకొని వచ్చినారని యనుటలో వ్యక్తమైన అశ్లీల వాక్కు దుర్యోధనుని భయమును సూచించుచున్నది.

(ఈ) ఉభయసేనలను వర్ణించిన పిదప భీష్ముని చేత రక్షింపబడుచున్న కౌరవ సేనయొక్క బలము 'అపర్యాప్తం' అనిన్నీ, భీమునిచేత రక్షింపబడుచున్న పాండవుల సేనయొక్క బలము 'పర్యాప్తం అనిన్నీ, దుర్యోధనుడు అనుటలోకూడా ఒక విధముగా భయము సూచితమగుచున్నది. అది ఎట్లన పర్యాప్తము అనగా పరిమితమనిన్నీ, అపర్యాప్తము అనగా అపరిమితమనిన్ని అను అర్థములు ఆ రెండు శబ్దములకు యున్నను పర్యాప్తము అనగా చాలును యనిన్ని. ఆపర్యాప్తము అనగా చాలదు యనిన్ని అర్థములుకూడ ఆశబ్దములకు యుండుట చేత, కౌరవసేన పాండవసేనలను జయింపచాలదు అను అర్థముకూడా వచ్చుచున్నది గనుక దీనినిబట్టి కూడా దుర్యోధనుని భయము సూచితము.

(ఉ) మరియు సంజయుడు ధృతరాష్ట్రునికి ఉభయ సేనలను గురించి వర్ణించిన పిదప కౌరవులు శంఖములను పూరించినారనిన్ని ఆ పైన పాండవులు శంఖములను పూరించి నారనిన్ని వర్ణించుచూ, పాండవుల శంఖధ్వని "ధార్తరాష్ట్రాణాం హృదయానివ్యదారయత్" అనగా కౌరవుల గుండెలను పగలకొట్టినట్లుగా భయము కలుగచేసినదని

సంజయుడు వర్ణించుట చేతగూడా దుర్యోధనాదుల భయము వ్యక్తమైనది.

3. 'తు' అను శబ్దమునకు 3 వ అర్థము ఏమనగా:- ధృత రాష్ట్రుడు అనుకున్నట్లు అర్జునునికి దృష్టభయము కల్గలేదు గాని అదృష్టభయము కలిగినదని సూచించుటకు "తు" అను శబ్దప్రయోగము చేయబడెను. అదృష్టభయము అనగా పాపభయము. 'పుణ్య పాపములే అదృష్టములు అనగా దృష్టము కానివి. యుద్ధములో పూజ్యులైన భీష్మద్రోణాదులున్నూ బంధువులు అయిన మిగతావారున్ను, చనిపోవుదురనిన్నీ, అట్టివారి మృత్యువుకు తాను కారణభూతుడగు చున్నాడనిన్నీ, అందుచేత తనకు పాపము వచ్చుననిన్నీ, అర్జునునికి అదృష్ట భయము కల్గినది, ఈ అదృష్టభయమును పోగొట్టుకొనుటకు గాను అర్జునుడు కృష్ణపరమాత్మను ఆశ్రయించగా, కృష్ణుడు చేసిన భగవద్గీతా బోధచే 'అర్జునునికి కల్గిన అదృష్టభయము పోయి ధైర్యముతో యుద్ధము చేసెను. అని సంజయుడు ధృతరాష్ట్రునితో చెప్పెను. అర్జునునికి కల్గిన అదృష్టభయమును గురించియు, దానివలన కలిగిన విషాదమును గురించియు, ఆ విషాదము పోగొట్టుకొనుటకుగాను శ్రీకృష్ణుడు చేసిన గీతాబోధను గురించియు ముందు విపులముగా చెప్పబడును.

4. "తు" అను శబ్దమునకు నాల్గవ అర్థము :- ధృతరాష్ట్రుడు అనుకున్నట్లు పాండవులకు దృష్టభయము కల్గలేదు గాని ధర్మరాజుకు మాత్రము అధర్మభయము కలిగినదని సూచించుటకు ''తు'' శబ్దప్రయోగము చేయబడినది. అధర్మభయం యెట్లుకల్గినది. అనగా, గురువులైన భీష్మ ద్రోణాదులతో ధర్మరాజునకు యుద్ధము చేయవలసిన పరిస్థితి ఏర్పడుట చేత, అట్టి గురువుల అనుజ్ఞ లేనిదే యుద్ధము చేయుట అధర్మము కనుక, అట్టి అధర్మము సంప్రాప్తించునను భయము కల్గినది. అట్టి అధర్మ భయమును పోగొట్టు కొనుటకుగాను ధర్మరాజు కవచాదులను వదలి పాదచారియై సవినయముగా గురువులైన

భీష్మద్రోణాదుల వద్దకు వెళ్ళి వారికి సాష్టాంగ దండప్రణామము లాచరించి వారితో యుద్ధము చేయుటకు వారి అనుమతిని యివ్వవలసినదిగా ప్రార్థించెను. అంతట భీష్మద్రోణాదులు ధర్మరాజు యొక్క గురుభక్తికి యోగ్యతకు సంతోషించి, జయము కలుగునట్లు ధర్మరాజును ఆశీర్వదించిరి. ఇట్లు ధర్మరాజు తన అధర్మభయమును పోగొట్టుకొనెను, అను పై విషయమున్ను సూచితమగు చున్నది.

5 . పైన తెలియజేసిన ప్రకారం అర్జునునికి అదృష్ట భయమునుకల్గినను అర్జునుడు దానిని పోగొట్టుకొనగల్గినాడు, ధర్మరాజుకు కల్గిన అధర్మభయమును ధర్మరాజు పోగొట్టు కొనగలిగినాడు కాని దుర్యోధనునికి కలిగిన దృష్టభయమును మాత్రము దుర్యోధనుడు పోగొట్టుకొన లేక పోయెను. ఈ భావమును గూడా "తు" శబ్దప్రయోగము సూచించుచున్నది. ఇట్లు దుర్యోధనుడు తన గురువర్యులైన ద్రోణాచార్యులవద్దకు వెళ్ళి వారితో పాండవ సేనలోని వీరాగ్రేసరులను తన సేనలోని వీరాగ్రేసరులను వర్ణించుటలో వ్యక్తము చేసిన భయమును పోగొట్టి ధైర్యము కల్గించుటకై భీష్ముడు తన శంఖమును గట్టిగా పూరించి గొప్ప ప్రోత్సాహనాదమును గావించెను. అంతట కౌరవసేనలోని మిగతా యోధులున్ను తమతమ శంఖములను పూరించిరి. తదుపరి పాండవసేనలో ముఖ్యులైన కృష్ణుడు అర్జునుడు భీముడు మొదలగువారందరు తమతమ శంఖములను పూరించగా బయలు దేరిన ధ్వని భూనభోంతరాళము లంతయు వ్యాపించుటయేగాక కౌరవసేనలోని వారందరికి గుండెలు బ్రద్దలాయెనా యనునట్లుగా భయమును కల్గించెనని సంజయుడు ధృత రాష్ట్రునితో చెప్పెను.

ధృతరాష్ట్రుని ప్రశ్నలో పూర్వము వ్యక్తము చేయ బడిన (9) భావములలో మొదటి ఆరు భావములకు యింత వరకు సమాధానము విశదమైనది. 7 వ భావములో ధృతరాష్ట్రుడు చివరకైననూ కౌరవులకు జయము కల్గుటకు అవకాశము లేదా యను ఆశను వ్యక్తము

చేయుటచేత అందుకు సమాధానముగా సంజయుడు గీతలోని చివరశ్లోకమయిన

'యత్రయోగేశ్వరః కృష్ణో యత్రపార్థో ధనుర్ధరః ॥
తత్రశ్రీర్విజయోభూతిర్ధ్రువా నీతిర్మతిర్మమ ॥

అను శ్లోకమును చెప్పెను. దీని భావము ఏమనగా యోగేశ్వరుడు అయిన కృష్ణుడున్ను ధనుర్ధారియైన అర్జునుడున్ను యున్న పక్షమునకే, అనగా పాండవ పక్షమునకే జయము కల్గును అని సంజయుడు చెప్పుట చేత, కౌరవులకు జయము కల్గదు అని సూచించెను. దీనివలన ధృతరాష్ట్రునికి యున్న ఆ ఆశ కూడా నిరాశ అయ్యేను.

'ధర్మక్షేత్రే కురుక్షేత్రే' అను శ్లోకమునకు పూర్వము చెప్పబడిన 9 అర్థములలో 8, 9 అర్థములు రెండును చరిత్రాత్మక మైన భావముకు సంబంధించినవి గాక ఆధ్యాత్మికమైన భావముకు సంబంధించినవి యగుట చేత ఆ రెంటికిని ఆధ్యాత్మికముగానే సమాధానము చెప్పుకొనవలసియున్నది. ఆ రెంటిలోని భావము అజ్ఞానియైన జీవుడు తరించుటకు కావలసిన సాధనములకు సంబంధించినదియై యున్నది. ఆ 8, 9 భావములకు సమాధాన మేమనగా ః- జ్ఞాననేత్రము లేక దేహమే తాను అనుకొను దేహాభిమానముకల శిష్యుడు జ్ఞానియైన గురువును తరణోపాయము చెప్పమని అడుగుట యే 'ధర్మక్షేత్రే' అను శ్లోకముయొక్క సారమగుటచేత దానికిన్నీ సమాధానమును సంజయుడు చివర శ్లోకము అయిన 'యత్ర యోగేశ్వరః" అను శ్లోకము ద్వారా వ్యక్తము చేసినట్లు భావించవచ్చును. అది ఎట్లు అనగా, ఆధ్యాత్మికార్థము చెప్పుకొన్నప్పుడు 'కృష్ణుడు' అను శబ్దమునకు అర్థము దేవుడనిన్నీ, అర్జునుడను శబ్దమునకు అర్థము జీవుడు అనిన్నీ గ్రహించవలసియున్నది. ఏల అనగా, వారిద్దరు నరనారాయణులని స్పష్టమేగదా. అజ్ఞానియైన జీవుని అంతఃకరణలో మంచిగుణములకు. చెడ్డగుణములకు నిత్యము జరుగు పోట్లాటయే కురుక్షేత్ర యుద్ధముకు

ఆధ్యాత్మికార్థము, అట్టి పోట్లాటలో చెడ్డగుణముల నణిచివేసి మంచిగుణముల ద్వారా ధర్మమను పంటను జ్ఞానమను పంటను జీవుడు సంపాదించు కొని తరించుటకు కావలసిన సాధనములను, ఆ సాధనములను అభ్యసించుటవల్ల వచ్చే ప్రయోజనములను యీ చివర శ్లోకములో సంజయుడు వ్యక్తము చేసినాడు. ధనుర్ధారి అయిన పార్థుడు అనుటవల్ల పార్థుడు క్షత్రియుడు కనుకను, క్షత్రియునకు యుద్ధము స్వధర్మము కనుకను ధనుస్సును ధరించిన అర్జునుడు అంటే స్వధర్మమైన యుద్ధము చేయుటకు సిద్ధముగానున్న అర్జునుడని అర్థము, అర్జునుడు అనగా జీవుడు అని అర్థము కనుక , ధనుర్ధారియైన అర్జునుడు అంటే స్వధర్మమును నిష్కామంగా ఫలాపేక్ష లేకుండా చేయుటకు సిద్ధముగానున్న జీవుడు అని అర్థము. అట్టి జీవుడు యోగీశ్వరుడు అయిన కృష్ణుని సేవించుట అంటే, యోగాభ్యాసము ద్వారా, భక్తి ద్వారా భగవంతుని సేవించుట అని అర్థము.

'ప్రణవోధనుశ్శరో హ్యా త్మాబ్రహ్మ తల్ల క్ష్యముచ్య తే
అప్రమత్తేన వేద్ధవ్యః శరవ త్తన్మయోభ వేత్

అను మంత్రముకు ప్రణవమే ధనస్సుఅనిన్నీ, జీవాత్మ బాణమనిన్నీ, బ్రహ్మ లక్ష్యమనిన్నీ, ఎట్టి పొరబాటు లేకుండా గురి తప్పకుండా బాణము వేసిన యెడల ఆ బాణము లక్ష్యముతో ఏకమగును. అంటే, జీవాత్మ బ్రహ్మతో ఐక్యమును చెందును అనిన్నీ అర్థము కనుక, యీ మంత్రార్థమును యీ శ్లోకములోని 'ధనుర్ధరః పార్థః' అను శబ్దప్రయోగము ద్వారా ఈ శ్లోకములోనికి అనుసంధానము చేసికొనవలసియున్నది. అట్లు చేసినచో తేలిన పర్యవసాన మేమనగా జీవుడు నిష్కామముగా స్వధర్మానుష్ఠానమును, యోగాభ్యాసమును, భక్తిని చేస్తూ, ప్రణవోపాసనమును, శ్రవణ మనన ధ్యానములను జ్ఞాన యోగమును అవలంబించితే నీతి, భూతి, విజయము, శ్రీ అను నాలుగు ప్రయోజనములు క్రమముగా కలిగి ఆ జీవుడు తరించునని అర్థము.

నీతి అనగా లోకములో అందరితోను మంచిగా నుండుట. భూతి అనగా భగవదనుగ్రహమునకు పాత్రు డగుట. విజయము అనగా ఇంద్రియ జయము, మనో జయము, అవిద్యాజయము. శ్రీ అనగా మోక్షలక్ష్మీ, ఇట్లు గీతలో చివరిశ్లోకములో జీవుడు తరించుటకు అవసరమైన సాధనములున్ను దానివల్ల క్రమేణావచ్చే ప్రయోజనములున్ను చివరికి మోక్షఫలమున్ను వర్ణించబడినవని ఈశ్లోకమునకు ఆధ్యాత్మికార్థము. ఇట్టి ఆధ్యాత్మికార్థము వచ్చు లాగును ఆ శ్లోకమును మార్చినచో ఆ శ్లోకరూప మిట్లుండును. 'యత్ర యోగేశ్వరో దేవః, యత్రజీవ స్స్వధర్మకృత్ – తత్రశ్రీ ర్విజయో భూతిర్ధ్రువా నీతిశ్చ శాశ్వతీ,'

ఇంకను గీతలోని మొదటి శ్లోకమునకు ఆధ్యాత్మికార్థమును చెప్పుకొని ఆ శ్లోకములోని ప్రశ్న తరణోపాయములకు సంబంధించిన ప్రశ్న అని అర్థము. చేసుకొనినప్పుడు, గీతలోని 18 అధ్యాయములున్ను 18 మోక్ష సాధనములను బోధించుచున్నవి అని ఆ ప్రశ్నకు సమాధానము చెప్పుకొనవచ్చును. అర్జునవిషాదయోగము, సాంఖ్య యోగము, కర్మ యోగము అని ఈ విధముగా ప్రతి అధ్యాయము ఒక్కొక్క యోగమును బోధించుచున్నది, యోగము అనగా కలుపునది అనగా జీవాత్మను పరమాత్మతో ఐక్యము పొందించుటకు సాధనము అని అర్థము. కనుక 18 అధ్యాయములున్ను 18 మోక్షసాధనములను బోధించు చున్నవి అని స్పష్టము.ఇదియే సంజయుని సమాధానము.

ఏడవ కిరణము

అర్జున విషాదము

(గీత-1వ అధ్యాయము)

భగవద్గీతలోని అర్జున విషాదయోగము అను మొదటి అధ్యాయము లోని 47 శ్లోకములును, 'సాంఖ్య యోగము' అను రెండవ అధ్యాయములోని 'మొదటి 10 శ్లోకములున్ను కలసి 57 శ్లోకములున్ను అర్జునుని విషాద యోగమునకు చెందినవే అనిన్ని, ఆ 57 శ్లోకములున్ను విషయవారీగా విమర్శించినచో 6 భాగములుగా తేలుననిన్ని లోగడ మనము తెలిసికొన్నాము. ఆ 6 భాగములలో మొదటిది అయిన ధృతరాష్ట్రుని ప్రశ్నయును దానికి సంజయుని ప్రత్యుత్తరమున్ను విపులముగా లోగడ విశదీకరించబడినది. సంజయుడు ఉభయసేనలను, ఆ ఉభయసేనలవారు గావించిన శంఖారవము లను వర్ణించిన తరువాత అర్జునుడు తనరథమును ఉభయ సేనల మధ్య భాగమునకు తీసుకొని వెళ్ళవలసినదిగా తన రథసారథి యైన కృష్ణుని కోరినాడనిన్ని , కృష్ణుడు అర్జునుని రెండు సేనల మధ్యకు తీసుకొని వెళ్ళి భీష్మ ద్రోణాదుల ఎదుట నిలువగా అర్జునుడు భీష్మద్రోణాదులను, గురువులను, ఇతరులైన బంధువులను సమీక్ష చేసినాడనిన్ని సంజయుడు - తెలియ పరచినాడు

ఉభయ సేనలలోనున్న గురువులను, బంధువులను అర్జునుడు సమీక్ష చేయగానే అర్జునునికి ఉత్కృష్టమైన కృప కలిగి యుద్ధములో వీరందరు చనిపోవుదురే అని విషాదము కలిగినది. ఇట్టి కృప, విషాదము అర్జునునికి సహజము కాద నిన్నీ ఆగంతుకమే అనిన్నీ భగవద్గీత అను ఉత్కృష్టమైన మోక్షగ్రంథమును కృష్ణుడు లోకమునకు అందింపచేయ దలచి అర్జునునికి యిట్టి కృపావిషాదములను కలుగచేసి అతనిని శిష్యునిగా చేసికొని అతనిద్వారా గీతను అవతరింప చేసి నాడనిన్నీ లోగడ గీతావతరణము అను శీర్షిక క్రింద మనము తెలుసుకొన్నాము.

ఇపుడు అర్జునునికి కలిగిన విషాదము గురించి విచారణ చేసిన చో అర్జునుడు తన విషాదములో 8 రకములైన భావములను వ్యక్తము చేసినట్లు కనబడును. అవి ఏవి అనగా 1. మమత్వ ప్రకటన (1 అధ్యాయంలోని 28 నుంచి 31 శ్లోకము ఆఖరువర్కు.)

2. వైరాగ్య ప్రకటన (1 అధ్యాయంలోని 32నుంచి 35 శ్లోకము ఆఖరువర్కు)

3. పాపభీతి ప్రకటన (1 అధ్యాయంలోని 36 నుంచి 39 శ్లోకము ఆఖరువర్కు, 45, 46 శ్లోకములు)

4. వర్ణసంకరత్వభావ ప్రకటన (1 అధ్యాయంలోని 40 నుంచి 44 శ్లోకము ఆఖరువర్కు)

5. స్వధర్మ త్యాగపూర్వక పరధర్మవాంఛ ప్రకటన (2వ అధ్యాయంలో 4, 5 శ్లోకములు)

6. జయసందేహప్రకటన (2వ అధ్యాయంలో 6వ శ్లోకము)

7. మూఢత్వ ప్రకటన (2వ అధ్యాయంలో 7వశ్లోకము లోని మొదటి భాగం)

8. ముముక్షుత్వ ప్రకటన (2వ అధ్యాయంలో 7వ శ్లోకంలోని 2వ భాగం) ,

1. మమత్వ ప్రకటన :-

అర్జునుడు ఉభయసేనలలోని బంధువులను చూడగనే వారందరు కేవలం నాస్వజనమే వీరందరిని యుద్ధములో చంపితే నాకేమి శ్రేయస్సు కలుగును. ఛీ, యింతటి ఘోరమైన కార్యముకు పూనుకొనుటా, అను ఉత్కృష్టమైన కృపతో కూడుకొన్న వాడై దీనుడైనాడు. ఇట్టి దీనస్థితికి కారణము వీరందరు నావారు అను మమత్వమేకదా. ఈ మమత్వానికి పూర్వరంగంలో దేహమే నేను అను

అహమధ్యాస ఉన్నది. అధ్యాస అనగా ఒక వస్తువును యింకొక వస్తువుగా భావించుట. తాడును చూచి పాము అనుకొనుట' అధ్యాస. అటులనే దేహములో తాను ఉంటూ తానుకాని దేహమును తాను అను అహమధ్యాస పుట్టిన తరువాత, ఆ దేహానికి సంబంధించిన వారందరియందు వీరందరు నావారు అను మమాధ్యాస కల్గును. యీ విధముగా కలిగి మమత్వానికి దానికి మూలమైన అహమధ్యాసకు కారణం అజ్ఞానమేకదా! ఇట్టి మమత్వ ప్రకటనమును అర్జునుడు గావించినాడు.

2. వైరాగ్య ప్రకటన

ఇట్టి మమత్వం చేత అర్జునుడు. దీనుడై నాకు యుద్ధములో జయమక్కర లేదు. నాకు రాజ్య మక్కరలేదు, నాకీ ఐహిక సుఖము లక్కరలేదు, నాకు ముల్లోకాధిపత్య మందు కూడా వాంఛ లేదు, అని ఐహిక భోగములందును, ఆముష్మిక భోగములందును కూడా వైరాగ్యమును కనపర్చినాడు.

3. పాపభీతి ప్రకటన.

ఇట్లు వైరాగ్యమును వ్యక్తము చేసిన తరువాత యీ దుర్యోధనాదు లందరు ఆతతాయులు అనగా ఘోరకృత్యములు చేసిన దుర్మార్గులే అయిననూ, వీరి నందరిని చంపితే చంపిన పాపమున్ను కులక్షయమవుతుంది. కనుక అట్టి పాపమున్ను , మిత్రదోహమగును. కనుక అట్టి పాపము వచ్చునని చెప్పి ఆ దుర్యోధనాధులు లోభాదులచేత అట్టి పాపభీతిని పొందక పోయినను అన్ని తెలిసిన మేము ఎలా యిట్టి పాపా చరణకు దిగు తాము అనిన్ని స్వజనమైన వారి నందరిని చంపితే మాకు ఏమి సుఖం కలుగుతుంది అనిన్ని అహో, యీరాజ్య సుఖాలకోసము ఎంతటి ఘోరమైన పాపము చేయటానికి సిద్ధపడినాము అనిన్ని యీవిధముగా పాపభీతిని అర్జునుడు వ్యక్తము చేసినాడు.

4. వర్ణ సంకరత్వభీతి ప్రకటన.

ఇంకను యుద్ధంవల్ల కులక్షయం, కులక్షయమువల్ల సనాతన ధర్మమునకు హానీ. అధర్మాభివృద్ధి, స్త్రీలు చెడుట, వర్ణ సంకరత్వము కూడ వస్తుందని అర్జునుడు విలపించినాడు. ఇట్టి సాంకర్యమువల్ల నరకప్రాప్తి మున్నగు దోషాలు వచ్చుననిన్ని ఇట్లు వర్ణ సంకరత్వభీతిని వ్యక్తం చేసినాడు.

5. స్వధర్మ త్యాగపూర్వక పరధర్మ వాంఛా ప్రకటన.

ఇంతేగాక క్షత్రియుడైన తనకు యుద్ధకర్మస్వధర్మమే అయ్యుండగా, అట్టి స్వధర్మము నందు విముఖత కలిగి, 'యుద్ధము చేయను' అని స్వధర్మ త్యాగబుద్ధిని వ్యక్తము చేయుటే కాక , పరధర్మమైన భిక్షాటనమునందు వాంఛను కూడ అర్జునుడు కనపర్చినాడు. భిక్షాటనము చేత జీవించుట – బ్రాహ్మణజాతికి ధర్మము కాని, బాహ్మణేతరులకు ధర్మము కాదు. ఇట్లు అర్జునుడు స్వధర్మమునందు వైముఖ్యమును, పర ధర్మము నందు వాంఛను వ్యక్తంచేసినాడు.

6. జయసందేహ ప్రకటన. .

అర్జునుని మనస్సులో ఇంకొకరకమైన భావముకూడ కల్గినది. పోనీ, యుద్ధం చేస్తామనుకో: ఈ యుద్ధంలో మనమే గెలుస్తామో, కౌరవులే గెలుస్తారో ఏమి 'చెప్పగలము ? మనమే తప్పక గెలుస్తాము అను నిశ్చయం లేదుకదా.. ఇట్టి సందేహాస్పదమైన విషయములో యుద్ధములో పాల్గొనుటెందుకు ? అని జయసందేహాన్ని కనపర్చినాడు.

7. మూఢత్వ ప్రకటన

ఈ విధముగ అర్జునుని మనస్సులో అనేకరకములైన భావములు కలుగగా కృష్ణునితో "కృష్ణా ! నా బుద్ధిని మోహము ఆవరించినది. నేను ధర్మమేదో, అధర్మమేదో తెలుసుకోలేని మూఢుణ్ణి అయిపోయినాను" అని తన మూఢత్వాన్ని వ్యక్తం చేసినాడు.

8. ముముక్షుత్వ ప్రకటన,

ఇట్లు ధర్మసమ్మూఢత్వమును ప్రకటన చేసిన తర్వాత ఏమి చేయవ లెనో తోచక, అర్జునుడు కృష్ణుని పాదాలమీద పడి, "కృష్ణా "నేను నిన్ను 'ప్రపత్తితో' వేడుకొనుచున్నాను. నీవే నాకు గురువువు. నన్ను దయతో శిష్యునిగా గ్రహించి, నా కేది శ్రేయోదాయకమో అట్టిది నాకు బోధించుము" అని తన ముముక్షుత్వమును వెల్లడి చేసినాడు.

అర్జునుని విషాదమును పరిశీలించినచో పై ఎనిమిది భావములు స్పష్టముగా వ్యక్తమగుచున్నవి.

ఎనిమిదవ కిరణము

అర్జునుడు బ్రహ్మవిద్యకు అధికారియేనా?

(గీత - 1వ అధ్యాయము)

అర్జునుడు తనవిషాదములో వ్యక్తము చేసిన 8భావములను విమర్శించి చూచిన యెడల వానిలో 2వది అయిన వైరాగ్యమున్ను, 8వది అయిన ముముక్షుత్వమున్ను మాత్రమే శాస్త్రీయమైనవనిన్నీ, మిగతా 6 శాస్త్ర విరుద్ధమనిన్నీ - గోచరించును. ఈ వైరాగ్యము, ముముక్షుత్వము, సాధన చతుష్టయ సంపత్తిలో చేరినవై యున్నవి. బ్రహ్మ విద్యకు అధికారి, నిరూపణము చేయుటలో శాస్త్రము సాధన, చతుష్టయ సంపత్తికలవాడే అధికారి అని వక్కాణించినది కదా. ఇప్పుడు అర్జునునికి కల్గిన విషాదమునకు హేతువు శరీరమే. ఆత్మ అను అజ్ఞానము, యుద్ధములో చనిపోవునది శరీరములుకాని ఆత్మకాదు. శరీరము చనిపోతే శరీరంలో ఉన్న ఆత్మకూడ చనిపోతుంది అను అజ్ఞానంవల్ల అర్జునునికి విషాదము కల్గినది. ఇట్టి అజ్ఞానమును పోగొట్టుటకు ఆత్మవిద్య లేక బ్రహ్మవిద్యనే బోధించవలెను. ఇట్టి బ్రహ్మ విద్యను అధికారియైన వానికే బోధించవలెను. అధికారి కాని వానికి బోధించ కూడదుకదా. కాని కృష్ణ పరమాత్మ అర్జునునికి 2వ అధ్యాయములో 11వ శ్లోకమునుంచి ప్రారంభించి బ్రహ్మవిద్యను బోధించి నాడు. కృష్ణ పరమాత్మ అంతటివాడు అధికారం లేనివానికి బోధింపడు కనుకను, ఇప్పుడు అర్జునునికి బోధించినాడు కనుకను, అర్జునుడు అధికారి అయి ఉండవలెను అని తేలుచున్నది. అర్జునుడు బ్రహ్మవిద్యకు అధికారియే అనుటకు ఇదియొక హేతువు.

ఇదికాక అర్జునునికి సాధన చతుష్టయసంపత్తి ఉన్నట్లు అర్జునుడు విషాదంలో వ్యక్తంచేసిన వైరాగ్య ముముక్షుత్వములవల్ల కూడ మనము నిశ్చయించవచ్చును.

సాధన చతుష్టయసంపత్తి అనగా (1) నిత్యానిత్య వస్తువివేకము. (2) ఇహాముత్రార్థ ఫలభోగవిరాగము, (3) శమదమాది షట్క–సంపత్తి, (4) ముముక్షుత్వము అను నాలుగు అయ్యున్నవి.

1. నిత్యానిత్య వస్తువివేకము : – అనగా నిత్యమైనదేది, అనిత్యమైనదేది అను విచారణమీద తేలిన విజ్ఞానము లేక వివేకము. అట్టి విచారణమీద ప్రపంచములోని దంతయు ప్రతినిత్యము మారుచున్నది కనుక అనిత్యమైనదే, బ్రహ్మ వస్తువు ఒక్క టే ఎప్పుడు ఎట్టి మార్పులేకుండా నిత్యమైనది అని తేలును. ఇట్లు బ్రహ్మము ఒక్కటిమాత్రమే నిత్యమైనదనిన్నీ, ప్రపంచమంతయు అనిత్య మైనదనిన్నీ అను వివేకము మొదటి సాధనము.

2. ఇహాముత్రార్థ ఫలభోగవిరాగము :– అనగా ఇహలోక భోగము లందును, పరలోక భోగములు అనగా స్వర్గాదిలోక భోగములందును పూర్తియైన వైరాగ్యము.

3. శమదమాది షట్క సంపత్తి : – (1) శమము అనగా అంతరింద్రియ నిగ్రహము, (2) దమము అనగా బహిరింద్రియ నిగ్రహము (3) తితీక్ష అనగా శీతోష్ణాది ద్వంద్వములను సహించుట. (4) ఉపరతి అనగా ప్రపంచవిషయములందు మనసును పోనివ్వకుండుట లేక సన్యాసము. (5) శ్రద్ధ అనగా ఉపనిషద్వాక్యములందును గురువాక్యము లందు విశ్వాసము. (6) సమాధానము అనగా మనసులో ఎట్టి ఉద్వేగములేని ప్రశాంత స్థితి. ఈ ఆరు కలసి షట్కసంపత్తి.

4. ముముక్షుత్వము :– అనగా ఈ సంసార బంధములో నుంచి బయటపడవలెను అను తీవ్రమైన వాంఛ.

ఈ నాలుగింటిలోనూ మొదటి రెండును అనగా వివేక వైరాగ్యములు బాహ్యప్రపంచము వల్ల కలుగు విక్షేపములను

నివారించును, మిగతా రెండును అనగా షట్క సంపత్తి ముముక్షుత్వములు అంతఃకరణలోని విక్షేపములను నివారించును. వివేకము కల్గినందుకు ఫలము వైరాగ్యమే కనుక, వైరాగ్యము ఉన్నదంటే వివేకము ఉన్నట్లే, షట్క సంపత్తికి ఫలము ముముక్షుత్వమే కనుక ముముక్షుత్వము ఉన్నదంటే షట్క సంపత్తి ఉన్నట్లే. అర్జునుడు తన విషాదములో వైరాగ్యమును ముముక్షుత్వమును వ్యక్తము చేసినాడు కనుక మిగతా రెండును ఉన్నట్లే. కనుక అర్జునునికి సాధన - చతుష్టయసంపత్తి ఉన్నదని తెలినది.

ఇంకను బ్రహ్మవిద్యకు అధికారులు : (1) ఉత్తమాధికారులు (2) మధ్యమాధికారులు (3) అధమాధికారులు అని 3 రకాలుగా ఉన్నారు. తాత్కాలికంగా నైననూ వివేకవైరాగ్యాదులు కలవారు అధమాధికారులు. అంత కంటె ధృడంగా కలవారు మధ్యమాధికారులు, వివేకాదులను సంపూర్తిగా కలవారు ఉత్తమాధికారులు. అధమాధికారులు గురువుయొద్ద బ్రహ్మవిద్యను శ్రవణముచేసి, అభ్యసించినచో మధ్యమాధికారులయి, క్రమేణా ఉత్తమాధి కారులుకూడ అగుదురు, మధ్యమాధికారులు బ్రహ్మవిద్యను శ్రవణంచేసి అభ్యసించినచో ఉత్తమాధికారులగుదురు. ఉత్తమాధికారులు శ్రవణము చేసి అభ్యసించినచో వెంటనే ముక్తులగుదురు. అర్జునుని చరిత్రనుబట్టి అర్జునుడు ఉత్తమాధికారి యగునా కాదా అను విషయమై ఒక వేళ ఎవరికైనా సంశయము కల్గినను, మధ్యమాధికారియో లేక అధమాది కారియో అయి తీరును అను విషయమై ఎవరికినీ సంశయ ముండనేరదు. అందుకనే శ్రీ శంకర భగవత్పాదులవారు తమ భాష్యములో అర్జునం నిమిత్తీకృత్య ఆహ భగవాన్ అశోచ్యానితి, అని వాక్రుచ్చినారు. శ్రీకృష్ణార్జునులు నరనారాయణావతారులని శాస్త్రము చెప్పుచున్నది. కనుక అర్జునుడు నరావతార మని స్పష్టమగుచున్నది. కనుక అర్జునుని చరిత్రలో అర్జునుడు ఉత్తమాధికారి అనుటకు విరుద్ధములగు అంశములు కనబడినను, అవి నృవిడంబములని సమన్వయము చేసుకో వచ్చును. కనుక అర్జునుడు బ్రహ్మవిద్యకు అధికారియే అని నిశ్చయించవచ్చును.

తొమ్మిదవ కిరణము
కృష్ణునిబోధ యొక్క స్వరూపము
(గీత-2 వ అధ్యాయము)

అర్జునుడు తన విషాదముల వ్యక్త్యముచేసిన 8 భావములలో వైరాగ్య ముముక్షుత్వములను రెండు శాస్త్రీయ భావములను ఆధారము చేసుకొని అర్జునుడు బ్రహ్మవిద్యకు అధికారియే అని మనము నిశ్చయించుకున్నాము. ఆలాగైతే అట్టి అర్జునునికి కృష్ణుడు చేసిన బోధ స్వరూపమేమి ? అను విషయము విచారింప తగియున్నది. అర్జునుని విషాదమును పోగొట్టుటకుగాను కృష్ణునిబోధ అవసరమైనది కనుక విషాదమను రోగముయొక్క నిదానమును బట్టి బోధ అను చికిత్స యొక్క స్వరూపము తేలును. అర్జునుని విషాదమునకు హేతువులు రెండుగా గోచరించుచున్నవి.

1. ఆత్మ కాని దేహమును ఆత్మఅని అనుకోగానే దేహము చనిపోతే ఆత్మయే చనిపోవునని అర్జునుడు దుఃఖించినాడు. కనుక యీ విషాదమునకు మొదటి హేతువు దేహాత్మ భ్రాంతి. ఇది సర్వసాధారణ మోహము. ఇట్టి మోహము వల్లనే 'వీరందరు నా స్వజనమే' అను మమాధ్యాస, మమత్వము కలిగి వీరందరు చనిపోవుదురనే విషాదము కల్గినది. అర్జునుడు తన విషాదములో వ్యక్తం చేసిన 8 భావములలో మొదటిదైన మమత్వము 7వదైన మూఢత్వము యీ మోహముయొక్క ఫలితములే. దానికి చికిత్స దేహము వేరు ఆత్మ వేరు అను ఆత్మతత్వబోధ యే. ఇదియే సాంఖ్య యోగ బోధ.

2. ఇంకను అర్జునునికి కలిగిన మిగతా 3, 4, 5, 6 భావములను, అనగా పాపభీతి. వర్ణసంకరత్వము, స్వధర్మ త్యాగపూర్వక

పరధర్మ వాంఛ, జయసందేహము అను నాల్గింటిని విమర్శించి పరిశీలించినచో వీనికి హేతువు స్వధర్మానుష్ఠానము యొక్క స్వరూపము మహాత్మ్యము తెలియకపోవుట అని తేలును. ఇది అర్జునునికి కలిగిన, విశేష మోహము, ఈ విశేష మోహమువల్ల స్వధర్మమైన యుద్ధము అధర్మమని, పరధర్మమైన భిక్షాటనము ఉత్తమధర్మమని, అర్జునుడు భావించినాడు. ఇంకను వీరి అందరిని చంపితే పాపము వస్తుంది అని వర్ణసంకరమవుతుందని విలపించినాడు. మరియు యుద్ధములో మనమే గెలుస్తామో, కౌరవులే గెలుస్తారో అను జయ సందేహమును కూడా వ్యక్తము చేసినాడు. ఇది అర్జునుని విషాదమునకు 2వ హేతువు. . దీనికి చికిత్స ఫలాపేక్ష లేకుండా నిష్కామంగా స్వధర్మానుష్ఠానమును చేయవలెను అను బోధ. ఇదియే నిష్కామకర్మయోగ బోధ.

మొదటిదైన ఆత్మతత్త్వబోధవల్ల ప్రతిజీవుని శరీరములోను ఉన్న ఆత్మ నిత్యమైనది, ఏకమైనది, నిర్వికారమైనది, నిష్కామమైనది, సర్వవ్యాపకమైనది, నిరవయవమైనది, సచ్చిదానంద అనంత స్వరూపమైనది అని తేలుట వల్లే ఆత్మ చచ్చిపోతుంది అను అజ్ఞానము నశించి, దానినల్ల కలిగిన విషాదము పోవును. రెండవదియైన ఫలా పేక్షలేని స్వధర్మానుష్ఠానబోధయను నిష్కామకర్మయోగ బోధవల్ల అర్జునుడు తనకు స్వధర్మమైన యుద్ధమును ఫలాపేక్ష లేకుండా చేయవలెను అని తేలును కనుక యుద్ధమువల్ల వారందరిని చంపిన పాప ఫలము వర్ణసంకరత్వఫలము కల్గును అను భావములు మనమే గెలుస్తామో కౌరవులే గెలుస్తారో అను జయసందేహము పరధర్మమైన భిక్షాటనమందు వాంఛ, యివి అన్నియు పోయి దీనివల్ల కలిగిన విషాదము పోవును. ఇట్లు అర్జునునికి విషాదమును కలిగించిన రెండు కారణములు ఆ రెండురకములు అయిన బోధలవల్ల నశించగా, అర్జునుని విషాదము పోయి అర్జునుడు ధైర్యోత్సాహములతో తన స్వధర్మమైన యుద్ధము చేయుటకు అవకాశము కల్గును. కనుక కృష్ణుని బోధ యొక్క స్వరూపము ద్వివిధము.

1. ఆత్మతత్త్వబోధ లేక జ్ఞాన యోగబోధ.

2. నిష్కామకర్మబోధ లేక కర్మయోగ బోధ, అనగా జ్ఞాన నిష్ఠ, కర్మనిష్ఠ అను నిష్ఠాద్వయముతో కూడిన బోధ. ఈ విషయము నే కృష్ణపరమాత్మ భగవద్గీత 3వ అధ్యాయములోని 3వ శ్లోకములో

'లో కేస్మిన్' ద్వివిధా నిష్ఠాపురాప్రోక్తా మయానఘ ।
జ్ఞాన యోగేన సాంఖ్యానాం కర్మయోగేన యోగినాం ॥"

అని స్పష్టము చేసినాడు. నిష్ఠాద్వయముతో కూడిన బోధ అనుటవల్ల జ్ఞానబోధ, కర్మబోధ అనునవి రెండును పరస్పర సంబంధము లేని ప్రత్యేకబోధలు కావనిన్ని, రెండు నిష్ఠలతోకూడిన బోధ ఒకటే అనిన్ని తేలుటవల్ల కర్మయోగము, జ్ఞాన యోగమునకు సాధనమనిన్ని, జ్ఞానయోగము కర్మయోగమువల్ల సాధ్యమనిన్ని ఆ రెంటికి సాధ్యసాధన సంబంధము ఉన్నదనిన్ని స్పష్టమగుచున్నది. 'యచ్ఛ్రేయ స్స్యాన్నిశ్చితం, బ్రూహి తన్మే శిష్యస్తేహం శాధి మాం త్వాం ప్రపన్నం' అని అర్జునుడు 2వ అధ్యాయం 7వ శ్లోకము చివరి భాగములో కృష్ణుని అర్థించినది శ్రేయస్సు, శ్రేయస్సు అనగా కఠోపనిషత్తులో విశదీకరింపబడిన ప్రకారము పరమ పురుషార్థమైన మోక్షమే, అట్టి మోక్షము 'తరతీ శోక మాత్మవిత్' అను ఉపనిషత్ ప్రమాణమును బట్టి ఆత్మ జ్ఞానమువల్లనే కల్గును. అట్టి ఆత్మజ్ఞానము అంతఃకరణము సంస్కృతమై పరిశుద్ధమైతేనే కలుగును. అట్టి అంతఃకరణ శుద్ధి కర్మయోగమువల్లనే కల్గును. కనుక కర్మయోగము సాధనము 'జ్ఞాన యోగము సాధ్యము. జ్ఞానమువల్ల మోక్షము జ్ఞానాదేవహికైవల్యం' అనిగదా ప్రమాణము.

ఇట్టి ఆత్మజ్ఞాన బోధను కృష్ణ పరమాత్మ భగవద్గీతలో 2వ అధ్యాయములో 'సాంఖ్య యోగము' అను పేరుతో విశదీకరించినాడు 'సాంఖ్య యోగము' అనగా 'సమ్యక్ ఖ్యాయతే అనేన ఆత్మతత్త్వం ఇతి సాంఖ్యం' అను నిర్వచన ప్రకారం దేనిలో ఆత్మతత్త్వము బాగుగా నిరూపించబడినదో అది సాంఖ్యయోగము అని స్పష్టమగుచున్నది.

కనుక అర్జునుని విషాదమును పోగొట్టుటకు కృష్ణ పరమాత్మ ఆత్మతత్త్వజ్ఞాన బోధను సాంఖ్యయోగము అను పేరుతో గీతలో 2వ, అధ్యాయములో విశదీకరించి, అందుకు సాధనమైన కర్మయోగ బోధను 3వ అధ్యాయములో కర్మయోగము అను పేరుతో విశదీకరించినాడు. కనుక కృష్ణుని బోధ అంతయు గీతలోని 2, 3 అధ్యాయములలోనే నిరూపించబడినది. మిగతా అధ్యాయములన్నియు ఈ 2, 3 అధ్యాయములలోని బోధయొక్క వివరణ రూపములే అని తెలిసికొనవలసి యున్నది.

ఇంకను బాగా విమర్శించినచో, నిష్ఠాద్వయరూప బోధ అంతయు ఒక్క రెండవ అధ్యాయములోనే విశదీకరింపబడినదని తేలును. 2వ అధ్యాయములో 11వ శ్లోకము మొదలు 36వ శ్లోకమువరకు ఆత్మతత్త్వభోధము, అట్టి ఆత్మ జ్ఞానులయొక్క లక్షణములు 54 మొదలు 72 వరకును విశదీక రింపబడి అట్టి ఆత్మజ్ఞానమునకు సాధనమగు కర్మయోగ బోధ 39 మొదలు 53 వరకుగల శ్లోకములలో స్పష్టీకరింపబడినది. దానియొక్క వ్యాఖ్యానరూపమే 3వ అధ్యాయము. అందుకనే కృష్ణ పరమాత్మ 3వ అధ్యాయం 3వ శ్లోకంలో 'లో కేస్మిన్ ద్వివిధానిష్ఠా పురాప్రోక్తా' అని చెప్పినాడు. అందుచేత ఈ నిష్ఠాద్వయరూపమైన బోధ అనగా జ్ఞానయోగము, కర్మయోగము అనుబోధ పురాప్రోక్తా లోగడనే చెప్పబడినది. అనగా రెండవ అధ్యాయములోనే చెప్పబడినది అని కృష్ణుడు స్పష్టీకరించినాడు. కనుక భగవద్గీత అంతకు సారము 2 వ అధ్యాయము. దీనికి మిగతా అధ్యాయములు వ్యాఖ్యానరూపములు. ఇది యే కృష్ణుని బోధ యొక్క స్వరూపము.

పదియవ కిరణము

కృష్ణనిబోధ - సాంఖ్యయోగ సారము

(గీత-2వ అధ్యాయము)

అర్జునుడు విషాదముతో మూఢుడై పోయి విల్లును బాణములను పారవేసి మూర్ఛవచ్చినట్లుగా పడిపోగా, అతనికి అట్టి స్థితిలో కృష్ణుడు బోధ చేయుట సాధ్యము కాకపోయినది. అతను లేచి కూర్చుని మామూలు స్థితిలోనికి వచ్చుటకు గాను కృష్ణుడు గీత 2వ అధ్యాయములోని. 2, 3 శ్లోకములతో ఒక ఘాటైన ఇన్‌జక్షన్ ఇచ్చినాడు 'అర్జునా ! నీవు పూర్వము బృహన్నల వేషం వేసినపుడు నపుంసకునివలె నటించినావు కాని నపుంసకుడివి కాలేదే ? ఇపుడు కేవలం నపుంసకుడివి అయిపోయినావేమి ? యుద్ధం ప్రారంభం కాబోయే ఇట్టి విషమపరిస్థితిలోనా నీకీ చచ్చుతనం ? ఇట్టి స్థితి పారమార్థికమునకు భంగము కనుక పారమార్థికచింత గల ఆర్యులు మెచ్చరు, స్వధర్మమునకు విరుద్ధమై అస్వర్గ్యము కనుక ధర్మచింతగల ధార్మికులు మెచ్చరు, పోని, పారమార్థికమును కాని ధర్మచింతను కాని ఎరుగని కేవల లౌకికులు మెచ్చుతారా అంటే, వారున్నూ మెచ్చరు ఏలననగా అట్టి లౌకికులకు దేవుడు స్వర్గము లేకపోయినా, ప్రతిష్ఠావాంఛ ఉంటుంది. ఇపుడు నీవు చేసేపని అప్రతిష్ఠకు కారణ మవుచున్నది. కనుక వారున్ను మెచ్చరు. ఈ 3 రకముల మానవులు కాక వేరే మానవులే లేరు. కనుక అర్జునా, నీవు యిపుడు చేయుచున్న పని మానవమాత్రుడైనవాడు ఎవడు చేయని క్షుద్రమైనది. అట్టి హృదయ దౌర్బల్యమును మాని మనుష్యునిలాగ ప్రవర్తించు, శత్రువులను తపింపజేసే వాడను అని 'పరంతప' అను గొప్ప బిరుదునుకూడా పెట్టుకున్నావే అట్టి నీవేనా యిపుడు పిరికిపంద వైనావు ! లే ! వీరుని వలె ప్రవర్తించు ! 'పరంతప' అను బిరుదును సార్థకము చేసికో అని బాగా రోషమువచ్చే బాణాలవంటి మాటలతో అర్జునుని కృష్ణుడు పొడి

చేటప్పటికి, అర్జునుడు ఆ చచ్చు తనము వదలి లేచి కూర్చున్నాడు. ఇపుడు యితనిని బోధకు సుముఖుని చేసికొనుటకు గాను కృష్ణుడు ఒక చిన్న సున్నితమైన ఇన్‌జెక్షను యిచ్చినాడు, అది 2వ అధ్యాయం 10 శ్లోకములో 'ప్రహసన్నివ' అను మాటలలో గర్భితంగా ఉన్నది. అర్జునుడు ఏడ్చుట సరియైనపని కాదని అర్జునునికి తెలియపరచవలెను. కృష్ణుడు మొదలకుండా ఊరుకుంటే అర్జునుడు దుఃఖించుట సవ్యమైనదే అని కృష్ణుడు అంగీకరించినట్లు అవుతుంది. అలా కాక కృష్ణుడు, ఏడుస్తూ యున్న అర్జునుని ముందు పకపకా నవ్వితే, అర్జునునికి కోపమువచ్చి ఉన్న గోడు చెడుతుంది, బోధకు సుముఖత రానేరదు. అందుకని కృష్ణుడు చిరునవ్వు నవ్వుతున్నాడో అన్నట్లుగానటించాడు. దీనివల్ల అర్జునునికి నేను చేస్తున్నపని సరియైనది కాదా ఏమి కృష్ణుడు చిరునవ్వు నవ్వుచున్నాడు. అయితే ఆయన చెప్పేది ఏదో విందాము అని సుముఖత కల్గుటకు అవకాశము కల్గినది. బోధకు సుముఖుని చేసేమార్గము జగన్నాటక సూత్రధారియైన ఆ కృష్ణునికే తెలియవలె యింకొకరికి సాధ్యమా!

ఈవిధముగా కృష్ణుడు తన బోధకు అర్జునుని సుముఖునిగా చేసుకొని 2వ అధ్యాయం 11 శ్లోకములో బోధను ప్రారంభించినాడు.

'అశోచ్యానన్వ శోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాష సే ।
గతాసూనగతాసూంశ్చ నాను శోచంతి పండితాః ॥

అను 11వ శ్లోకములో కృష్ణునిబోధ అంతయు బీజప్రాయంగా ఇమిడియున్నది. ఈ శ్లోకములో 3 భాగములున్నవి. అవే మనగా:-

1. అర్జునా, మూఢునివలె ఏడవకూడని వారికోసము నీవు ఏడుస్తున్నావు.
2. మాటలా, పండితునివలె మాట్లాడుచున్నావు.
3. అర్జునా, పండితులైన వారు చచ్చినవారికోసము గాని చావనివారి కోసము గాని ఎవరికోసము ఏడవరు అని కృష్ణుడు అన్నాడు.

ఇక్కడ పండితుడు అనగా ఆత్మజ్ఞానము కలవాడని అర్థము. 'పండ' కలవాడు పండితుడు. 'పండ' అంటే ఆత్మ జ్ఞానము, మాటలు కోటలు దాటుచున్నవి కాని చేతలు గడపలు దాటుట లేదు, అను సామెత ప్రకారం అర్జునుని మాటలలో పాండిత్యము కనబడుచున్నది. కాని అర్జునుని చేతలలో అనగా ఏడ్చుటలో మూఢత్వము తాండవించుచున్నది. ఇట్టి పరస్పర విరుద్ధమైన అర్జునుని ప్రవృత్తియే కృష్ణుని చిరునవ్వుకు కారణమైనది.

అర్జునుడు ఏడ్చుటలో మూఢత్వము కనబడుచున్నమాట నిజమే. కాని అర్జునుడు పండితునిలాగ ఎక్కడ మాట్లాడినాడు? అంటే 1వ అధ్యాయములోని 38 మొదలు 44 శ్లోకములలో అట్టి భావములను కనపర్చినాడు. యుద్ధం జరిగితే కులక్షయమవుతుంది కనుక అట్టి పాపం వస్తుంది . వర్ణసాంకర్యము కలుగుతుంది. కనుక అట్టి పాపం వస్తుంది. ఇట్టిపాపాలవల్ల నరకము వస్తుంది అని అర్జునుడు విలపించినాడు. నరకము వచ్చేది ఎవరికి ? శరీరముతోపాటు, లోని జీవుడుకూడా నశించేటట్లైతే నరకానికి పోయేది ఎవరు? నరకము వస్తుంది అని అనుటలో భావమేమి ? చనిపోయేది శరీరమే అనిన్నీ శరీరములోని జీవుడు చనిపోక చెడ్డపనులు చేస్తే నరకానికి పోతాడు అని భావము స్పష్టమేకదా ! యీ విధముగా జీవుడు చనిపోక నిత్యముగా ఉంటాడు. అనుభావము దృఢముగాఉంటే చనిపోతాడు అని దుఃఖించుట తెలివితక్కువేకదా? వీరందరు చనిపోతారే అని అర్జునుడు దుఃఖించాడు అని అంటే శరీరంతో పాటు జీవుడు కూడా చనిపోతాడు. అనేకదా అర్జునుని భావము. ఇట్లు అర్జునుని ఏడ్పులో శరీరమే జీవుడు అను భావమున్ను, అర్జునుని మాటలలో శరీరం వేరు, జీవుడు వేరు. శరీరం నశించినా జీవుడు నశించడు అను అందుకు విరుద్ధభావమున్ను వ్యక్తమగుట చేత కృష్ణుడు చిరునవ్వును నటించి, పండితులైనవారు ఎవరికోసమున్ను, ఏ పరిస్థితులలోను, ఎప్పుడు దుఃఖించరు అనుబోధను ప్రారంభించినాడు. పండితులు అయిన వారు చచ్చినవారి కోసంగాని

బ్రతికి ఉన్న వారికోసంగాని ఎప్పుడు ఏపరిస్థితులలోను దుఃఖించరు. అనుటలో చచ్చిన వారికోసం ఏడ్చుట అనునది, అందరికి తెలిసినదేగాని, బ్రతికి ఉన్న వారికోసం ఏడ్చుట అనగా ఏమి? ఆలాగైతే ఏడ్చేవారు ఎన్నిరకాలు అను ప్రశ్నలు పుట్టును. బాగా విమర్శించి చూస్తే మనుష్యులు నాల్గు రకాలుగా కనబడతారు!

1. చచ్చిన వారికోసము మాత్రమే ఏడ్చేవారు. వీరు అజ్ఞానులు, ఏమి తెలియని వారు, ఏరకము విజ్ఞానము లేని వారు.

2. చచ్చిన వారికోసం బ్రతికి ఉన్న వారికోసం కూడా ఏడ్చే వారు, వీరు కించిత్‌జ్ఞులు, కొంత విజ్ఞానము కలవారు.

3. చచ్చిన వారికోసము ఏడ్వక , బ్రతికి ఉన్న వారి కోసం మాత్రమే ఏడ్చేవారు, వీరు ధర్మజ్ఞులు ధర్మజ్ఞానము కలవారు.

4. చచ్చిన వారికోసంగాని, బ్రతికి ఉన్న వారి కోసం గాని ఏడవనివారు. వీరు ఆత్మజ్ఞులు, ఆత్మజ్ఞానం కలవారు.

1. మొదటిరకంవారు, ఏరకం విజ్ఞానంలేని అజ్ఞులు, అనగా కేవలం మూఢులు. వీరు చచ్చినవారికోసంమాత్రమే ఏడుస్తారు. శరీరంతో పాటు జీవుడుకూడా చచ్చిపోతాడు అను భావము కలవారు. బ్రతికి ఉన్న వారికోసం ఏడ్వవలసి వస్తుంది అను విషయముకూడా తెలియనివారు.

2. రెండవరకంవారు కించిత్ జ్ఞులు. అనగా కొంత విజ్ఞానం కలవారు. వీరు చచ్చినవారికోసం ఏడ్వటమేకాక, మిగిలినవారి గతిఏమి? వీరికి పోషణ ఎలాగు ? వీరు ఎలా జీవిస్తారు ? అను అనేకరకములైన దుఃఖ భావములు బ్రతికి ఉన్న వారిని గురించి కలుగుట అందరికి తెలిసిన విషయమే కదా ! ఇదే బ్రతికి ఉన్న వారికోసం దుఃఖించుట అంటే కనుక యీ 2వ రకమువారు ఉభయులకోసం ఏడుస్తారు.

3. ఇకను మూడవరకమువారు ధర్మజ్ఞులు అనగా ధర్మం తెలిసిన వారు. వీరు చచ్చిన వారికోసం ఏడ్వరు. ఏలనగా, చావు అంటే శరీరానికేగాని జీవునకుకాదు అనిన్నీ, జీవుడు తన జన్మాంతరీయ కర్మఫలమును అనుభవించుటకు అందుకు తగిన కుటుంబములో

పుత్రుడుగా జన్మించి కర్మ ఫలానుభవము అయిపోగానే ఆ శరీరము వదలిపోతాడు అనిన్నీ , అనుజ్ఞానం కలవారు కనుక, వారు చచ్చినవారి కోసం ఏడ్వరు. చావు అంటే శరీరాన్ని మార్చుట, చిరిగిన చొక్కాను వదిలి మంచి చొక్కాను ధరించినట్లు, శిధిలమైన యింటిని వదలి మంచి యింట్లోకి పోయినట్లు, యీ శరీరాన్ని వదలి యింకొక శరీరానికి జీవుడు వెళ్ళుతాడు. జీవుడు ఒక శరీరంలో ప్రవేశిస్తే పుట్టుట అనిన్ని, ఆ శరీరాన్ని విడిస్తే చావు అనిన్ని తెలిసికొనవలయును. కనుక యీ పుట్టుక చావులు ఆ శరీరానికేగాని, జీవునికి లేవు. జీవుడు. నిత్యుడే. జీవుడు తన ఆధ్యాత్మిక అనుభవమును సంపాదించుకొనుటకు గాను ఒక్కొక్క కుటుంబములో ఒక్కొక్క మజిలీగా ఉండి అచట అనుభవాలు అయిపోగానే ఆ మజిలీని విడిచిపోతాడు. యీ విధముగా ప్రతిజీవుడు మోక్షమనే పట్టణానికి జీవయాత్ర చేస్తూ ఉంటాడు. భాగవతం 6వ స్కంధంలో చిత్ర కేతూపాఖ్యానం యీ విషయమును విశదీకరించు చున్నది. ఆ చిత్రకేతుడు అను రాజు ఎంతమంది భార్యలను వివాహం చేసుకొన్నా సంతానము లేకపోతే, నారదమహర్షి ఉపదేశమువల్ల పెద్ద భార్యతో పుత్రకామేష్టి చేయగా పెద్ద భార్యకు ఒక చక్కని పుత్రుడు కలిగెను. అందరు ఆ రాజును ఆ పెద్ద భార్యను పుత్రుడు కలిగినాడని ఎంతో గౌరవిస్తూ ఉంటే, మిగతా భార్యలు అసూయచేత ఆ పిల్ల వానికి విషము పెట్టించి చంపించినారు. ఆ దుఃఖము భరించలేక, ఆ రాజున్ను భార్యయున్ను ఘోరంగా ఏడుస్తూ ఉంటే, నారదుడు రాగా, పిల్లవానిని బతికించమని ప్రార్థించినారు. నారదుడు ఆ పిల్లవాని జీవుని ఆ మృతశరీరంలో ప్రవేశించమని ఆజ్ఞాపించగా, ఆ జీవుడు ఆ మృత శరీరంలో ప్రవేశించినాడు. అంతట పిల్లవాడు బతికినాడు. ఆ తల్లిదండ్రులు బ్రహ్మానందపడుచుండగా ఆ పిల్లవాడు నారదునితో "స్వామి నన్ను ఎందుకు మళ్ళీ ఈ శరీరములో ప్రవేశపెట్టినారు" అని అడిగివాడు. అంతట నారదుడు మీ తల్లితండ్రులు నిన్ను చూడవలెనని అనుకొనుచున్నారు. అని చెప్పగా, ఆ పిల్లవాడు ఏ తల్లితండ్రి నన్ను చూడవలెనని అనుకొనుచున్నారు? నాకింతవర్కు ఎంతోమంది తల్లిదండ్రులు మజలీలుగా అయినారు, యింకను యిట్టి మజిలీలు

ఎన్నో దాటాలి, యీ మజిలీలోనే యింకా కూర్చుంటే ఎలా? అని ఆ తల్లిదండ్రులు వినేటట్టుగా అనేటప్పట్కి ఆ తల్లిదండ్రులకు వైరాగ్యంకలిగింది. ఈ విధముగా చావు అంటే చొక్కాను మార్చినట్లు శరీరాన్ని మార్చుటయే అనిన్నీ, జీవునికి చావు లేదు అనిన్నీ, జన్మాంతరీయ కర్మఫలాన్ని అనుభవించుటకు శరీరమెత్తి ఆ కర్మ ఫలానుభవము అయిపోగానే ఆ శరీరాన్ని విడుచును అనిన్నీ, యిట్టి ధర్మం తెలిసిన ధర్మజ్ఞులు చనిపోయినవారిని గురించి ఏడ్వరు కాని తమ వంశములో పుట్టిన పిల్లలు వృద్ధిలోనికి రాక, విజ్ఞానవంతులు కాక, మూఢులు అయి అప్రతిష్ఠను కలుగ చేస్తారేమో అని బతికివున్న వారిని గురించి మాత్రం దుఃఖించుతారు.

4. నాల్గవరకమువారు ఆత్మజ్ఞులు అనగా, ఆత్మజ్ఞానం కల్గిన జీవన్ముక్తులు, వారు చనిపోయిన వారికోసం కాని, బతికి యున్న వారికోసం కాని ఏడ్వరు. వీరికి జగత్తు సత్యం కాదు, జగత్తు అంతయు నాటకం వంటిది, స్వప్నమువంటిది మిధ్య. కనుక యీ జగత్తులో జరుగు సుఖదుఃఖాలకు వారి మనస్సులో ఎట్టిమార్పు కలుగదు. వారు నిత్యము 'ఆత్మ న్యే వాత్మ నా తుష్ఠః' అని ఆత్మానందంలోనే ఉంటారు.

ఈ విధముగా కృష్ణ పరమాత్మ అర్జునునికి గీతా బోధను ప్రారంభించిన మొదటి శ్లోకములోనే ఆత్మజ్ఞానులు ఎవరికోసం ఎపుడు ఏడ్వరు, అని 'చెప్పుటలో ఆత్మతత్త్వ జ్ఞానముయొక్క ఫలము దుఃఖ నివృత్తి, ఆత్మానంద ప్రాప్తి, అని వ్యక్తం చేసినాడు. ఇదియేకదా మోక్షస్వరూపము. ఇట్టిమోక్షము ఆత్మజ్ఞానమువల్లనే కల్గును అని గీతాబోధ సారమును బీజరూపముగా 11వ శ్లోకములోనే కృష్ణపరమాత్మ స్పష్టం చేసాడు. దాని విపులీకరణ యీ సాంఖ్య యోగములోని మిగతా శ్లోకములున్ను, దానికి విపులీకరణ మిగతా అధ్యాయములున్ను అయియున్నవి. సాంఖ్యం అనగా 'సమ్యక్ ఖ్యాయతే, అనేన ఆత్మతత్త్వం' అను వ్యుత్పత్తినిబట్టి ఆత్మతత్త్వబోధయే కనుక, 2వ అధ్యాయమైన' సాంఖ్య యోగము యొక్క సారము యీ 11వ శ్లోకమే.

పదకొండవ కిరణము
కృష్ణునిబోధ సాంఖ్యయోగము
(గీత-2వ అధ్యాయము)

గీతలోని 2వ అధ్యాయమైన సాంఖ్య యోగములో, కృష్ణ పరమాత్మ తనబోధను 11వ శ్లోకముతో ప్రారంభించినాడనిన్నీ, ఆశ్లోకములో 3 భావములున్నవనిన్నీ మొదటి భావము ఏడ్వకూడని వారికోసం అర్జునుడు ఏడుస్తున్నాడు "అను భావమనిన్నీ లోగడ మనము తెలిసికొనియున్నాము. ఏడవకూడనివారు అనుటలో ఏడ్వకూడని తనము అనగా అశోచ్యత్వము ఇమిడియున్నది కనుక దానియొక్క స్వరూపము, అది ఎన్ని రకములుగా నున్నది మనము తెలిసికొనవలసియున్నది.

సాంఖ్యయోగము అను 2వ అధ్యాయములో 72 శ్లోకములున్నను, దానిలోని మొదటి 10 శ్లోకములు మొదటి అధ్యాయమైన అర్జున విషాద యోగమునకు చెందినవే కనుక, సాంఖ్యయోగము మిగిలిన 62 శ్లోకములలోనే యిమిడియున్నది. 11వ శ్లోకము మొదలు 72వ శ్లోకమువరకు ఉన్న 62 శ్లోకములు విమర్శించిన చో విషయవారీగా నాల్గు భాగములు తేలును.

I. అశోచ్యత్వబోధ, ఆత్మతత్త్వబోధ (11వ శ్లోకము నుంచి 38వ శ్లోకంవరకు)
II. ఆత్మత త్త్వజ్ఞుడు అనుస్థితప్రజ్ఞుల లక్షణాలు (54 నుంచి12వరకు)
III. నిష్కామకర్మబోధ (39 శ్లోకంనుంచి 51 వ - శ్లోకము వరకు)
IV. నిష్కామకర్మకు అవధి (52, 53 శ్లోకములు)

I. అశోచ్యత్వబోధ:- (11 నుంచి 88 శ్లోకమువరకు)

యీ అశోచ్యత్వబోధ 11 వ శ్లోకము నుంచి 38 వ శ్లోకమువరకు ఉన్న 28 శ్లోకాలలో 5 విధములుగా చేయబడినది..

1. అద్వైతదృష్ట్యా అశోచ్యత్వము
2. ద్వైతదృష్ట్యా అశోచ్యత్వము

3. స్వధర్మదృష్ట్యా అశోచ్యత్వము

4. చార్వాకదృష్ట్యా అశోచ్యత్వము

5. లౌకికదృష్ట్యా అశోచ్యత్వము

1. అద్వైత దృష్ట్యా అశోచ్యత్వము :- 'బ్రహ్మ సత్యం జగన్మిథ్యాజీవో బ్రహ్మైవ నాపరః' ॥ అనునది అద్వైత సిద్ధాంతము. బ్రహ్మ లేక ఆత్మఒక్కటే సత్యమనియు, జగత్తంతయు మిథ్యయనియు, జీవుడు వాస్తవంగా బ్రహ్మయే కాని అన్యుడు కాదనియు దీని భావము. ఈ విచారణలో (1) ఆత్మతత్త్వవిచారణ (2) జగన్మిథ్యాత్వ విచారణ అనునవి ప్రధానములు. ఆ రెంటిని పరిశీలించుదము. (1) ఆత్మతత్త్వవిచారణ :-(11 టు 25, 29, 30 శ్లోకాలు)

అద్వైత సిద్ధాంతరీత్యా ఆత్మనిత్యము, ఏకము, సర్వ వ్యాపకము, నిరవయవము, ఆశ్చర్యము, శాస్త్రప్రమాణికము అయ్యున్నది. నిత్యము అనుటవల్ల అజము, అవ్యయము నిర్వికారము, నిష్క్రియము, షడ్భావవికార శూన్యము అని స్పష్టమగుచున్నది. 2వ అధ్యాయములోని 11, 12, 13,16, 17, 18, 19, 20, 21, 22, 23, 24, 25, 29, 30 శ్లోకములు పైభావములను విశదీకరించుచున్నవి. వానిలో 17, 18, 30 శ్లోకములు ప్రతి ఉపాధిలోను ఆత్మలు వేరుగా లేవనిన్నీ, అన్ని ఉపాధులలోనూ ఉన్న ఆత్మ ఒక్కటే అనిన్ని ఆత్మ నానాత్వమును నిరసించుచూ, ఆత్మైకత్వమును ప్రతిపాదించుచున్నవి. దీనిని బట్టియే జీవబ్రహ్మైక్యముకూడ స్పష్టమగుచున్నది. 25వ శ్లోకము ఆత్మప్రత్యక్ష ప్రమాణమునకును, అనుమాన ప్రమాణమునకును అందనిదిన్నీ, వాక్కుకు, మనస్సుకుకూడ గోచరించనిదిన్ని శాస్త్రప్రమాణం వల్లనే తెలిసికోతగిన దనిన్నీ స్పష్టము చేయుచున్నది. ఇట్టి ఆత్మతత్త్వబోధకు సాధన చతుష్టయసంపత్తి అవసరము కనుక అట్టి సంపత్తి 14, 15 శ్లోకాలలో బోధ చేయబడినవి.

2. జగన్మిథ్యాత్వవిచారణ:- (28, 16 శ్లోకములు)

2వ అధ్యాయములోని 28, 16 శ్లోకములు జగన్మిథ్యాత్వమును

నిరూపించుచున్నవి. 28వ శ్లోకములో ఈ జగత్తుకు ఆది మధ్యాంతములలో ఆది అంతములు అవ్యక్తములు అనగా తెలియబడనివి. లేనివి అనిన్నీ, మధ్యము మాత్రము వ్యక్తము అనగా తెలియబడేదనిన్నీ, అనగా కనబడుట మాత్రమే లక్షణముగా కలదనిన్నీ స్పష్టమగుచున్నది. దేనికైతే వస్తుత్వం లేకుండా, దృశ్యత్వం మాత్రమే ఉంటుందో అది మిథ్య అని శాస్త్రము చెప్పుచున్నది. కనుక జగత్తు మిథ్య అని 28 వ శ్లోకము నిరూపించుచున్నది.

ఇంకను 16వ శ్లోకము ఉన్న వస్తువుకు లేమి లేదనిన్నీ లేనిదానికి ఉనికి లేదనిన్నీ చెప్పుటవల్లను, ఉన్న వస్తువు అనగా ఆత్మ అనిన్నీ, లేనిది అనగా అనాత్మ లేక జగత్తు అనిన్నీ అర్థము. కనుక, ఆత్మకు అభావము అనగా లేక పోవుట ఎప్పుడూ ఉండదనిన్నీ, అనాత్మయైన జగత్తునకు ఉనికి అనగా వస్తుత్వము, సత్యత్వము ఎప్పుడు ఉండనేరదనిన్నీ స్పష్టమగుచున్నది. దీని భావము. ఉన్నది ఎప్పుడూ ఉంటుంది. లేనిది ఎప్పుడూ లేదు అని తేలుచున్నది. ఇంత స్పష్టమైన విషయమై కృష్ణుడంతటివాడు. మనకు బోధచేయవలెనా ? అని సందేహము కలుగవచ్చును. ఈ విషయము పైకి స్పష్టముగా కనపడుచున్నదే కానీ, వాస్తవంలో మనము అనుకున్నంత స్పష్టము కాదు. ఉన్న వస్తువుకు లేమి లేదు. లేని దానికి ఉనికి లేదు అని చెప్పుటలో రెండురకములైన ప్రతి నిషేధములు కనపడుచున్నవి. ఉన్నదానికి లేమి లేదు అను ఒక ప్రతిషేధము, లేనిదానికి ఉనికి లేదు. అను రెండవ ప్రతిషేధము కనపడుచున్నవి, ప్రతి షేధము అనగా లేదు అని చెప్పుట. ప్రసక్తి వచ్చినపుడు ప్రతిషేధించవలెను కాని ప్రసక్తియే లేనపుడు ప్రతి షేధించుటకు అవసరమే లేదుకదా. ఒక దృష్టాంతమును తీసికొందము. ఒక పిల్లవాడు కత్తితో తెలియక తన చేతిని కోసుకోపోతుంటే, దానివల్ల వానికనర్థము కనుక, "అబ్బాయీ! కోసుకోవద్దు" అని ప్రతిషేధిస్తాము అనగా వద్దని చెప్పుతాము కాని అతని చేతిలో కత్తియే లేనపుడు కాని, ఉన్ననూ కోసుకునే ధోరణి

లేనపుడుగానీ కోసుకోవద్దని చెప్పము కదా, అట్లు చెప్పుటకు అసలు అవసరమే లేదు కదా. కనుక ఒక విషయం ప్రసక్తమైతేను, దానివల్ల నష్టంవచ్చేటట్లైతేనూ, అప్పుడు ఆ పనిని చేయవద్దు అని చెప్పుట సబబు అని అందరికి తెలిసినదే కదా. ఇప్పుడు ఆత్మకు అభావము లేదు. అనగా ఆత్మ లేకపోవుట లేదు. అని ఎందుకు చెప్పవలసి వచ్చింది అంటే, ఆత్మ కంటికి కనపడుట లేదు కనుక, లేదు అని అనుకోవటానికి అవకాశము కలుగుచున్నది కనుకను, ఆత్మ లేదు అని అనుకునే పక్షంలో గొప్ప అనర్ధ మున్నది కనుకను, ఆత్మ కనపడనంత మాత్రాన, లేదు అని అనుకోవద్దు. అని ప్రతిషేధించవలసి వచ్చినది. అటులనే జగత్తు కంటికి కనబడుచున్నది కనుకను, కనపడుచున్నంత మాత్రాన ఉన్నది అనగా సత్యమైనది, నిత్యమైనది అని అనుకోవటానికి అవకాశమున్నది కనుకను, అట్లు జగత్తు సత్యమైనది అని అనుకునేటట్లైతే అనర్ధము కలుగును కనుకను, అట్టి పొరపాటుపడి చెడిపోకుండా ఉండుటకై కనపడు చున్నను జగత్తునకు సత్యత్వము లేక వస్తుత్వము లేదు అని బోధ చేయవలసివచ్చినది, కనుక, కనపడకపోయినా ఆత్మ, ఎప్పుడూ ఉండేదే, కనపడినా జగత్తు వస్తుత్వం లేనిదే ఇట్టి వస్తుత్వం లేని అనాత్మయైన జగత్తును నమ్మి చెడిపోక వస్తువు ఐన ఆత్మను సాక్షాత్కారము చేసికొని బాగుపడుము అను బోధ అవసర మైనది. ఇట్టి వస్తుత్వం లేకుండా కనపడుట మాత్రమే లక్షణముగా కలదానిని మిథ్య అని అంటారు. మిథ్య అంటే కనపడనిది అని అర్థం కాదు కనపడినను వస్తుత్వం లేనిదే అని అర్థము. ఇంకను కుందేటి కొమ్ము అను దానికి వస్తుత్వం లేదు. వస్తుత్వం లేనంత మాత్రాన దాన్ని మిథ్య అని అనము. ఎందుచేతననగా, అది అసలే కనపడదు కనుక, వస్తుత్వం లేనిదీ, కనపడనిది తుచ్ఛము లేక అసత్ అని అంటారు. ఇప్పుడు జగత్తు కనపడుచున్నది కనుక కుందేటి కొమ్మువలే తుచ్ఛం కాదు, అసత్ కాదు. పోనీ, ఆత్మవలె నిత్యంగా, సత్యంగా ఎప్పుడూ ఎట్టిమార్పు లేకుండా సత్ గా ఉంటుందా అంటే,

అలా ఉండదు ఎప్పుడూ మారుతూ అనిత్యంగా ఉన్నది. కనుక జగత్తు ఆత్మవలే సత్ కాదు, కుందేటి కొమ్మువలె అసత్ కాదు. ఇట్టి సత్ కానటువంటిన్నీ అసత్ కానటువంటిన్నీ దానిని మిథ్య అని అంటారు. జగత్తు అటువంటిది కనుక మిథ్య అని చెప్పబడుచున్నది.

ఈ విధంగా అద్వైత దృష్ట్యా ఆత్మ నిత్యము, ఏకము కనుకను, అది నశించేది కాదు కనుకను, అది నశించును అని శోకింపకూడదు, అని అశోచ్యత్వబోధ, ఇంకను శరీరములు నశించిపోవును కనుక అట్టి శరీర నాశనమునకైనను దుఃఖించుట, తగినదే కదా అని అంటావేవెూ, శరీరములు మిథ్య కనుక, స్వప్నములోని శరీరములవంటివి కనుక అట్టి శరీరముల నాశనమునకు శోకింప నవసరము లేదు అని అశోచ్యత్వ బోధ. ఇది అద్వైత దృష్ట్యా అశోచ్యత్వబోధ.

(2) ద్వైతదృష్ట్యా అశోచ్యత్వము. – (12 వ శ్లోకము)

ద్వైత సిద్ధాంత ప్రకారము ఆత్మకు ఏకత్వము లేదు. ఆత్మలు అనేకములు. ప్రతి శరీరములోను ఆత్మలు వేరు వేరుగా నుండును. ఇట్లు. ప్రతి శరీరములోనూ ఆత్మలు వేరు వేరుగా నున్నను, ఆ ఆత్మలు నిత్యమైనవి అవెప్పుడును నశించేవి కావు.

2 వ అధ్యాయములోని

శ్లో ॥ నత్వేవాహం జాతునాసం నత్వం నేమే జనాధిపాః ।
నచైవనభవిష్యామ సర్వేవయమతః పరం ॥ .

అను 12 వ శ్లోకములోని నేను, నీవు, వీరందరు నిత్యులే అను బహువచన ప్రయోగమువల్ల ఇట్టి ఆత్మ నానాత్వమును వాదన కొరకు అంగీకరించినను, అట్టి ఆత్మలు నిత్యమైనవి. నశించేవి కావు కనుక వానిని గురించి కూడ శోకింప తగదు, అని ద్వైత దృష్ట్యా అశోచ్యత్వబోధ. వాస్తవంలో 12 వశ్లోకములోని నానాత్వము ఉపాధి దృష్ట్యా నానాత్వము కాని ఆత్మ నానాత్వ బోధకము కాదు.

(3) స్వధర్మదృష్ట్యా అశోచ్యత్వము :- (31,32 33,37,38, శ్లోకాలు)

గీత 2 వ అధ్యాయములోని 31, 32, 33, 37,38 శ్లోకములలో ధర్మమైన. యుద్ధముకంటె క్షత్రియునికి వేరే శ్రేయోదాయకము లేదనియు (31) అప్రయత్నంగా సిద్ధించిన అట్టి ధర్మయుద్ధము తెరచి ఉన్న స్వర్గ ద్వారము వంటి దనియు (32) అట్టి ధర్మయుద్ధము చేయనిచో స్వధర్మము, కీర్తి చెడి పాపం వచ్చుననియు. (38) అట్టి యుద్ధములో చని పోయిన స్వర్గము వచ్చుననియు, జయించిన రాజ్యము వచ్చు ననియు. ఉభయధాలాభమే కనుక తప్పక యుద్ధము చేయు మనియు (37), లాభాలాభములు, జయాప జయములు సుఖ దుఃఖములను సమానంగా చూచుచు స్వధర్మమైన యుద్ధము చేస్తే పాపము రానేరాదనియు (38), కృష్ణుడు అర్జునునికి బోధించి ఈ విధంగా కూడ నీవు శోకింపతగవు అని అశోచ్యత్వమును స్వధర్మదృష్ట్యా కూడా బోధించి నాడు.

(4) చార్వాకదృష్ట్యా అశోచ్యత్వము :- (26, 27 శ్లోకాలు)

ఒకవేళ ఆత్మ నిత్యము కాదనియు, దేహముతో పుట్టి, దేహముతో చచ్చే స్వభావము కలదనియు. అని అనుకొన్నను పుట్టిన ప్రతి వస్తువు చనిపోవుట, చనిపోయినది తిరిగి పుట్టుట అనునవి తప్పించుటకు వీలు లేని ధర్మములు కనుక , అట్టి తప్పించ వీలులేని విషయములో నీవు శోకింప తగదు, అని చార్వాకదృష్ట్యా అశోచ్యత్వబోధ 26, 27 శ్లోకాలులో చేయబడినది.

(6) లౌకిక దృష్ట్యా అశోచ్యత్వము :-(34, 35 36 శ్లోకాలు)

దేవునియందుకాని, వేదమునందుకాని, పుణ్యపాపాలు స్వర్గ నరకాల యందు కాని, ఆత్మ ఒకటి ఉన్నదని కాని, విశ్వాసం లేని వారు కేవలం లౌకికులు, చార్వాకులకు ఆత్మ ఒకటి ఉన్నదని, అది దేహమే అని విశ్వాస మున్నది కనుక వారికంటె హీనులు ఈ లౌకికులు. అట్టి లౌకికులు కూడ ప్రతిష్ఠకు వాంఛిస్తారు. అర్జునా, ఇప్పుడు. నీవు

యుద్ధము చేయనిచో, నీవు శాశ్వతమైన అపకీర్తికి పాల్పడుతావు, గొప్ప వంశములో పుట్టినవారు అపకీర్తికి పాల్పడుటకంటె చచ్చుట మేలు (34) అర్జునుడు గొప్పవీరుడు, పరాక్రమం కలవాడు అని నిన్ను గౌరవించిన వారందరు ఇప్పుడు నిన్ను యుద్ధములో గెలువ లేక భయపడి పారిపోయినావు. శుద్ధ పిరికిపందవు అని గేలిచేస్తారు (35) యిలా నిన్ను అనరాని మాటలు అని నిందిస్తూ ఉంటే అట్టి అప్రతిష్ఠకు పాల్పడుటకంటె దుఃఖకరమైన దేమున్నది ? (36) కనుక శోకింపతగవు అని కృష్ణునిచేత లౌకిక దృష్ట్యా కూడా అశోచ్యత్వబోధ గావింపబడినది.

ఈ పై అయిదు పద్ధతులు కంటె వేరే యింకొక పద్ధతి లేనే లేదు. ఏ పద్ధతిలో కూడా అర్జునా నీవు శోకింప తగవు అని కృష్ణుడు అర్జునునికి అశోచ్యత్వమును బోధించినాడు.

II స్థితప్రజ్ఞ లక్షణాలు (54 శ్లోకం నుంచి 72 శ్లోకం వరకు)

ఈ అశోచ్యత్వ బోధలో ఆత్మనిత్యమైనది, ఏకమైనది సర్వవ్యాపక మైనది, సచ్చిదానందానంత రూపమైనది అను అద్వైతబోధయే ప్రధానమైనది. వాదన కొరకుమిగతాదృష్టులు అంగీకరింపబడినవే. కానీ, వానియందు ముఖ్య తాత్పర్యము లేదు. ఇట్టిదీ అభ్యుపగమ్యవాద మంటారు. ఆత్మతత్త్వం తెలిసిన వారికి జగత్తు స్వప్నంవలె మిథ్య. వారెప్పుడు ఆత్మానందములోనే ఉంటారు. అట్టివారినే స్థితప్రజ్ఞు లంటారు. అట్టి వారి లక్షణాలు తెలిసికొనవలెనని అర్జునుడు 54వ శ్లోకములో కృష్ణుని కోరగా కృష్ణుడు 55 శ్లోకమునుంచి 72వ శ్లోకంవరకు అట్టి లక్షణాలను చక్కగా బోధించినాడు.

అర్జునుడు అడిగిన 54 శ్లోకంలో 4 ప్రశ్నలున్నవి. అవేమనగా

1. సమాధిలోనున్న స్థిత ప్రజ్ఞుని లక్షణాలు ఏమి ?
2. బహిర్ముఖుడైన స్థితప్రజ్ఞుడు కష్టసుఖములందు ఎట్లు ప్రవర్తిస్తాడు ?
3. బహిర్ముఖుడైన స్థితప్రజ్ఞుని అవయవములు ఎట్లుండును ?
4. బహిర్ముఖుడైన స్థితప్రజ్ఞుడు ఎట్లు వ్యవహరిస్తాడు ?

1వ ప్రశ్న:- సమాధిలో నున్న స్థిత ప్రజ్ఞుని లక్షణాలు ఏమి ?

దీనికి జవాబు శ్రీకృష్ణ భగవానునిచే 55 వ శ్లోకములో చెప్పబడినది. సమాధిలోనున్న స్థితప్రజ్ఞుడు ఎప్పుడు ఆత్మానందములోనే ఉంటాడు. అతడు మనోగతములయిన కామము లన్నిటిని సంపూర్తిగ త్యజిస్తాడు. ఆత్మకు ఎట్టికోరికలు లేవు. సమాధిలో మనస్సుకూడ పనిచేయదు. కనుకను ఆత్మేతర మేమియు లేదు కనుకను, ఆత్మ ఆనందస్వరూపమే కనుకనూ, అతడు ఎల్లపుడు నిత్యనిరతిశయ నిరుపాధికమైన ఆత్మానందములో ఉంటాడు.

2వ ప్రశ్న :- బహిర్ముఖుడైన స్థితప్రజ్ఞుడు కష్టసుఖములందు ఎట్లు ప్రవర్తించును

దీనికి జవాబు 56, 57 శ్లోకములలో చెప్పబడినది. బహిర్ముఖుడైన స్థితప్రజ్ఞుడు కష్టములు ప్రాప్తించితే క్రుంగిపోడు. సుఖాలు వస్తే పొంగిపోడు. ఏ పరిస్థితులలోనూ అతని మనస్సు ఉద్వేగమును కాని వికారము కాని పొందదు. అతనికి రాగ, భయ, క్రోధము లుండవు (56). ఇంకను అతడు శుభములు వచ్చినపుడు శుభములు కలుగ చేసినవారిని అభినందింపడు. అశుభములు వచ్చినపుడు ఆ అశుభములు కలుగ చేసిన వారిని ద్వేషింపడు. మరియు అతనికి శరీరాదుల విషయమై ఏమాత్రము కూడ ఆసక్తి ఉండదు (57).

3 వ ప్రశ్న :- బహిర్ముఖుడైన స్థిత ప్రజ్ఞుని అవయవము లెట్లుండును ?

దీనికి జవాబు 58, 59, 60, 61, 62, 63 అను శ్లోకములలో చెప్పబడినది. తాబేలు తన అవయవములను సంపూర్తిగ తనవశములో ఉంచుకున్నట్లుగా బహిర్ముఖుడైన స్థితప్రజ్ఞుడు తన యింద్రియములను విషయములలో నుంచి ఉపసంహరించుకొని, తన వశములో ఉంచుకుంటా డనిన్నీ (58) నిరాహారునికి కూడా యింద్రియములు విషయాల మీదకు పోనట్లు కనబడిననూ, అట్టివానికి విషయవాంఛ మిగిలే ఉంటుంది అనిన్నీ, అట్టి వాంఛకూడా ఆత్మసాక్షాత్కారమైతేనే

పోతుంది అనిన్నీ (59), ఎంత విద్వాంసుని అయినను యింద్రియములు పొగరుమోతు గుఱ్ఱాలవలె పెడత్రోవకు లాగి మనస్సును హరించును గనుక యింద్రియములను ఎపుడు వశములో ఉంచుకొనవలెననిన్నీ, ఎవరికైతే యింద్రియములు అలావశములో ఉండునో అట్టివాడే స్థిత ప్రజ్ఞుడనిన్నీ (60, 61), విషయధ్యానమువల్ల విషయములందు ఆసక్తి అనుసంగం కలిగి ఆ సంగంలో నుంచి కామముపుట్టి, ఆ కామములో నుంచి క్రోధము, దానిలోనుంచి సమ్మోహము, సమ్మోహములో నుంచి స్మృతిభ్రంశము, దానిలో నుంచి బుద్ధి నాశనము కల్గి మానవుడు జీవించి యుండగానే జీవచ్ఛవమువలె అగుననిన్నీ, స్థితప్రజ్ఞుడు యిట్టి పరిస్థితికి అతీతముగా ఉంటాడనిన్నీ (62, 68) చెప్పబడినది.

4 వ ప్రశ్న :- బహిర్ముఖుడైన స్థితప్రజ్ఞుడు ఎట్లు వ్యవహరిస్తాడు ?

దీనికి జవాబు 64 శ్లోకమునుండి 71 శ్లోకమువరకు ఉన్న 8 శ్లోకాలలో చెప్పబడినది. అట్టి స్థితప్రజ్ఞుని ఇంద్రియములు రాగ ద్వేషములు లేనివై అతని వశములో ఉండును కనుక అట్టి ఇంద్రియములతో విషయములను అనుభవించుచూ వ్యవహరించినను, అతని మనస్సులో ప్రసాదము, శాంతి ఉండుననిన్నీ (64) అట్టి ప్రసాదమువల్ల సర్వదుఃఖ హానికలిగి సర్వాత్మభావము కలుగుననిన్నీ (65), ఇంద్రియ వశంలో లేని వాడికి శాంతిసుఖములు ఉండ నేరవనిన్నీ (66), ఇంద్రియములు వశంలో లేకపోతే అవి మనస్సును చుక్కానిలేని పడవను గాలివలె అటూ ఇటూ చెదరగొట్టి పాడు చేస్తవనిన్నీ (67), కనుక ఎవరి ఇంద్రియములు విషయముల మీదికి పోకుండా వశంలో ఉండునో వాడే స్థితప్రజ్ఞుడనిన్నీ (68), ఆత్మజ్ఞానము అజ్ఞానికి చీకటి రాత్రి వంటిదనిన్నీ, స్థితప్రజ్ఞునకు పగలువంటిదనిన్నీ, అజ్ఞానికి పగలుగా ఉన్న జాగ్రత్ ప్రపంచము స్థిత ప్రజ్ఞునికి చీకటి రాత్రివంటిది అనగా మిథ్య అనిన్నీ (69), ఎన్ని నదులు సముద్రములో ప్రవేశించినా సముద్రము నిర్వికారంగా ఉన్నట్లు ఎన్ని కామములు స్థితప్రజ్ఞునిలో ప్రవేశించినట్లు కనబడినను, అతను నిర్వికారముగా పరమ శాంతితో

ఉంటాడనిన్నీ (70), కనుక ఎవరైతే సర్వ కామములు పూర్తిగా త్యజించి, నిస్పృహుడై అహంకార మమకారములు లేకుండా విషయములలో వ్యవహరించిననూ అట్టివాడు స్థితప్రజ్ఞుడే అనిన్నీ, అట్టివానికి నిరతిశయమైన శాంతి ఉండుననిన్నీ (71), బహిర్ముఖుడైన స్థితప్రజ్ఞుని వ్యవహారము వర్ణింపబడినది.

చివరకు 72వ శ్లోకంలో ఇట్టి స్థితప్రజ్ఞస్థితి బ్రాహ్మీస్థితి అనిన్నీ, ఇట్టిస్థితి అవసాన కాలంలో వచ్చినా వాడు ముక్తుడే అనిన్నీ, వాని కెట్టి మోహము తిరిగి కలుగదనిన్నీ, పడుచుతనంలో నుండగానే అట్టిస్థితి సంభవించినచో ఇంక అట్టిస్థితి వర్ణనాతీతమనిన్నీ స్థితప్రజ్ఞుని మాహాత్మ్యము వర్ణించబడినది. దీనివల్ల అట్టి స్థితప్రజ్ఞుడు జీవన్ముక్తుడే అని జీవన్ముక్తి కూడ విశదీకరింప బడినది. అట్టి స్థితప్రజ్ఞుని లక్షణాలు లక్ష్యమందుంచుకొని, సాధకుడు సాధన చేయవలెనని సాధకునికి బోధ చేయబడినది.

III నిష్కామ కర్మబోధ :- (39 నుంచి 51 శ్లోకాలు)

ఈ సాంఖ్యయోగము అను 2 వ అధ్యాయంలో ఆత్మతత్త్వమున్ను అట్టి ఆత్మజ్ఞానమువల్ల మోక్షము అనిన్నీ బోధింపబడుటయే కాక అట్టి ఆత్మజ్ఞానమునకు సాధనమైన కర్మయోగము అను నిష్కామకర్మకూడ బోధింప బడినది. 38 వ శ్లోకం వరకు ఆత్మతత్త్వమును అశోచ్యత్వమును బోధించి, ఆ పైన 39 వ శ్లోకంనుంచి 51 వ శ్లోకంవరకు కర్మ యోగమును కృష్ణ పరమాత్మ బోధించినాడు. ఈ పదమూడు శ్లోకములలో కర్మయోగము 4 విధములుగా బోధింపబడినది.

1. కర్మయోగమాహాత్మ్యము (39 నుండి 41 వ శ్లోకం వరకు)

ఈ కర్మయోగంవల్ల కర్మబంధం పోతుందనిన్నీ (39), దీనిని ప్రారంభించి మధ్య విడచినను, చేసినంతవరకైననూ ఫలం వస్తుందనిన్నీ ప్రత్యవాయము రాదనిన్నీ, చేసినది స్వల్పమైననూ గొప్ప సంసార భయమునుండి రక్షిస్తుందనిన్నీ (40), ఇట్టిది సమ్యక్ ప్రమాణజనిత

మగుటచే ఏకరూపమై నిశ్చయాత్మకమైన చక్కని రాజ బాట అనిన్నీ, అట్లు నిశ్చయాత్మకము లేనివారి బుద్ధులు అనంతములై సందుత్రోవలను పట్టునే కాని మోక్షమార్గమైన రాజ బాటకు రావనిన్నీ (41) బోధింపబడినది.

2. కామ్యకర్మనింద (42 నుంచి 44 శ్లోకాలు)

ఆ తరువాత కామ్యకర్మములోని దోషములను బోధిస్తేనేకాని నిష్కామకర్మ ఆవశ్యకత తెలియదు. కనుక, కామ్యకర్మవల్ల జనన మరణ ప్రవాహంలో పడుటయే ఫలమనిన్నీ, స్వర్గానికి వెళ్ళినా ఆ స్వర్గభోగం అయి పోగానే తిరిగి భూలోకంలో పుట్టవలసినదే అనిన్నీ , ఇట్టిది భోగలాలసతకు త్రోవచూపి, నిశ్చయాత్మకమైన మోక్ష మార్గమునకు రానివ్వదనిన్నీ చెప్పబడినది.

3. కర్మయోగము జ్ఞానమునకు సాధనము అనుబోధ (45,46 శ్లోకాలు) : కామ్యకర్మములను వదలి నిష్కాముడవై, ద్వంద్వములను సహించి సత్వ ప్రధానమైన మనస్సు కలవాడవై యోగ క్షేమములను ప్రారబ్ధాధీనములని వదలి, ఆత్మజ్ఞానము కలవాడుగా కావలెననిన్నీ (45), కర్మయోగ ఫలమంతయు జ్ఞాన యోగ ఫలములో అంతర్భాగమనిన్నీ (46), బోధింప బడినది.

4. కర్మయోగ బోధ (47 నుంచి 51 వరకు)

అర్జునా ! నీకు కర్మచేయుటయందే అధికారముకాని దాని ఫలము నందు అధికారము లేదు. కర్మఫలానికి కారణుడవు కావద్దు ఫలం కోరకపోతే కర్మచేయుట ఎందుకు అని కర్మను మానేయకూడదు. (47), ఫలమునందు సంగమును విడిచి, ఆ కర్మ సఫలమైనను నిష్ఫలమైనను మనస్సును సమానంగా, నిర్వికారంగా ఉంచుకొని కర్మను చేయవలెను (48), నిష్కామ కర్మకంటె కామ్యకర్మ చాలా హీనము (49), నిష్కామకర్మ యోగి సుకృత దుష్కృతముల రెంటిని విడచి మోక్షమార్గానికి వెళ్ళుతాడు. బంధస్వభావముకల కర్మను బంధము కలుగకుండా చేయుటే కౌశలము (50), అట్టి నిష్కామ కర్మ చేయువాడు

కర్మఫలమైన బంధమును విడచి పునరావృత్తి రహితమైన మోక్షమును పొందుతాడు (51) అని బోధింపబడినది. IV కర్మయోగమునకు అవధి :- (52, 53 శ్లోకాలు)

ఇట్టి కర్మయోగము ఎంతవరకు చేయవలెనంటే (I) ప్రపంచ విషయములందు మోహము పోయేవరకు (52), అనిన్నీ (II) బుద్ధిలో ఉన్న నానాత్వము పోయి బుద్ధి గాలి లేనిచోట ఉన్న దీపంవలె కదలకుండా నిశ్చలంగా ఉండే వరకూ (53) అనిన్నీ, చెప్పబడినది. ఇట్లు బుద్ధికుండే 2 రకములైన విక్షేపములు పోతే అతడు కర్మయోగమును దాటినవాడై జ్ఞాన యోగమునకు అధికారి అగునని బోధించి ఆ పైని జ్ఞానియైన స్థితప్రజ్ఞుని లక్షణాలు బోధింప బడినవి. ఇట్లు 2వ అధ్యాయమైన సాంఖ్య యోగములో (1) ఆత్మజ్ఞానబోధ (2) దానికి సాధనమైన నిష్కామ కర్మబోధ చేయబడినవి

పంద్రెండవ కిరణము
కర్మయోగ బోధ
(గీత 3వ అధ్యాయము)

గీతలోని 3వ అధ్యాయమైన కర్మయోగములో 43 శ్లోకములున్నవి. ఈ 43 శ్లోకములలో దిగువ నుదహరించిన ప్రకారము 4 రకాల బోధ చేయబడినది.

1. నిష్ఠాద్వయబోధ –1 నుంచి 3 వరకు శ్లోకాలు.
2. కర్మయోగ బోధ – 4 నుంచి 32, 35 శ్లోకాలు.
3. దైవపౌరుషబోధ – 33 నుంచి 34 శ్లోకాలు,
4. కామజయబోధ – 36నుంచి 43 శ్లోకాలు

1. నిష్ఠాద్వయ బోధ (1 నుంచి 3 శ్లోకాలు)

గీతలోని 2వ అధ్యాయమైన సాంఖ్య యోగములో శ్రీకృష్ణ పరమాత్మయొక్క బోధ స్వరూపము. (1) ఆత్మతత్త్వబోధ లేక జ్ఞానబోధ (2) నిష్కామ కర్మబోధ లేక కర్మయోగబోధ అని ద్వివిధముగ నున్నదని లోగడ తెలిసికొన్నాము. ఈ రెండురకాల బోధలలో ఆత్మతత్త్వజ్ఞానము వల్ల కృతార్థత మోక్షప్రాప్తి అని శ్రీకృష్ణుడు బోధించి, అర్జునుని మాత్రము కర్మయోగమునే అవలంబించమని చెప్పి, అట్టి కర్మయోగమువల్ల మోక్షము ప్రాప్తించునని ఐనను చెప్పియుండలేదు. ఇంకను కర్మయోగము హింసతో కూడియున్నది. అందుచేత అర్జునునికి సంశయము కలిగి కృష్ణునితో ఆ సంశయమును 3 వ అధ్యాయము లోని మొదటి 2 శ్లోకాలలో ఈ విధంగా వ్యక్తం చేయుచున్నాడు. కృష్ణా ! కర్మయోగంకంటె జ్ఞాన యోగమే గొప్పదని చెప్పినావే, అలా అయితే నికృష్ట మైనదిన్నీ హింసారూపమైనదిన్నీ అయిన ఈ ఘోరమైన కర్మయోగాన్నే నన్ను అవలంబించమని ఎందుకు ఆజ్ఞాపించు చున్నావు ? (1) నీమాటలు నన్ను కలవరపెట్టుచున్నవా అన్నట్లుగాను, మోహపెట్టుచున్నవా అన్నట్లుగాను ఉన్నవి. కనుక కర్మజ్ఞానాలలో ఏది నాకు శ్రేయప్రదమో దానిని నాకు నిశ్చయించి చెప్పుము (2)

అని అర్జునుడు కృష్ణుని ప్రశ్న చేసినాడు. కృష్ణుని బోధలో కలవరపెట్టే స్వభావం కాని మోహ పెట్టే లక్షణం కాని ఉన్నదని అర్జునుని భావం కాదు. తాను సరిగా అర్థము చేసికోలేక పోయినందున ఆవిధంగా ఉన్నవా అన్నట్లున్నదని అర్జునుడు అన్నాడు. దానికి జవాబుగా శ్రీకృష్ణ పరమాత్మ 3వ శ్లోకమును చెప్పినాడు. 'అర్జునా ! కర్మయందు అధికారము గలవారికి కర్మనిష్ఠ, జ్ఞానమునందు అధికారము కలవారికి జ్ఞాననిష్ఠ అని ఒకేనిష్ఠ సాధ్యసాధనావస్థాభేదముచే రెండు విధములుగ కనపడుచున్నది. అని లోగడ నేను చెప్పి యున్నాను. చిత్తము శుద్ధము కానంతవరకు కర్మనిష్ఠను అనుసరించవలెను. చిత్తము శుద్ధమైన తరువాత వైరాగ్యం కలుగగా, కర్మసన్యాస మొనరించి జ్ఞాననిష్ఠను అనుసరించవలెను. అట్టి నిష్ఠచే కలిగిన ఆత్మజ్ఞానము వల్ల మోక్షము ప్రాప్తించును. కనుక జ్ఞాన యోగమునకు కర్మయోగము సాధనము. నీవు జ్ఞాననిష్ఠకు అధికారివి కావు, నీ కింకను చిత్తము శుద్ధి కావలెను. కనుక నీకు కర్మయోగమునందే అధికారము, నీవు ఆ కారణము చేత కర్మనే చేయుము, అని కృష్ణుడు నిష్ఠాద్వయమును బోధించినాడు.

2. కర్మయోగ బోధ (4 నుంచి 32 వరకు, 36 శ్లోకాలు– 30 శ్లోకాలు)

పై విధంగా కృష్ణుడు అర్జునునికి కర్మయందే అధికారము అని చెప్పి ఆ కర్మయోగమును 30 శ్లోకాలలో విపులంగా వివరించి బోధించుచున్నాడు. ఈ 30 శ్లోకాలలో కర్మయోగము 5 విధములుగా బోధించబడినది.

1. వ్యక్తిగత కర్మయోగము – 4 నుంచి 9,19,30 నుంచి 82,85 శ్లోకాలు.
2. సమిష్టి రూప కర్మయోగము – 10 నుంచి 13 వరకు శ్లోకాలు.
3. జగచ్ఛక్ర ప్రవర్తక కర్మయోగము – 14 నుంచి 16 వరకు శ్లోకాలు.
4. లోక సంగ్రహ కర్మయోగము – 20 నుంచి 26 వరకు శ్లోకాలు.
5. జ్ఞాన కర్మయోగము – 17, 18, 27, 28, 29 శ్లోకాలు.

1. వ్యక్తిగత కర్మయోగము :- (4 నుంచి 9,19,30,31,32,38 శ్లోకాలు)

అర్జునా! కర్మయోగముచే చిత్తశుద్ధి కలుగగా, కర్మసన్యాసమును గావించి, జ్ఞాన యోగమును అవలంబించవలెను. ఆత్మ ఎట్టికర్మను చేసేది కాక నిష్క్రియము కనుక, జ్ఞాననిష్ఠ అట్టి నైష్కర్మ్యస్థితి, అట్టి నైష్కర్మ్యస్థితికి కర్మ యోగమే సాధనము. కర్మలను నిష్కామంగా చేస్తేనే కర్మలను చేయకుండా ఉండే నైష్కర్మ్యస్థితి వచ్చును. కనుక కర్మలను చేయుట ఎందుకనగా, కర్మలను మానివేసేస్థితి వచ్చేటందుకే. చివరకు కర్మలను మానవలసిందే కనుక, ఇప్పుడే కర్మలను మాని వేస్తానంటావేమో, ఇప్పుడే మానివేస్తే కర్మలను మానివేసేస్థితి అసలు రానేరాదు. రోగం పోయేటందుకు ఔషధ సేవ చేస్తే రోగంపోయి, ఔషధంపుచ్చు కొనవలసిన అవసరం లేకుండా పోవును. కనుక ఔషధం సేవించుటెందుకంటే ఔషధం సేవించకండా ఉండేటందుకే. చివరకు ఔషధం సేవించనక్కర లేదు. కనుక ఇప్పుడే ఔషధం సేవించను అంటే, రోగమే పోదుకదా ! అలాగే కర్మలను చేయుట, కర్మలను మానేటందుకే కనుక అర్జునా ! కర్మలను చేస్తేనే నైష్కర్మ్యస్థితి వచ్చును కాని కర్మలను మానినందువల్ల నీకు నైష్కర్మ్యస్థితి ఎప్పటికి రానేరదు. పోనీ, సన్యాసాశ్రమ స్వీకారం చేసి కర్మలను మానివేస్తానంటా వేమో, సన్యాసాశ్రమానికి చిత్తశుద్ధి వైరాగ్యం అవసరం. కనుక అట్టి లక్షణాలు లేకుండా అనగా సన్యాసాశ్రమానికి అధికారం లేకండా సన్యసించి నట్లయితే, దాని వల్ల జ్ఞాననిష్ఠకు అధికారంరాదు. అట్టివాడు భ్రష్టుడగును. (4) ఇంకను అర్జునా ! మానవుడు ఏదో ఒక కర్మను చేయకుండా, ఒక క్షణమైనను ఉండలేడు. వాని సత్వరజస్తమాత్మకమైన ప్రకృతి వానిచేత ఏదోపనిని అవశ్యంగా చేయించును. (5) కర్మేంద్రియాలను నిరోధించి ఉదాసీనముగా నిశ్చలముగా ఉంటానంటావేమో అలా కర్మేంద్రియాలను నిరోధించినను మనస్సుతో విషయాలను స్మరించకుండా ఉండలేవు కనుక విషయాలను స్మరించుచూ ఉంటావు. అట్టిది బక ధ్యానం. అట్టివాడు దంభాచారుడు,

ఆత్మవంచకుడు, (6) అట్టి వానికంటె మనస్సుచేత జ్ఞానేంద్రియాలను నియమించి కర్మేంద్రియాలచేత కర్మయోగమును ఆచరించేవాడు ఉత్కృష్టుడు. (7) కనుక అర్జునా! ఏదో కర్మను చేయకుండా ఎవడు ఉండలేడు కనుక, అశాస్త్రీయమైన కర్మను చేయుటకంటె శాస్త్రీయమైన కర్మను చేయుము. అసలు ఏకర్మను చేయకపోతే నీకు శరీర యాత్ర కూడా జరుగదుగదా ? కనుక నీకు శాస్త్ర ప్రకారం నియమితమైన కర్మను ఫలాపేక్ష లేకుండా తప్పక చేయుము. (8). అట్టి నియమితమైన కర్మను ఈశ్వరార్పణ బుద్ధితో ఫలమునందు ఎట్టి ఆసక్తి లేకుండా చేయుము. అలా కాక ఫలాపేక్షతో చేసిన కర్మబంధక మగును కనుక నీవు నియతమైన కర్మను యజ్ఞార్థం అనగా భగవత్కర్మగా భగవత్సేవగా ఫలాపేక్ష లేకుండా చేయుము. (9) ఇట్లు అసక్తుడై విహితకర్మను భగవత్సేవగా చేస్తే క్రమేణ మోక్ష ప్రాప్తియు కలుగును. కనుక అసక్తుడవై నిష్కామకర్మయోగమును అవలంబించుము. (10) అర్జునా! ఈ కర్మయోగమును అవలంబించుటలో ఒక రహస్యమును చెప్పెదను వినుము. నేను ఈ కర్మలను ఈశ్వరుని కొరకు భృత్యునివలె చేయుచున్నాను అను వివేక బుద్ధితో అన్ని కర్మలను ఈశ్వరునికి అర్పణము చేసి, ఫలమును కోరక మమకారమును విడిచి కర్మలను చేయుము, అట్టి బుద్ధితోనే నీవిపుడు యుద్ధముకూడ చేయుము. (30) ఎవరైతే ఈ కర్మయోగమును శ్రద్ధతోను, అసూయ లేకుండాను ఆచరిస్తారో వారు కర్మబాధలనుండి విడువబడుదురు (31) అలాకాక ఎవరైతే అసూయాగ్రస్తులై ఈ కర్మయోగమును అభ్యసించరో వారు మూఢులు, అవివేకులు. అని తెలుసుకొనుము. (32) ఇంకను అర్జునా! ఈ కర్మయోగమును అభ్యసించుటలో ఒక ధర్మసూక్ష్మమున్నది. శాస్త్రీయమైన కర్మను. ఫలాపేక్ష లేకుండా చేయమన్నాను. కనుక నీవు యుద్ధమును మానివేసి చేస్తానన్న భిక్షాటనము కూడ శాస్త్రీయమే. కనుక దానిని ఎందుకు చేయరాదు అని అంటావేమో, అది కూడదు. ఎవరి వర్ణమునకు ఎవరి ఆశ్రమమునకు ఏది విహితమో ఆకర్మనే

ఫలాపేక్ష లేకుండా చేయవలెను కాని, ఇంకొక వర్ణమునకు ఇంకొక ఆశ్రమమునకు విహితమైన కర్మను చేయరాదు. ఎవరి వర్ణాశ్రమములకు శాస్త్రము ప్రకారము ఏదివిహితమో అదియే వారి స్వధర్మము. మిగతా వర్ణములకు, ఆశ్రమములకు శాస్త్ర ప్రకారము విహితమైనదే అయినను అది నీకు పరధర్మమే అగును, కనుక చేయరాదు. శాస్త్రవిహితకర్మ స్వధర్మమని పరధర్మమని రెండు విధములుగా నున్నది కనుక ఎవరి స్వధర్మకర్మను వారు ఫలాపేక్ష లేకుండచేస్తే వారికది కర్మయోగమగును. కాని పరధర్మమును ఆచరించుట కర్మయోగము కానేరదు. స్వధర్మాచరణములో కొంతలోపమున్నను అది బాగుగా అనుష్ఠింపబడిన పరధర్మాచరణము కంటే శ్రేష్ఠమైనది. శ్రేయః ప్రదమైనది అయి యున్నది. స్వధర్మాచరణము చేయుచు మరణించిననూ మేలే. అంతేకాని పరధర్మాచరణము నరకాది భయమును కలుగ చేయును, కనుక అర్జునా! నీవు క్షత్రియుడవు కనుక, నీ స్వధర్మమైన యుద్ధమును ఫలాపేక్ష లేకుండా చేయుము. అదియే నీకు నిష్కామకర్మ యోగము అయి శ్రేయఃప్రదమగును. అంతే కాని భిక్షాటనము శాస్త్రీయమే అయినను నీకు పరధర్మము. భిక్షాటనము బ్రాహ్మణజాతికి మాత్రమే స్వధర్మము. (35) ఇట్లు కృష్ణ పరమాత్మ అర్జునునకు వ్యక్తిగత కర్మయోగమును బోధించినాడు.

2. సమిష్టి రూప కర్మయోగము : – (10 నుండి 13 శ్లోకములు)

ఇంకను అర్జునా ! ప్రజాపతి ఏర్పాటు చేసిన సమిష్టి కర్మయోగము ననుసరించికూడ అధికృతులైన వారు కర్మ చేయవలెను. ఆ సమిష్టి కర్మయోగ మేమనగా, ప్రజాపతి ప్రజలను సృష్టి చేసినపుడు యజ్ఞసహితముగనే వారిని సృజించి వారితో ఈ యజ్ఞాదుల ద్వారా మీరు మీ సర్వాభీష్టములను పొందండి అని ఏర్పాటుచేసెను (10). ఈ యజ్ఞాదుల ద్వారా మీరు దేవతలను తృప్తి పరచితే దేవతలు మీ అభీష్టములను నెర వేర్చి మిమ్ములను తృప్తిపరచెదరు. ఇట్లు మీకు, దేవతలు పరస్పరము తృప్తిపరచు కొనుచు శ్రేయస్సును పొందండి

అని ప్రజాపతి ప్రజలతో చెప్పెను. కనుక అధీకృతు లైన ప్రజలు తమకు విహితమైన యజ్ఞాది కర్మములను చేసినచో దేవతలు సంతోషించి ప్రజలకు అభీప్సితములగు అన్ని భోగములను అనుగ్రహించెదరు. (11). అట్లు వారిచే అనుగ్రహింపబడిన సస్యాది భోగములను వారికి నివేదింపకుండగ భుజించినచో వారు దొంగలే అగుదురు. ప్రజలు అనుభవించు భూములు, సస్యములు, ఉదకములు, తేజస్సులు మున్నగు నవన్నియు భగవద్దత్తములే కాని ప్రజలు స్వయముగా సంపాదించినవి కావు. కనుక, అట్టివాని నన్నింటిని భగవదర్పణము చేయక స్వీయములు అని అనుభవించిన వారు దొంగలే, కదా ! (12). అట్లు కాక భగవద్దత్తము లైన వానినన్నింటిని భగవదర్పణము చేసి కత్తిపీట, పొయ్యి, సన్నికల్లు, చీపురు, నీళ్ళకడవల ద్వారా ప్రాప్తించెడు జీవహింసారూపమైన పంచ పాపములను పోగొట్టుకునేటందుకు దేవయజ్ఞము, పితృయజ్ఞము, ఋషియజ్ఞము, మనుష్యయజ్ఞము, భూతయజ్ఞము అను పంచమహాయజ్ఞముల నాచరించి మిగిలిన అన్నమును భుజించిన చో ఆ అన్నము అమృతమై, వారి సర్వపాపములను పోగొట్టును. అట్లు కాకుండా తాము వండుకున్న అన్నమును భగవన్నివేదనకు కాక తమ కొరకే వండుకున్నామని భావించి తిన్నచో వారుపాపమునే తిన్నవారగుదురు. (13) కనుక ప్రజలు ఇట్టి సమిష్టి రూప కర్మయోగమును అనుసరించవలెను అని కృష్ణుడు అర్జునునకు బోధించినాడు.

(3) జగచ్చక్రప్రవర్తక కర్మయోగము – (14 నుంచి 16 శ్లోకాలు)

ఇంకను అర్జునా ! ఏకర్మకు అధికారము కలవారు ఆ కర్మను అనుసరించితేనే జగచ్చక్రము ప్రవర్తించును. మనుష్యులు అన్నము వలన పుట్టుచున్నారు. ఆ అన్నము వర్షము వలన, ఆ వర్షము అపూర్వము వలన, ఆ అపూర్వము యజ్ఞాది రూప కర్మవలన కలుగును. ఆ కర్మ వేదప్రతిపాదితము.

ఆ వేదము పరమేశ్వరుని వలన వ్యక్తమైనది, మనుష్యులు అధికృతులయి ఆయాకర్మల నాచరించినచో అపూర్వము, వర్షము, అన్నము, మనుష్యులు కలుగుదురు. ఇట్టి జగచ్చక్ర ప్రవర్త కర్మను అనుసరించియైనను అర్జునా ! కర్మ చేయవలెను అని కృష్ణుడు బోధించెను (14, 15, 16 శ్లోకాలు)

(4) లోక సంగ్రహ కర్మయోగము (20-26 శ్లోకాలు)

మరియు అర్జునా ! జనకాదిక్షత్రియులు జ్ఞానులైనను లోక సంగ్రహము కొరకు, అనగా లోకముయొక్క ఉన్మార్గ ప్రవృత్తి నివారణ కొరకై సన్యసించకుండా కర్మల చేయుచునే సిద్ధిని పొందిరి. నీవును క్షత్రియుడవు కనుక అట్టి జనకాదులను అనుసరించియైనను లోకసంగ్రహార్థము కర్మలను చేయుము. (20) లోకములో శ్రేష్ఠుడైనవాడు దేనిని ఆచరించునో దానినే ఇతరులందరు ఆచరింతురు. అట్టి శ్రేష్ఠుడు దేనిని ప్రమాణముగా స్వీకరించునో, ఇతరులును దానినే ప్రమాణముగా స్వీకరించెదరు. (21) ఇంకను అర్జునా! నాకు మూడు లోకములలోనూ కూడా చేయతగిన కర్మయు ఏదియును లేదు. నాకు పొందబడనిది కాని, పొందతగినది కాని ఏదియును లేదు. అయినను నేను కర్మలను చేయుచున్నాను కదా ! (22) నేనే కనుక అలసుడనై ఒకానొకప్పుడైనను కర్మలను చేయనిచో అజ్ఞులగు మనుష్యులు సర్వవిధముల చేత నన్నే అనుసరించి వారును కర్మలను మాని వేయుదురు. (23) అట్లు నేను కర్మలను మానినందువల్ల ప్రజలు కూడ కర్మలను మానుట సంభవించినచో వారందరు చెడిపోవుదురు. అట్టి వారి సాంకర్యమునకు నేను కర్తను కావలసివచ్చును. వారినందరిని నశింప చేయువాడనగుదును. (24) ఇంకను జ్ఞానులైనవారు కర్మలను ఏవిధముగా చేయవలెనంటే అజ్ఞానులు ఆసక్తి కలవారై ఏవిధముగా కర్మలను చేయుదురో, జ్ఞానులు అట్టి ఆసక్తి మాత్రము లేకుండా ఆవిధముగానే లోక సంగ్రహము కొరకు కర్మలను చేయవలెను. (25) కర్మలందు ఆసక్తి గల అజ్ఞానులకు 'నాకిది కర్తవ్యము, దీని ఫల

మనుభవింపతగినది’ అను బుద్ధి ఉండును. జ్ఞానియైన వాడు అజ్ఞానులకున్న అట్టిబుద్ధిని చలింప చేయరాదు. మరియు అట్టి అజ్ఞానులకు ఆ కర్మలందు శ్రద్ధను ప్రీతిని జనింప చేయుచూ, జ్ఞానియైన వాడు తాను సావధాన మనస్కుడై ఆకర్మలను తాను స్వయముగా చేయుచు ఆ అజ్ఞానులచే కర్మలను చేయించవలెను. (26) ఇట్టి లోక సంగ్రహ కర్మలను అనుసరించియైనను అర్జునా ! నీవు కర్మను చేయవలెను, అని కృష్ణుడు బోధించెను.

5. జ్ఞాని కర్మయోగము (17, 18, 27, 28, 29 శ్లోకాలు)

ఇట్లు పైన తెలియపర్చిన నాలుగు విధాలుగా కూడా కర్మ అవశ్యకర్తవ్యమైతే, అందరు అనుసరించి తీరవలెనేగదా, అని అర్జునుని ప్రశ్నను ఆశంకించుకొని, కృష్ణ పరమాత్మ ఈ విధంగా జవాబు చెప్పుచున్నాడు. ఆత్మజ్ఞానము కలవారికి ఈకర్మ అనుసరణీయము కాదు. ఆత్మజ్ఞానము లేకుండా జగత్తు సత్యమనిన్నీ జగత్తులోని విషయాలలో ఆనందము ఉన్నదనిన్నీ భావించు అజ్ఞానులు తప్పక కర్మయోగమును అనుసరించి తీరవలెను. అట్టి కర్మయోగానుష్ఠానమువల్ల చిత్తశుద్ధి కలిగితే ప్రపంచమునందు వైరాగ్యము కలుగగా సన్యసించి, గురువుయొద్దకు వెళ్ళి, శ్రవణ మనన ధ్యానాదులచే ఆత్మజ్ఞానము కలవారగుదురు. ఆత్మ సచ్చిదానందమై సర్వ వ్యాపకమైనది కనుక అట్టి ఆత్మయందే రతి, తృప్తి, సంతుష్టి రూప ఆనందమును సంపూర్తిగా అట్టి ఆత్మజ్ఞాని అనుభవించును. వానిదృష్టిలో ప్రపంచము వేరుగా లేదు ఉన్నదంతా ఆత్మయే, ప్రపంచము వస్తుత్వము లేకుండా కనపడుట మాత్రమే లక్షణముగా గలది కనుక మిథ్య, ప్రపంచము సత్యము. ఆనందదాయకము అనుకొనువారికే కర్మానుష్టానము అవసరము, అజ్ఞానులు భార్యవల్ల రత్యానందమును, భోజనాదులవల్ల తృప్త్యానందమును, ఇతర సంపదల వల్ల సంతుష్ట్యానందమును పొందుతున్నామని అనుకొనురేకాని ఆమూడు రకాల ఆనందములు. కూడ వాస్తవములో ఆత్మానందమే, అది ఆయా విషయముల ద్వారా

వ్యక్తమగు చుండగా, ఆయా విషయములే ఆనందమును ఇచ్చుచున్నవని అజ్ఞానులు భ్రమపడుచున్నారు. విషయానందము అనిత్యమై సోపాధికమై సాతిశయముగ నుండగా, ఆత్మానందము నిత్యమై, నిరుపాధికమై, నిరతిశయమై విరాజిల్లు చున్నది. అట్టి నిత్యమైన ఆత్మానందమును అనుభవించు ఆత్మజ్ఞానులు చేయతగిన కర్మము ఏదియు లేదు. ఆనందము లేనివారికి తదర్ధమై కర్మ అవసరము కాని, ఆనందము నిత్యానుభవములో నున్న జ్ఞానులకు ఏవిధమైన కర్మ అవసరము లేదు (17) అట్టి జ్ఞానికి కర్మచేస్తే వచ్చే ప్రయోజనం లేదు. కర్మ చేయకపోతే వచ్చే ప్రత్యవాయము లేదు. ఏదోయొక భూత విశేషము నాశ్రయించి సాధింపతగిన ప్రయోజన మేదియు ఆత్మరతుడగు జ్ఞానికి లేదు. (18) కాని ఆత్మజ్ఞానులు కూడా కొన్ని పనులు చేయుచున్నట్లు కనపడుతారే అంటే పైన చెప్పినట్లుగా సచ్చిదానంద సర్వవ్యాపక మైన ఆత్మస్వరూపమును సాక్షాత్కరించుకొన్న ఆత్మజ్ఞానులకు చేయతగిన దేమియు లేదు కనుక వారు ఏమి చేయుట లేదు. కానీ చేస్తున్నట్లు మనకు కనపడుచున్నారే అంటే వారి ఇంద్రియములు ఆయా విషయాలలో ప్రవర్తిస్తుంటే, వారు ఆయా పనులు చేస్తున్నారని మనము అనుకొనుచున్నాము. కన్ను చూస్తున్నది. చెవి వింటున్నది. అంతేకాని నేను చూచుట లేదు. వినుట లేదు అను జ్ఞానము వారికి ఉంటుంది. అందు చేత వారు చేస్తున్నట్లు కనపడే కర్మ నిజంగా కర్మకాదు. కర్తృత్వ బుద్ధితోనూ, ఫలాసక్తి తోనూ చేసేది కర్మఅవుతుంది కాని, కర్తృత్వబుద్ధి లేక, ఫలాసక్తి లేక ఇంద్రియాలు విషయాలలో ప్రవర్తిస్తున్నపుడు మనకు కర్మగా కనపడిననూ అది కర్మకాదు. అది కర్మాభాస లేక ఆభాసకర్మ, కర్మవలె కనపడునది కనుక జ్ఞానియొక్క కర్మ ఆభాసకర్మమేకాని కర్మకాదు (28). యధార్ధ మిట్లుండగా దేహమే నేను అను దేహ భ్రాంతికల అజ్ఞాని ఇంద్రియాలు చేస్తున్న పనులను తానే చేస్తున్నానని భ్రాంతిపడును. (27) అట్టి దేహాత్మ బుద్ధికలిగి ఆత్మజ్ఞాన శూన్యులగు కర్మసంగులను, ఆత్మజ్ఞానము కలవాడు బుద్ధి భేధమును కలుగ

చేయరాదు, అనగా కర్మలతో నేమి ప్రయోజనము లేదు అని వారికి కర్మలందుగల శ్రద్ధాపూర్వకమగు బుద్ధిని తొలగింపరాదని భావము (28) ఈ విధముగా శ్రీకృష్ణ పరమాత్మ అర్జునునకు కర్మ యోగమును ఐదు విధములుగా బోధించినాడు.

(3) దైవ పౌరుష బోధ (33, 34 శ్లోకములు)

జ్ఞాన యోగము ఉపేయముగను, దానికికర్మయోగము ఉపాయముగను ఈవిధముగా మోక్షమునకు చక్కని రాజ మార్గము ఏర్పాటయి. యుండగా, అందరు అట్టి మార్గమును అవలంబించి, సాధనమైన కర్మయోగమును ఎందుకు అనుసరించి మోక్షమును పొందుట లేదు అను శంకను తొలగించుటకుగాను కృష్ణ పరమాత్మ దైవ పౌరుషముల విచారణను ఈ 33, 34 శ్లోకములలో గావించుచున్నాడు. సాధారణముగ ప్రతిమానవుడును పూర్వజన్మకర్మ ననుసరించి ప్రవర్తించు చుండును. 'బుద్ధిః కర్మానుసారిణీ' అను ప్రమాణము ప్రకారము ఈ జన్మలో ఏ కార్యమునైనను చేయుటకు పూర్వ జన్మకర్మానుసారమే బుద్ధి పుట్టును కాని అన్యథా కాదు. అట్టి పూర్వజన్మ కర్మసంస్కారము ప్రకృతి యనబడును. ఎంత జ్ఞానియైనను అట్టి ప్రకృతి ననుసరించి యే ప్రవర్తించు చుండును. అట్టి ప్రకృతిని నిగ్రహించుట ఆత్మవేత్తకు గూడ శక్యము కానిచో మూఢులు తప్పక ప్రకృతి ననుసరించెదరు అని వేరుగా చెప్పనక్కర లేదు. అందుకు భిన్నముగా ఎవరి నిగ్రహము కాని, బోధ కాని ఏమి చేయ లేదు. అందు చేత మోక్షమునకు చక్కని రాజమార్గము ఏర్పడియుండినను ప్రాగ్జన్మీయ సంస్కార బలముచే అట్టి మార్గమును అనుసరించరు (33) ఇట్టి ప్రకృతినే దైవమని అంటారు. దైవమనగా పూర్వజన్మకర్మమే. ఇట్లు ప్రతిమానవుడు ప్రకృతి ననుసరించియే ప్రవర్తించేయెడల పురుష ప్రయత్నమునకు అవకాశమే లేదు కావున 'ఈపనిని చేయుము, ఆపనిని చేయవద్దు అని విధినిషేధాత్మకమైన వేదశాస్త్రములు వ్యర్థములే అగును కదా అను శంకను తొలగించుటకుగాను 34 వ శ్లోకము చెప్పబడినది.

మానవునియొక్క ప్రకృతి సంస్కారరూపమే కనుక అట్టి సంస్కారము ననుసరించి ఏదో ఒక వస్తువుయందు రాగమో, ద్వేషమో కలుగును. అట్టి రాగ ద్వేష సంబంధమైన బుద్ధి ననుసరించియే మానవుడు సాధారణముగా ప్రవర్తించును. అట్టి రాగద్వేష సంబంధమైన బుద్ధి కలిగినంత మాత్రాన దాని ననుసరించి ప్రవర్తించి తీరవలెను అను నియమము లేదు. ఆబుద్ధి మంచిదే అయినచో దానిని అనుసరించుటకును మంచిది కానిచో దానివశము కాకుండా నిగ్రహించుటకును మానవునికి పురుష కారము, స్వాతంత్ర్యము ఉన్నది. దీనికొక ఉదాహరణము చూడుడు. ఏమియు మొక్కలు లేని దొడ్లో మంచి వర్షము కురిసినచో అనేకరకములైన మొక్కలు పైకి లేచును. అట్లు ఆ మొక్కలు లేవకుండా మనము చేయ లేము. కాని ఆ మొక్కలు లేచిన తరువాత వానిని పరిశీలించి వానిలో ఉన్న పనస మామిడి మున్నగు మంచి మొక్కలను వృద్ధి చేసుకొనుటకును, పల్లేరు, తుమ్మ మున్నగు చెడ్డ మొక్కలను పీకి వేయుటకును మనకు స్వాతంత్ర్యము ఉన్నది కదా ! అలాగే మనకు పూర్వజన్మ కర్మ ననుసరించి అనేక రకములైన బుద్ధులు రాగ ద్వేషపురస్సరముగ పుట్టును. అట్టి బుద్ధులను పుట్టకుండా మనము చేయ లేము. కాని పుట్టిన బుద్ధులలో మంచివానిని వృద్ధి చేయుటకును, దుష్టమైన వానిని నిగ్ర హించుటకును మనకు స్వాతంత్ర్యము కలదు. దీనినే పురుష కారము అని పౌరుషమని అంటారు. కనుక కృష్ణపరమాత్మ ఈ 34 వ శ్లోకములో ఆ రాగ ద్వేషములు శ్రేయోమార్గమునకు విఘ్నకర్తలు కనుక వానికి వశము కాకుండా పౌరుషమును ఉపయోగించు కొనవలెను అని బోధించినాడు (34) ఇంకను ఈజన్మలో మనకు ప్రకృతిగా నుండి ఆయా విషయములందు రాగమునో, ద్వేషమునో పుట్టించిన శక్తి ఈజన్మకు అది కర్మఫలమే అయినను ఆ పూర్వపు జన్మలో అదికూడ పురుష ప్రయత్నమే, పూర్వ జన్మలోని పురుష ప్రయత్నము ఈజన్మకు కర్మగాను, ప్రకృతిగాను అయి మనలను ప్రవర్తింప చేయుచున్నది, కనుక

ఉన్నదంతయు పురుష ప్రయత్నమే కాని వెనుకటి జన్మలోని పురుష ప్రయత్న వేగము అనగా, జన్మాంతరీయ కర్మ వేగము ఎంత ఉన్నదో మనకు దెలియక పోవుట చేత, మనము ఈ జన్మలో దానిని నిగ్రహించుటకు ఎంత వేగము గల పురుష ప్రయత్నము చేయవలెనో తెలియుట లేదు, మనము ఇప్పుడు చేసే పురుష ప్రయత్నం వెనుకటి కర్మ వేగముకంటె బలహీనమైనచో మనము జయించ లేకున్నాము. అంతకంటే బలవత్తరమైతే నిగ్రహించుచున్నాము. ఇట్లు మార్కండేయులు, సావిత్రి, విశ్వామిత్రుడు తమతమ పూర్వజన్మ కర్మఫలములను తమతమ ప్రబలమైన పురుష ప్రయత్నములచే దాటగలిగినారు. అట్టి ప్రబలమైన పురుష ప్రయత్నమును చేయనిచో ప్రకృతికి వశులైపోతారు అని ఇట్లు శ్రీకృష్ణ పరమాత్మ దైవ పౌరుషములను గురించి ఈ 33, 34 శ్లోకాలలో విశదీకరించారు.

(4) కామజ బోధ :- (36 నుంచి 43 వరకు శ్లోకాలు)

ఇట్టి బోధను విని అర్జునుడు, ప్రకృతికి వశమై అనర్థములకు పాల్పడ కుండ ఆ అనర్థములకు కారణమును, అనర్థమును జయించుటకు ఉపాయమును తెలిసికొనగోరి, పురుషుడు పాపాచరణమునందు ఇష్టము లేనివాడైనను, రాజుచే నియోగింపబడిన భృత్యునివలె దేనిచే నియోగింపబడి పాపకర్మల నాచరించుచున్నాడు? అని కృష్ణుని ప్రశ్నించినాడు. (36) దీనికి కృష్ణపరమాత్మ ఈ క్రింది విధముగా జవాబు చెప్పుచున్నాడు. అర్జునా ! దేనివలన మానవునికి సర్వానర్థములు ప్రాప్తించుచున్నవో అవి రజోగుణసముద్భవమైన ఈ కామము ఈ క్రోధమే. కామమే ప్రతిహతమైతే క్రోధముగ మారును. కనుక సర్వానర్థములకు మూలము కామమే ఈ కామము ఎంతటి భోగము తోనూ తృప్తి కాదు. మహా పాపి కనుక ప్రతి మానవునికిని ప్రబల శత్రువు ఈ కామమే. (37) పొగ నిప్పును ఆవరించినట్లుగాను, మాలిన్యము అద్దమును ఆవరించినట్లుగాను, మావి గర్భంలోని పిండమును ఆవరించినట్లుగాను, ఈ కామము జ్ఞానమును

ఆవరించును. (38). ఇట్టి దుష్టమైన కామముచే జ్ఞానము ఆవరించబడినది. ఈ కామము జ్ఞానికి మాత్రమే నిత్యశత్రువు. అజ్ఞానులకు ఈ కామము ఆరంభములో మిత్రునివలె ఉండి చివరకు అనర్థము వాటిల్లి నప్పుడు శత్రువుగా అగును. కనుక అజ్ఞానులకు నిత్య శత్రువు కాదు. జ్ఞాని దీని అనర్థ స్వరూపమును మొదటి నుండియు ఎరిగిన వాడు కనుక దీనిని నిత్యశత్రువుగా తెలిసికొని జాగ్రత్తగా నుండి దీనికి వశముకాడు (39) ఇట్లు కామము శత్రువైతే దీనిని జయించుటకు దీని ఆశ్రయమేదో తెలిసి కొనవలెను కనుక, దీనికి ఆశ్రయము ఇంద్రియాలు, మనస్సు బుద్ధి అని కృష్ణుడు చెప్పి, వీని ద్వారా కామము జ్ఞానమును కప్పిపుచ్చి ప్రతిజీవుని అనేక విధములుగ మోహ పెట్టి అనర్థముల పాలు చేయుచున్నది (40), అని బోధించి 'అర్జునా! నీవు ప్రప్రథమముగా ఇంద్రియములను స్వాధీన మొనరించుకొని, జ్ఞాన విజ్ఞానములను నశింప చేయు పాపభూయిష్టమైన ఈ కామమును బాగా జయింపుము (41), స్థూలమైన దేహము కంటె సూక్ష్మములైన ఇంద్రియములు ఉత్కృష్టములు. ఇంద్రియములకంటె మనస్సు ఉత్కృష్టము మనస్సుకంటె బుద్ధి ఉత్కృష్టము ఇట్లు బుద్ధివరకు ఉన్న అన్ని దృశ్యముల కంటె ఉత్కృష్టమైనది ద్రష్టయగు పరమాత్మ (42) అని విశదీకరించి ఓ అర్జునా ! ఇట్లు ఆత్మయొక్క ఉత్కృష్టమైన స్థితిని తెలిసికొని శమదమాదులచే సంస్కృతమైన మనస్సుచే నీకు ప్రబలశత్రువైన ఈ కామమును జయింపుము అని కృష్ణుడు అర్జునుని హెచ్చరించినాడు (43). ఇట్లు సర్వానర్థములకు కారణము కామము అని చెప్పి అట్టి కామమును జయించుటకు ఉపాయము కృష్ణ పరమాత్మ ఈ విధంగా బోధించినాడు. ఇట్లు జ్ఞాననిష్ఠకు ఉపాయభూతమైన కర్మనిష్ఠ అను కర్మయోగము గీతలోని 3వ అధ్యాయములో వివరింపబడినది.

శ్రీ మ ద్భ గ వ ద్గీ త

ప్రథమాధ్యాయము

ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః
మామకాః పాండవాశ్చైవ కిమకుర్వత సంజయ ॥ 1
దృష్ట్వాతు పాండవానీకం వ్యూఢం దుర్యోధన స్తదా
ఆచార్యముపసంగమ్య రాజా వచనమబ్రవీత్ ॥ 2
పశ్యైతాం పాండుపుత్రాణామాచార్య మహతీం చమూం
వ్యూఢాం ధ్రుపదపుత్రేణ తవ శిష్యేణ ధీమతా ॥ 3
అత్ర శూరా మహేష్వాసా భీమార్జునసమాయుధి
యుయుధానో విరాటశ్చ ధ్రుపదశ్చ మహారథ ॥ 4
ధృష్ట కేతు శ్చేకి తానః కాశి రాజశ్చ వీర్యవాన్
పురుజిత్కుంతి భోజశ్చ శైబ్యశ్చ నరపుంగవః ॥ 5
యుధామన్యుశ్చ విక్రాంత ఉత్తమౌజశ్చ వీర్యవాన్
సౌభద్రో ద్రౌపదేయాశ్చ సర్వ ఏవ మహారథాః ॥ 6
అస్మాకం తు విశిష్టా యే తాన్నిబోధ ద్విజోత్తమ
నాయకా మమ సైన్యస్య సంజ్ఞార్థం తాన్ బ్రవీమి తే ॥ 7
భవాన్ భీష్మశ్చ కర్ణశ్చ కృపశ్చ సమితింజయః
అశ్వత్థామా వికర్ణశ్చ సౌమదత్తి స్తథైవ చ ॥ 8
అన్యే చ బహవశ్శూరా మదర్థే త్యక్తజీవితాః
నానాశస్త్ర ప్రహరణా స్సర్వే యుద్ధవిశారదాః ॥ 9
అపర్యాప్తం తదస్మాకం బలం భీష్మాభి రక్షితం
పర్యాప్తం త్విదమే తేషాం బలం భీమాభిరక్షితం ॥ 10

ఆయనేషు చ సర్వేషు యథా భాగమవస్థితాః
భీష్మమేవాభిరక్షంతు భవంతస్సర్వ ఏవ హి ॥ 11
తస్య సంజనయన్ హర్షం కురువృద్ధః పితామహః
సింహనాదం వినద్యోచ్చైశ్శంఖందధ్మౌ ప్రతాపవాన్ ॥ 12
తతశ్శంఖాశ్చ భేర్యశ్చ పణవానక గోముఖాః
సహసైవాభ్యహన్యంత స శబ్దస్తుములో ఽభవత్ ॥ 13
తతశ్శ్వేతైర్హయైర్యుక్తే మహతి స్యందనే స్థితౌ
మాధవః పాండవశ్చైవ దివ్యౌ శంఖౌ ప్రదధ్మతుః ॥ 14
పాంచజన్యం హృషీ కేశో దేవదత్తం ధనంజయః
పౌండ్రం దధ్మౌ మహాశంఖం భీమకర్మా వృకోదరః ॥ 15
అనంతవిజయం రాజా కుంతీపుత్రో యుధిష్ఠిర ః
నకులస్సహదేవశ్చ సుఘోషమణి పుష్పకౌ ॥ 16
కాశ్యశ్చ పరమేష్వాస శ్శిఖండీ చ మహారథః
ధృష్టద్యుమ్నో విరాటశ్చ సాత్యకిశ్చా పరాజితః ॥ 17
ద్రుపదో ద్రౌపదేయాశ్చ సర్వశః పృథివీపతే
సౌభద్రశ్చ మహాబాహు శృంఖాన్ దధ్ముఃపృథక్పృథక్ ॥ 18
సఘోషో ధార్తరాష్ట్రాణాం హృదయాని వ్యదారయత్
నభశ్చ పృథివీం చైవ తుములోఽ వ్యనునాదయన్ ॥ 19
అథ వ్యవస్థతాన్ దృష్ట్వా ధార్తరాష్ట్రాన్ కపిధ్వజః
ప్రవృత్తే శస్త్రసంపాతే ధనురుద్యమ్య పాండవః ॥ 20
హృషీ కేశం తదా వాక్యమిదమహ మహీపతే
సేన యోరుభ యోర్మధ్యే రథం స్థాపయ మేఽచ్యుత ॥ 21
యావదేతాన్ని రీక్షే ఽహం యోద్ధుకామానవస్థితాన్
కైర్మయా సహ యోద్ధవ్యమస్మిన్ రణసముద్యమే ॥ 22

యోత్స్యమానానవేక్షేఽహం య ఏతేఽత్రసమాగతాః
ధార్తరాష్ట్రస్య దుర్బుద్ధేర్యుద్ధేప్రియచికీర్షవః ॥ 23
ఏవముక్తో హృషీకేశో గుడా కేశేన భారత
సేనయోరుభయోర్మధ్యే స్థాపయిత్వరథోత్తమం ॥ 24
భీష్మద్రోణప్రముఖతస్స ర్వేషాం చ మహిక్షితాం
ఉవాచ పార్థ పశ్యైతాన్ సమవేతాన్ కురూనితి ॥ 25
తత్రాపశ్యస్థితాన్ పార్థః పితౄనథ పితామహాన్
ఆచార్యాన్ మాతులాన్ భాతౄన్ పుత్రాన్ పౌత్రాన్ సఖీం స్తథా ॥ 26
శ్వశురాన్ సుహృదశ్చైవ సేనయోరుభయోరపి
తాౕ సమీక్ష్య స కౌంతేయ స్సర్వాన్ బంధూసవస్థితాన్ ॥ 27
కృపయా పరయావిష్టో విషీదన్నిదమబ్రవీత్
దృష్ట్వేమం స్వజనం కృష్ణయుయుత్సుంసముపస్థితంః ॥ 28
సేదంతి మమ గాత్రాణి ముఖం చ పరిశుష్యతి
నేపథుశ్చ శరీరే మే రోమహర్షశ్చ జాయతే ॥ 29
గాండీవం స్రంసతే హస్తాత్ త్వ క్చైవ పరిదహ్యతే
న చ శక్నోమ్యవస్థాతుం భ్రమతీవ చ మే మనః ॥ 30
నిమిత్తాని చ పశ్యామి విపరీతాని కేశవ
నచ శ్రేయోఽనుపశ్యామి హత్వా స్వజనమాహవే ॥ 31
న కాంక్షే విజయం కృష్ణ న చ రాజ్యం సుఖాని చ
కింనో రాజ్యేన గోవింద కిం భో గైర్జీవి తేన వా ॥ 32
యేషామర్థే కాంక్షితంనో రాజ్యం భోగాస్సుఖానిచ
తఇమేఽవస్థితా యుద్ధే ప్రాణాం స్త్యక్త్వాధనానిచ ॥ 33
ఆచార్యాఃపితరః పుత్రా స్తథైవ చ పితామహాః
మాతులాశ్శ్వశురాః పౌత్రాశ్యాలాస్సంబంధిన స్తథా ॥ 34

ఏతాన్న హంతుమిచ్ఛామిఘ్నతోఽపి మధుసూదన
అపి త్రైలోక్య రాజ్యస్య హేతోః కింనుమహీకృతే ॥ 35
నిహత్య ధార్తరాష్ట్రాన్నః కాప్రీతిస్స్యాజ్జనార్దన
పాపమేవాశ్రయేదస్మాన్ హత్వైతానాత తాయినః ॥ 36
తస్మాన్నార్హావయం హంతుం ధార్తరాష్ట్రాన్ స్వబాంధవాన్
స్వజనం హి కథం హత్వా సుఖినస్స్యామ మాధవః ॥ 37
యద్య ప్యే తే పశ్యంతి లోభోపహత చేతసః
కులక్షయకృతం దోషం మిత్రదోహే చ పాతకం ॥ 38
కథం న జ్ఞేయమస్మాభిః పాపాదస్మాన్ని వర్తితుం
కులక్షయకృతం దోషం ప్రవశ్యద్భిర్జనార్దన ॥ 39
కులక్షయే ప్రణశ్యంతి కులధర్మా స్సనాతనాః
ధర్మే నష్టే కులం కృత్స్న మధర్మోఽభిభవత్యుత ॥ 40
అధర్మాభిభవాత్కృష్ణ ప్రదుష్యంతి కులస్త్రియః
స్త్రీషు దుష్టాసు వార్ష్ణేయ జాయతే వర్ణసంకర ॥ 41
సంకరో నరకాయైవ కులఘ్నా నాం కులస్యచ
పతంతి పితరో హ్యేషాం లుప్తపిండోదక క్రియాః ॥ 42
దోషై రేతైః కులఘ్నానాం, వర్ణసంకరకార కైః
ఉత్సాద్యంతే జాతిధర్మాః కులధర్మాశ్చ శాశ్వతాః ॥ 43
ఉత్సన్నకులధర్మాణాం మనుష్యాణాం జనార్ధన
నరకేఽనియతం వాసో, భవతీత్యనుశుశ్రుమ ॥ 44
అహో బత మహత్పాపం, కర్తుం వ్యవసితా వయం
యద్రాజ్య సుఖలోభేన, హంతుం స్వజన ముద్యతాః ॥ 45
యది మామప్రతీకార మశస్త్రం శస్త్రపాణయః
ధార్తరాష్ట్రా రణే హన్యుస్తన్మే క్షేమతరం భవేత్ ॥ 46

ఏవముక్త్వార్జునస్సంఖ్యే రథోపస్థ ఉపావిశత్
విసృజ్య సశరం చాపం శోకసంవిగ్నమానసః ॥ 47

ద్వితీయాధ్యాయము

తం తథా కృపయావిష్టం అశ్రుపూర్ణాకు లేక్షణం,
విషీదంత మిదం వాక్యమువాచ మధుసూదనః ॥ 1
కుతుస్త్వా కశ్మల మిదం విషమే సము పస్థితం
అనార్యజుష్టమస్వర్గ్యమకీర్తికర మర్జున ॥ 2
క్లైబ్యం మాస్మగమః పార్థనై తత్త్వయ్యుపపద్యతే
క్షుద్రం హృదయదౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరంతప ॥ 3
కథం భీష్మమహం సంఖ్యే ద్రోణంచ మధుసూదన
ఇషుభిః ప్రతియోత్స్యామి పూజార్హావరిసూదన ॥ 4
గురూ సహత్వా హి మహానుభావాన్ శ్రేయో భోక్తుం భైక్షమపీహ లోకే
హత్వాఽర్థకామాంస్తు గురూని హైవ భుంజీయ భోగాస్ రుధిర ప్రదిగ్ధాన్ ॥ 5
న చైతద్విద్మః కతరన్నో గరీయో యద్వాజయేమ యది వా నో జయేయుః
యా నేన హత్వాన జిజీవిషామ స్తేఽవస్థితాః ప్రముఖే ధార్తరాష్ట్రాః ॥ 6
కార్పణ్యదోషోపహత స్వభావః పృచ్ఛామి త్వాం ధర్మసంమూఢ చేతాః
యచ్ఛ్రేయస్స్యాన్నిశ్చితం బ్రూహి తన్మేశిష్యస్తేఽహం శాధి మాం త్వాం ప్రసన్నం ॥ 7
న హి ప్రపశ్యామి మమాపనుద్యా ద్య చ్ఛోకముచ్ఛోషణమింద్రియాణాం
అవాప్య భూమావసపత్న మృద్ధం రాజ్యం సురాణామపీ చాధిపత్యం ॥ 8
ఏవముక్త్వా హృషీ కేశంగుడా కేశః పరంతపః
నయోత్స్య ఇతి గోవిందముక్త్వా తూష్ణీంబభూవహ ॥ 9
తమువాచ హృషీ కేశః ప్రహసన్నివ భారత
సేనయోరుభ యోర్మధ్యే విషీదంతమిదం వచః ॥ 10
అశోచ్యానస్వశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే

గతాసూనగతా సూంశ్చ నానుశోచంతి పండితాః ॥ 11
న త్వే వాహం జాతునానం నత్యం నే మేజనాధిపాః
న చైవ న భవిష్యామస్స ర్వే వయ మతః పరం ॥ 12
దేహినోఽస్మిన్యథాదేహే కౌమారం యౌవనం జరా
తథా దేహాంతర ప్రాప్తిర్ధీరస్తత్ర నముహ్యాతి ॥ 13
మాత్రాస్పర్శాస్తు కౌంతేయశీతోష్ణ సుఖదుఃఖదాః
ఆగమాపాయినో నిత్యాస్తాం స్తితీక్షస్వ భారత ॥ 14
యం హి నవ్యథయం త్యే తే పురుషం పురుషర్షభ
సమదుఃఖసుఖం ధీరం సోఽమృతత్వాయ కల్పతే ॥ 15
నాసతో విద్యతే భావో నాభావో విద్యతే సతః
ఉభ యోరపి దృష్టోఽత స్త్వనయో స్త వ్తత్తదర్శిభిః ॥ 16
అవినాశి తు తద్విద్ధి యేన సర్వమిదంతతం
వినాశమవ్యయస్యాస్య న కశ్చిత్ కర్తుమర్హతి ॥ 17
అంతవంత ఇ మే దేహా నిత్యస్యోక్తాశ్శరీరిణః
అనాశినోఽప్రమేయస్య తస్మాద్యుధ్యస్వ భారత ॥ 18
య ఏనం వేత్తి హంతారంయశ్చైనం మన్య తేహతం
ఉభౌ తౌ న విజానీతో నాయం హంతి న హన్యతే ॥ 19
న జాయతే మ్రియతే వా కదాచి న్నాయం భూత్వాభవితా వా న భూయః
అజో నిత్యశ్శాశ్వతోఽయం పురాణో నహన్యతే హన్యమా నే శరీ రే ॥ 20
వేదావినాశినం నిత్యం య ఏనమజమవ్యయం
కథం స పురుషః పార్థ కం ఘాతయతి హంతి కం ॥ 21
వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరోఽపరాణి
తథా శరీరాణి విహాయ జీర్ణా న్యన్యాని నంయాతి నవాని దేహీ ॥ 22
నైనం ఛిందంతి శస్త్రాణి నైనం దహతి పావకః

న చైనం క్లేదయంత్యాపో న శోషయతి మారుతః ॥ 23
అచ్ఛేద్యోఽయ మదాహ్యోఽయ మక్లేద్యోశోష్య ఏవ చ
నిత్యస్సర్వగతః స్థాణుర చలోఽయం సనాతనః ॥ 24
అవ్యక్తోఽయమదీంత్యోఽయ మవికార్యోఽయ ముచ్యతే
తస్మా దేవం విదిత్వైనం నానుశోచితు మర్హసి ॥ 25
అథ చైనం నిత్యజాతం నిత్యం వా మన్యసే మృతం
తథాపి త్వం మహా బాహో నైవం శోచితుమర్హసి ॥ 26
జాతస్య హి ధ్రువో మృత్యుర్ధ్రువం జన్మమృతస్యచ
తస్మాదపరిహార్యాఽర్థేన త్వం శోచితుమర్హసిః ॥ 27
అవ్యక్తాదీని భూ తాని వ్యక్తమధ్యాని భారత
అపక్తనిధనాన్యేవ తత్ర కా పరి వేదనా ॥ 28
ఆశ్చర్యవత్పశ్యతి కశ్చిదేన మాశ్చర్యవద్వదతి త ధైవ చాన్యః
ఆశ్చర్యవచ్చై నమన్యశ్శృణోతి శ్రుత్వాప్యేనం వేద న చైవ కశ్చిత్ ॥29
దేహీ నిత్యమవధ్యోఽయం దేహే సర్వస్య భారత
తస్మాత్సర్వాణి భూతాని న త్వం శోచీతు మర్హసి ॥ 30
స్వధర్మమపి చావేక్ష్య న వికం పితుమర్హసి,
ధర్మాద్ధి యుద్ధాచ్ఛేయోఽన్యత్ నక్షత్రియస్య నవిద్యతే ॥ 31
యదృచ్ఛ యా చోపపన్నం స్వర్గద్వారమపావృతం
సుఖినః క్షత్త్రియాః పార్ధ లభం తే యుద్ధమిదృశం ॥ 32
అథ చేత్త్వం మిమం ధర్మం సంగ్రామం న కరిష్యసి
తత స్స్వధర్మం కీర్తించ హిత్వా పాపమవాప్స్యసి ॥ 33
అకీర్తిం చాపీ భూతాని కథ యిష్యంతి తేఽవ్యయాం
సంభావితస్య చాకీర్తిర్మరణాదతిరిచ్యతే ॥ 34

భయాద్రణాదుపరతం మంస్యం తే త్వాంమహారథాః
యేషాం చత్వం బహుమతోభూత్యాయాస్యసి లాఘవం ॥ 35
అవాచ్యవాదాంశ్చ బహూనదిష్యంతితత వాహితాః
నిందంత స్తవ సామర్థ్యం తతో దుఃఖతరన్ను కిం ॥ 36
హతో వాప్రాప్స్య సిస్వర్గం జిత్వావాభోక్ష్య సేమహీం
తస్మాదుత్తిష్ఠ కౌంతేయ యుద్ధాయ కృతనిశ్చయః ॥ 37
సుఖదుఃఖే సమే కృత్యా లాభాలాభౌ జయాజయా
తతో యుద్ధాయ యుజ్యస్వ నైవం పాపమవాప్స్యసి ॥ 38
ఏషా తేఽభిహితా సాంఖ్యే బుద్ధిర్యో గేత్విమాంశృణు
బుద్ధ్యా యుక్తోయయా పార్ధకర్మ బంధం ప్రహాస్యసి ॥ 39
నేహాభిక్రమనాశోఽస్తి ప్రత్యవాయో న విద్యతే
స్వల్పమప్యస్య ధర్మస్య త్రాయ తేమహతో భయాత్ ॥ 40
వ్యవసాయాత్మికా బుద్ధి రేకేహ కురునందన
బహుశాఖా హ్యనం తాశ్చ బుద్ధయోఽవ్యవసాయినాం ॥ 41
యామిమాం పుష్పితాం వాచం ప్రవదంత్యవివశ్చితః
వేదవాదరతాః పార్ధ నాన్యద స్తీతి వాదినః ॥ 42
కామాత్మానస్స్వర్గపరా జన్మకర్మ ఫలప్రదాం
క్రియావిశేషబహుళాం భోగైశ్వర్యగతిం ప్రతి ॥ 43
భోగైశ్వర్యప్రసక్తానాం తయాపహృత చేత సాం
వ్యవసాయాత్మికా బుద్ధిస్సమాధౌ న విధీయ తే ॥ 44
త్రైగుణ్యవిషయా వేదానిస్త్రైగుణ్యో భవార్జున
నిర్ద్వంద్వో నిత్యసత్వస్థో నిర్యోగ క్షేమ ఆత్మవాన్ ॥ 45
యావానర్ధ ఉదపానే సర్వతస్సంప్లుతోదకే
తావాన్ సర్వేషు వే దేషు బ్రాహ్మణస్య విజానతః ॥ 46

కర్మణ్యే వాధికారస్తే మాఫలేషు కదాచన
మా కర్మఫల హేతుర్భూర్మాతే సంగోఽ స్త్వకర్మణి ॥ 47
యోగస్థః కురు కర్మాణి సంగం త్యక్త్వా ధనంజయ
సిద్ధ్యసిద్ధ్యోస్సమో భూత్వాసమత్వం యోగ ఉచ్యతే ॥ 48
దూరేణ హ్యవరం కర్మబుద్ధి యోగాద్దనంజయ
బుద్ధౌ శరణమన్విచ్ఛ కృపణాః ఫలహేతవః ॥ 49
బుద్ధియుక్తో జహాతీహ ఉభే సుకృత దుష్కృతే
తస్మాద్యోగాయయుజ్యస్వయోగః కర్మసు కౌశలం ॥ 50
కర్మజం బుద్ధి యుక్తాహి ఫలం త్యక్త్వా మనీషిణః
జన్మబంధవినిర్ముక్తాః పదం గచ్ఛంత్యనామయం ॥ 51
యదా తే మోహకలిలం బుద్ధిర్వ్యతితర రిష్యతి
తదా గంతాసి నిర్వేదం శ్రోతవ్యస్య శ్రుతస్య చ ॥ 52
శ్రుతి విప్రతిపన్నా తే యదా స్థాస్యతి నిశ్చలా
సమాధవచలా బుద్ధి స్తదా యోగ మవాప్స్యసి ॥ 53
స్థిత ప్రజ్ఞస్య కా భాషా సమాధిస్థస్య కేశవ
స్థితధీః కిం ప్రభాషేత కీమాసీత వ్రజేతకిం ॥ 54
ప్రజహాతియదాకామాన్ సర్వాన్ పార్థమనోగతాన్
ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థితప్రజ్ఞ స్తదోచ్య తే ॥ 55
దుఃఖేష్వనుద్విగ్నమనాస్సుఖేషు విగతస్పృహః
వీత రాగ భయక్రోధః స్థితధీర్మునిరుద్య తే ॥ 56
యస్సర్వత్రానభిస్నేహస్తత్తత్ ప్రాప్యశుభాశుభమ్
నాభినందతి న ద్వేష్టి తస్యప్రజ్ఞా ప్రతిష్ఠి తా ॥ 57
యదా సంహరతే చాయంకూర్మో ఽంగానీ వసర్వశః

ఇంద్రియాణీంద్రియార్ధేభ్య స్తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠి తా ॥ 58
విషయా వినివర్తంతే నిరాహార స్య దేహినః
రసవర్జం రసోఽ వ్యస్య పరం దృష్ట్వా నివర్తతే ॥ 59
య తతో హ్యపి కౌంతేయ పురుషస్య వివశ్చితః
ఇంద్రియాణి ప్రమాథీని హరంతి ప్రసభం మనః ॥ 60
తాని సర్వాణి సంయమ్య యుక్త ఆసీత మత్పరః
వ శేహి యస్యేంద్రియాణి తస్య ప్రజా ప్రతిష్టి తా ॥ 61
ధ్యాయతో విషయాన్ పుంసస్సంగస్తే షూపజాయతే
సంగాత్సంజాయతే కామః కామత్ క్రోధోఽ భిజాయ తే ॥ 62
క్రోధాద్భవతి సంమోహస్సం మోహాత్ స్మృతివిభ్రమః
స్మృతిభ్రంశాద్బుద్ధినాసో బుద్దినాశాత్ ప్రణశ్యతి ॥ 63
రాగ ద్వేషవియు క్తైస్తు విషయానింద్రియైశ్చరన్
ఆత్మవశ్యైర్వి ధేయాత్మా ప్రసాదమధిగచ్ఛతి ॥ 64
ప్రసాదే సర్వదుఃఖానాం హానిరస్యో పజాయతే
ప్రసన్న చేతసో హ్యాశు బుద్ధిః పర్యవతిష్ఠతి ॥ 65
నాస్తి బుద్ధియు క్తస్య న చాయుక్తస్య భావనా
న చాభావయతశ్శాంతి రశాంతస్య కుతస్సుఖం ॥ 66
ఇంద్రియాణాం హి చరతాంయన్మనోఽ నువిధియతే
తదస్య హరతి ప్రజ్ఞాం వాయుర్నామివాంభసి ॥ 67
తస్మాద్యస్య మహాబాహో నిగృహీతాని సర్వశః
ఇంద్రియాణీంద్రియార్ధేభ్య స్తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠి తా ॥ 68
యా నిశా సర్వభూతానాంతస్యాంజాగర్తిసంయమో
యస్యాం జాగ్రతి భూతానిసాని శాపశ్యతో మునేః ॥ 69
ఆపూర్యమాణ మచల ప్రతిష్ఠంసముద్రమాపః ప్రవిశంతి యద్యత్

తద్వత్కామాయం ప్రవిశంతి సర్వే స శాంతిమాప్నోతి న కామ కామీ ॥ 70

విహాయ కామాన్ యస్సర్వాన్ పుమాంశ్చరతి నిస్స్పృహః

నిర్మమో నిరహం కారస్స శాంతి మధిగచ్ఛతి ॥ 71

ఏషాబ్రాహ్మీస్థితిః పార్థనైనాం ప్రాప్యవిముహ్యతి

స్థిత్వా స్యామంత కాలేఽపిబ్రహ్మనిర్వాణమృచ్ఛతి ॥ 72

తృతీయా ధ్యాయము

జ్యాయసీచేత్కర్మణస్తే మతాబుద్ధిర్జనార్ధన
తత్కిం కర్మణి ఘోరే మాం నియోజయసీ కేశవ ॥ 1
వ్యామిశ్రేణేవ వాక్యేన బుద్ధింమోహయసేవ మే
తదేకం వదనిశ్చిత్యయేనశ్రేయోఽహమాప్నుయాం ॥ 2
లోకేఽస్మిన్ ద్వివిధా నిష్ఠా పురా ప్రోక్తా మయాఽనఘ
జ్ఞానయోగేన సాంఖ్యానాం కర్మయోగేన యోగినాం ॥ 3
న కర్మణామనారంభాన్నైష్కర్మ్యం పురుషోఽశ్నుతే
న చ సన్న్యసనా దేవ సిద్ధిం నమధిగచ్ఛతి ॥ 4
న హి కశ్చిత్ క్షణ మపి జాతు తిష్ఠత్యకర్మకృత్
కార్యతే హ్యవశః కర్మ సర్వః ప్రకృతిజైర్గుణైః ॥ 5
కర్మేంద్రియాణి సంయమ్యయ ఆస్తే మనసాస్మరన్
ఇంద్రియార్థాన్ విమూఢాత్మామిథ్యాచారస్స ఉచ్యతే ॥ 6
యస్త్వింద్రియాణి మనసా నియమ్యా రభతేఽర్జున
కర్మేంద్రియైః కర్మయోగమసక్తస్సవిశిష్యతే ॥ 7
నియతం కురు కర్మ త్వంకర్మ జ్యాయో హ్యకర్మణః
శరీరయాత్రా పి చ తే న ప్రసిద్ధ్యేదకర్మణః ॥ 8
యజ్ఞార్థాత్ కర్మణోఽన్యత్రలోకోఽయం కర్మబంధనః
తదర్థం కర్మ కౌంతేయ ముక్త సంగస్సమాచర ॥ 9
సహ యజ్ఞాః ప్రజా సృష్ట్వా పురోవాచప్రజాపతిః
అనేన ప్రసవిష్యధ్వమేష వోఽస్త్విష్టకామధుక్ ॥ 10
దేవాన్ భావయతానేన తే దేవా భావయంతువః
పరస్పరం భావయంతః శ్రేయః పరమవాప్స్యథ ॥ 11
ఇష్టాన్భోగాన్ హివో దేవాదాస్యం తేయజ్ఞ భావితాః
తైర్దత్తాన ప్రదాయైభ్యో యోభుఙ్క్తేస్తేన ఏవసః ॥ 12

యజ్ఞశిష్టాశినస్సంతో ముచ్యంతే సర్వకిల్బిషైః
భుంజతే తేత్వఘంపాపాయేపచం త్యాత్మకారణాత్ ॥ 13
అన్నాద్భనంతి భూతాని పర్జన్యాదన్న సంభవః
యజ్ఞాద్భవతి పర్జన్యోయజ్ఞః కర్మసముద్భవః ॥ 14
కర్మబ్రహ్మోద్భవం విద్ధి బ్రహ్మాక్షరసముద్భవం
తస్మాత్సర్వగతం బ్రహ్మ నిత్యం యజ్ఞే ప్రతిష్ఠితం ॥ 15
ఏవం ప్రవర్తితం చక్రం నానువర్తయతీహ యః
అఘాయురింద్రియారామో మోఘం పార్థ సజీవతి ॥ 16
యస్త్వాత్మరతిరేవ స్యాదాత్మ తృప్తశ్చ మానవః
ఆత్మన్యేవ చ సంతుష్టస్తస్య కార్యం న విద్యతే ॥ 17
నైవతస్య కృతేనార్థో నాకృతేనేహ కశ్చన
న చాస్య సర్వభూతేషు కశ్చిదర్థవ్యపాశ్రయః ॥ 18
తస్మాదసక్తస్సతతం కార్యం కర్మ సమాచర
ఆసక్తో హ్యాచరన్ కర్మ పరమాప్నోతి పూరుషః ॥ 19
కర్మణైవ హి సంసిద్ధిమాస్థితా జనకాదయః
లోకసంగ్రహమేవాపిసంపశ్యన్ కర్తుమర్హసి ॥ 20
యద్యదాచరతి శ్రేష్ఠస్తత్త దేవేతరో జనః
స యత్ప్రమాణం కురుతే లోకస్త దనువర్తతే ॥ 21
న మే పార్థాస్తికర్తవ్యం త్రిషు లోకేషు కించన
నానవాప్త మవాప్తవ్యం వర్త ఏవ చ కర్మణి ॥ 22
యదిహ్యాహం న వర్తేయం జాతు కర్మణ్యతంద్రితః
మమ వర్త్మానువర్తంతే మనుష్యాః పార్థసర్వశః ॥ 23
ఉత్సీ దేయురిమే లోకా న కుర్యాం కర్మ చేదహం
సంకరస్య చ కర్తాస్యాముపహన్యామిమాః ప్రజాః ॥ 24
సక్తాః కర్మణ్యవిద్వాంసో యథా కుర్వంతి భారత
కుర్యాద్విద్వాంస్త థాసక్తశ్చికీర్షుర్లోకసంగ్రహం ॥ 25

న బుద్ధిభేదం జనయేదజ్ఞానాం కర్మసంగినాం
జోషయేత్సర్వక ర్మాణివిద్వాన్ యుక్తస్సమాచరన్ ॥ 26
ప్రకృతేః క్రియమాణాని గుణైః కర్మాణి సర్వశః
అహంకార విమూఢాత్మా కర్తాహమితి మన్యతే ॥ 27
తత్త్వ విత్తు మహాబాహో గుణకర్మవిభాగయోః
గుణా గుణేషు వర్తంత ఇతి మత్వా న సజ్జతే ॥ 28
ప్రకృ తేర్గుణసంమూఢాస్సజ్జంతే గుణకర్మసు
తానకృత్స్నవిదోమందాన్ కృత్స్న విన్నవిచాలయేత్ ॥ 29
మయి సర్వాణి కర్మాణి సన్న్యస్యాధ్యాత్మ చేతసా
నిరాశీర్నిర్మమో భూత్వా యుధ్యస్వ విగతజ్వరః ॥ 30
యే మే మతమిదం నిత్యమనుతిష్ఠంతి మానవాః
శ్రద్ధావంతోఽనసూయతో ముచ్యంతే తేఽపికర్మభిః ॥ 31
యే త్వేతదభ్యసూయంతో నానుతిష్ఠంతిమే మతం
సర్వజ్ఞాన విమూఢాంస్తాన్ విద్ధి నష్టానచేతసః ॥ 32
సదృశం చేష్ట తే స్వస్యాః ప్రకృతేర్జ్ఞానవానపి
ప్రకృతిం యాంతి భూతాని నిగ్రహః కిం కరిష్యతి ॥ 33
ఇంద్రియ స్యేంద్రియస్యార్థే రాగద్వేషౌ వ్యవస్థితౌ
తయోర్న వశమాగచ్ఛేత్తౌ హ్యస్య పరివంథినౌ ॥ 34
శ్రేయాన్ స్వధర్మోవిగుణః పరధర్మాత్స్వనుష్ఠితాత్
స్వ ధర్మేనిధనం శ్రేయః పరధర్మో భయావహః ॥ 35
అథ కేన ప్రయుక్తోఽయం పాపం చరతి పూరుషః
అనిచ్ఛన్నపి వార్ష్ణేయ బలాదివ నియోజితః ॥ 36
కామ ఏష క్రోధ ఏష రజోగుణసముద్భవః
మహాశనో మహాపాప్మా విద్ధ్యేనమిహ వైరిణం ॥ 37
ధూమే నావ్రియతే వహ్నిర్యథాఽఽదర్శో మలేన చ
యథో ల్బేనావృతో గర్భస్తథా తేనేద మావృతం ॥ 38

ఆవృతం జ్ఞానమే తేన జ్ఞానినో నిత్యవైరిణా
కామరూపేణ కౌంతేయ ! దుష్పూ రేణానలేన చ ॥ 39
ఇంద్రియాణి మనో బుద్ధిరస్యాధిష్ఠాన ముచ్యతే
ఏతైర్విమోహయ త్యేష జ్ఞానమావృత్య దేహినం ॥ 40
తస్మాత్త్వమింద్రియాణ్వాదౌ నియమ్య భరతర్షభ
పాప్మానం ప్రజహి హ్యేనం జ్ఞానవిజ్ఞాననాశనం ॥ 41
ఇంద్రియాణి పరాణ్యాహురింద్రియేభ్యః పరంమనః
మనసస్తు పరాబుద్ధిర్గ్యో బుద్ధేః పరతఅస్తునః ॥ 42
ఏనం బుద్ధేః పరం బుధ్యాసం స్తభ్యాత్మాన మాత్మనా
బహి శత్రుం మహాబాహో కామరూపం దురాసదం ॥ 43